www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 23-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 168 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య ఉ.11:36 తదుపరి పాడ్యమి, నక్షత్రం: మఖ రా. 12:55 తదుపరి పుబ్బ వర్జ్యం:మ.12:36-2:14, దుర్ముహూర్తం: ఉ.6:03-7:43, అమృతఘడియలు: రా.10:27-12:05, రాహుకాలం:ఉ.9:00-10:30, సూర్యోదయం:6:03, సూర్యాస్తమయం: 6:32 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయ్
25 నుంచి ఇంటింటికీ ఉచితంగా పంపిణీ
తొలి విడతలో 9 జిల్లాల్లో పంపిణీకి చర్యలు
12



● అయ్యో.. చెయ్యి లేదు!

ఫేక్ డ్రామా రట్టు

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పి.రమేశ్. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం నారసింపల్లి గ్రామం. ఈ ఫొటో చూడగానే పాపం ఒక చెయ్యి లేదని అనుకుంటారు కదూ..! తాను దివ్యాంగుడినని, అన్యాయంగా తన పింఛన్ తీసేశారని అతను సెల్ఫీ వీడియోను 'పుష్ప.. ద మాస్' పేరిట సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అసలు విషయం ఏంటంటే.. అతను దివ్యాంగుడు కాదు. రెండు చేతులూ బాగున్నాయి. చక్కగా పొలం పనులు కూడా చేసుకుంటున్నాడు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అయిన రమేశ్ కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికే ఇలా దుష్ప్రచారానికి ఒడిగట్టాడు. తన చెయ్యి వెనక్కి మడత పెట్టి చొక్కాలో దాచుకుని డ్రామా ఆడాడు. అతను దివ్యాంగుడు కాదని చెప్పడానికి కుడి పక్క ఫొటోనే తిరుగులేని సాక్ష్యం. ఇందులో ఒక చేత్తో గొడుగు పట్టుకుని, ఇంకో చెయ్యి పైకి ఎత్తి ఉన్న వ్యక్తి కూడా రమేశే. గత వైసీపీ ప్రభుత్వంలో అతడికి పింఛన్ రాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసేసిందీ లేదు. కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యంగా వైసీపీ నేతలు తమ సోషల్ మీడియా కార్యకర్తల ద్వారా ఇలాంటి ఫేక్ వీడియోలు చేయించి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. వైసీపీ సైకోయిజం బాగా వంటబట్టించుకున్న రమేశ్.. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను నరుకుతానని బెదిరిస్తూ, దుర్భాషలాడుతూ వీడియోలు పెట్టాడు. - బుక్కపట్నం, ఆంధ్రజ్యోతి

● చెయ్యి.. వచ్చిందోచ్!



పింఛన్‌పై ఫేక్ రచ్చ

కూటమి ప్రభుత్వంపై వైసీపీ విషం
దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై అసత్యాలు

చెయ్యి ఉన్నా లేనట్టు నటిస్తూ వీడియో
వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త డ్రామా
సహజ మరణాలూ 'తొలగింపు' ఖాతాలోకే
జగన్ రోత పత్రికలో కట్టు కథలు
కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యం
నిన్నటిదాకా అమరావతి.. నేడు పింఛన్లపై..



(అమరావతి-ఆంధ్రజ్యోతి)
నిత్యం ఏదో ఒకవిధంగా కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేయడం కోసం వైసీపీ ఫేకులు కట్టుకథలు అల్లుతున్నారు. ఇందుకు ప్రతి సందర్భాన్నీ ముడిసరుకుగా వాడుకుంటున్నారు. తాజాగా దివ్యాంగ పింఛన్ల తొలగింపు అంశాన్ని వక్రీకరిస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను చేతులూ, కాళ్లూ లేని దివ్యాంగులుగా చూపుతూ, కూటమి ప్రభుత్వ నిర్వాకంతో పింఛన్లు
మిగతా 13వ పేజీలో...

అమరావతి మునిగిపోయిందంటూ.. ప్రకాశం బ్యారేజీ గేట్లు ఊడిపోయి విజయవాడ నగరం కూడా మునిగిపోతుందంటూ నిన్నటి వరకు అసత్య కథనాలు ప్రచారం చేశారు.

ఇప్పుడు మరింత బరితెగించారు. అన్ని అవయవాలూ సక్రమంగా ఉన్నా.. చేతులూ, కాళ్లూ లేని దివ్యాంగులుగా చూపుతూ అన్యాయంగా పింఛన్లు తీసేస్తున్నారంటూ ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారు.

వైసీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలు కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విషం చిమ్ముతున్నారు. వైసీపీ రోత మీడియా, దాని అనుకూల మీడియా ఈ ఫేక్ ప్రచారానికి వంత పాడుతున్నాయి. ప్రభుత్వంపై బురదజల్లడంతో పాటు ప్రజల్లో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో సంక్షేమం
తప్పనిసరి

ఆర్థికాభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం
పేద, ధనిక అంతరం తగ్గించడానికే పీ-4
ప్రభుత్వానికి ప్రైవేటు రంగం తోడ్పడాలి
క్వాంటమ్ ఫలితాలు జనవరిలో కనిపిస్తాయి
భారత్ శక్తిని ఎవరూ అడ్డుకోలేరు
ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తట్టుకోగలం
అమెరికా సుంకాలతో సమస్యలు తాత్కాలికమే
మోదీ ప్రపంచంలోనే బలమైన నాయకుడు
ఆయన ప్రధాని కావడం గర్వకారణం: చంద్రబాబు
ఈటీ వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక దేశంలో సంక్షేమం తప్పనిసరని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. భారతదేశం ఎదుగుతున్న క్రమంలో ఆర్థిక అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడం అవసరమన్నారు. అప్పుడే పేదరికాన్ని నిర్మూలించగలమని చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీ తాజ్ ప్యాలెస్‌లో 'వరల్డ్ లీడర్స్ ఫోరం-2025' పేరిట ఎకనమిక్ టైమ్స్ పత్రిక ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 'ఉన్నవారికి, లేనివారికి మధ్య అగాథాన్ని ఎలా పూరించాలన్నదే
మిగతా 13వ పేజీలో...



శుక్రవారం ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం చంద్రబాబు

విపక్షాల అభ్యర్థికి మేమెలా మద్దతిస్తాం?
ఎన్నికల ముందు నుంచీ ఎన్డీయేలోనే ఉన్నాం
కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్నది మా ప్రభుత్వాలే
అలాంటప్పుడు మా మద్దతెలా ఆశిస్తారు?
ఓడిపోతామని తెలిసీ అభ్యర్థిని నిలబెట్టడం అవసరమా?.. ఇది 'ఇండీ' రాజకీయం: సీఎం

'సాస్కీ' కింద 5 వేల కోట్లివ్వండి
ఆర్థిక మంత్రి నిర్మలకు చంద్రబాబు వినతి
'పూర్వోదయ' విధివిధానాలు రూపొందించండి
ఈ పథకాన్ని త్వరగా అమలు చేయండి: సీఎం
13

సురవరం ఇక లేరు
సీపీఐ అగ్రనేత సుధాకర్‌రెడ్డి కన్నుమూత

అనారోగ్యంతో హైదరాబాద్‌లో తుదిశ్వాస
ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం మగ్దూంభవన్‌కు సుధాకర్ రెడ్డి భౌతికకాయం
వైద్య పరిశోధనల కోసం గాంధీ ఆస్పత్రికి ఆయన పార్థివ దేహం.. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి నేత్రదానం
ఏఐఎస్ఎఫ్ సభ్యుడి నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి దాకా ఎదిగిన కమ్యూనిస్ట్ దిగ్గజం

నమ్మిన సిద్ధాంతానికి జీవితాంతం కట్టుబడ్డ నేత


11

అంతా పైవాళ్లకే తెలుసు!
మద్యం పాలసీపై నారాయణస్వామి మాట

వైసీపీ హయాంలో ఎక్సైజ్ మంత్రిగా విధులు
పుత్తూరులో 7 గంటలు ప్రశ్నించిన 'సిట్'
పాలసీ మార్పు, ముడుపులపై ప్రశ్నలు
అన్నీ వాళ్లే నిర్ణయించారన్న స్వామి
ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ సీజ్
బాడీ కెమెరాలు ధరించి ఇంట్లోకి
మొత్తం రికార్డు చేసిన అధికారులు



తిరుపతి/పుత్తూరు/అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'నాకు ఏమీ తెలియదు. అంతా పై వాళ్ల నిర్ణయమే!'... అని వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేసిన నారాయణస్వామి స్పష్టం చేసినట్లు తెలిసింది. ముడుపులకు వీలుగా మద్యం పాలసీని మార్చడంలో తన పాత్ర, ప్రమేయం ఏమీ లేదని చెప్పినట్లు సమాచారం. లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు శుక్రవారం తిరుపతి జిల్లా పుత్తూరులో మాజీ మంత్రిని 7 గంటల పాటు విచారించారు. దోపిడీకి అనుకూలంగా జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ, ఆన్‌లైన్ ఆర్డర్ల విధానం రద్దు, మద్యం కొనుగోళ్లలో డిజిటల్ పేమెంట్
మిగతా 12వ పేజీలో...

దేవదాయ ఏసీ శాంతికి షోకాజ్



కంపల్సరీ రిటైర్‌మెంట్‌కు ఏర్పాట్లు
సర్వీసు అంతా అక్రమాలు, వివాదాలు
12

యూరియా.. సమస్య ఎందుకయా?
ఆందోళన వద్దంటున్న ప్రభుత్వం
అవసరానికి సరిపడా ఎరువులు
ఒక్కసారిగా పెరిగిన వినియోగం
రబీ సీజన్‌కూ ఇప్పుడే కొనుగోళ్లు
సమస్యకు అదే కారణమని విశ్లేషణ


14

మంత్రి నారాయణ అల్లుడికి బురిడీ!
అకౌంటెంట్‌కు మెసేజ్ పెట్టి 1.96 కోట్లు లూటీ
వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం
సైబర్ నేరాళ్ల ఖాతాలోని కోటీ 40 వేలు ఫ్రీజ్
గత నెలలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..
2

అమెరికాలో 5.5 కోట్ల మంది విదేశీయుల వీసాల పరిశీలన

జైలు నుంచి పాలన
కుదరదు
50 గంటలు జైల్లో ఉంటే ఉద్యోగి తన జాబ్ కోల్పోతాడు
ప్రధానమంత్రి, సీఎం, మంత్రులకు ఈ రూల్ వర్తించదా?



జైల్లో ఉన్నా ప్రభుత్వంలో కొనసాగుతున్నారు
నేతలే ఇలా ఉంటే అవినీతిపై పోరాడేదెలా?
కాంగ్రెస్ పాలనలో అవినీతిపై పెద్ద చిట్టానే ఉంది
బిహార్‌లో ఆర్జేడీ పాలన 'లాంతరు యుగం'
బెంగాల్ అభివృద్ధికి తృణమూలే అడ్డంకి: మోదీ
బిహార్, పశ్చిమ బెంగాల్‌లో వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: తీవ్ర నేరారోపణలతో అరెస్టయిన వ్యక్తులు జైలు నుంచి పాలన సాగించడం ఇకపై కుదరదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 30 రోజులకు పైగా జైలులో ఉన్న పీఎం, సీఎం, కేంద్ర, రాష్ట్రాల మంత్రులు 31వ రోజున ఆటోమేటిగ్గా పదవిని కోల్పోయేలా తీసుకొచ్చిన బిల్లులను ఆయన సమర్థించారు. "50 గంటల పాటు జైలు శిక్ష అనుభవించిన ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతాడు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, మంత్రులకు ఈ నిబంధన ఎందుకు వర్తించదు? వారు జైల్లో ఉన్నా కూడా ప్రభుత్వంలో కొనసాగుతున్నారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచే ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. నాయకులే ఇలా ఉంటే... ఇక అవినీతిపై ఎలా పోరాడగలం" అని ప్రధాని ప్రశ్నించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఆయన శుక్రవారం పర్యటించారు. గయజీలో విద్యుత్తు,
మిగతా 2వ పేజీలో...

సుదర్శన్‌రెడ్డి నక్సల్స్ మద్దతుదారు: షా
అందుకనే సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పునిచ్చారు
ఆ తీర్పు రాకపోతే ఐదేళ్ల కిందే నక్సలిజం అంతం
లెఫ్ట్ ఒత్తిడితోనే ఆయనను అభ్యర్థిగా నిలబెట్టారు
అమిత్‌షా తీవ్ర ఆరోపణలు


2

వైసీపీపై 'ఇండీ' కన్ను!
ఉపరాష్ట్రపతి బరిలో మద్దతు కోసం ఆ పార్టీ ఎంపీలతో మంతనాలు
సుబ్బారెడ్డితో మాట్లాడిన జైరాం
రఘునాథరెడ్డిని పిలిపించుకున్న ఖర్గే
జగన్‌తోనూ టచ్‌లోకి కాంగ్రెస్
13



జలదిగ్బంధంలో అల్లూరి జిల్లాలోని కూనవరం మండల కేంద్రం

నిలకడగా గోదావరి
ధవళేశ్వరం వద్ద వరద క్రమంగా తగ్గుముఖం
అత్యధికంగా 13,57,119 క్యూసెక్కులు సముద్రంలోకి
లంక గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ నీట మునక
పోలవరం నుంచి 11.87లక్షల క్యూసెక్కులు విడుదల
ముంపు మండలాలను వదలని వరద
14

గోదావరి లెక్కల్లో స్పష్టతేదీ?

మిగులు జలాలు తేల్చకుండా కావేరి వరకు అనుసంధానమెలా?
ఛత్తీస్‌గఢ్ 147 టీఎంసీలనూ వాడుకుంటే ఈ పథకానికి నీళ్లెక్కడ?
గంగా జలాలు ఎప్పుడొస్తాయి?.. ఎన్‌డబ్ల్యూడీఏను నిలదీసిన ఏపీ
గోదావరి నీటిని వయా తెలంగాణ పంపుతామంటే అంగీకరించం
పోలవరం-బనకచర్ల ద్వారా కావేరితో సంధానాన్ని పరిశీలించండి
చింతలపూడి, ఉత్తరాంధ్ర, గోదావరి-పెన్నార్‌ను ఫేజ్-1లో చేర్చండి
రాష్ట్రం సూచనలు.. ఇచ్చంపల్లి నుంచి కాకుండా సమ్మక్క-సారలమ్మ నుంచి తరలించాలి: తెలంగాణ.. త్వరలో మళ్లీ భేటీ: ఎన్‌డబ్ల్యూడీఏ

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాల గణాంకాలపై స్పష్టత లేకుండానే.. గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియను చేపట్టేందుకు సిద్ధం కావడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆక్షేపించింది. ఛత్తీస్‌గఢ్‌కు కేటాయించిన 147 టీఎంసీలనూ వాడుకుంటామని వెల్లడించినందున.. గోదావరి మిగులు జలాలపై స్పష్టత రావలసి ఉందని తెలిపింది. తెలంగాణ నుంచి నాగార్జున సాగర్, సోమశిల గుండా గోదావరి జలాలను కావేరికి తరలిస్తామంటే అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. జాతీయ నదుల అనుసంధాన ప్రక్రియలో భాగంగా గోదావరి-కావేరి నదులను కలిపే పథకానికి పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును వినియోగించుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. శుక్రవారం హైదరాబాద్ జలసౌధలో
మిగతా 3వ పేజీలో...

అరుణ గ్యాంగ్ కోసం పోలీస్ వేట!



నెల్లూరు(క్రైం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కి'లేడీ' నిడిగుంట అరుణ, రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్‌ల నేర సామ్రాజ్యాన్ని వెలికి తీసేందుకు పోలీస్ యంత్రాంగం విస్తృత కసరత్తు చేస్తోంది. వైసీపీ హయాంలో బెదిరింపులు, దాడులు, హత్యలు, బ్లాక్‌మెయిల్, దందాలకు పాల్పడుతూ పోలీసు ఉన్నతాధికారులను వలలో వేసుకొని ఎవరినీ లెక్క
మిగతా 13వ పేజీలో...

డీఎస్సీలో మహిళా సత్తా
మెరిట్ జాబితాలు విడుదల
రాష్ట్రస్థాయి టాపర్లలో మహిళా అభ్యర్థులదే పైచేయి
త్వరలో సర్టిఫికెట్ల పరిశీలన
అనంతరం నియామక పత్రాలు



ఇకపై ఏటా డీఎస్సీ: లోకేశ్
12



జీఎస్‌బీ సేవామండల్ ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం

వినాయక మండపానికి రూ.474కోట్ల బీమా

ముంబై, ఆగస్టు 22: గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ముంబైలో జీఎస్‌బీ సేవా మండల్ ఏర్పాటు చేసిన వినాయక మండపానికి ఏకంగా రూ.474.46కోట్ల బీమా చేయించారు. సియాన్ ప్రాంతంలోని కింగ్స్ సర్కిల్‌లో ఈ వినాయక మండపాన్ని నిర్మించారు. ఇక్కడి వినాయకుడిని 69కిలోల బంగారం, 336కిలోల వెండి ఆభరణాలతో పాటు భక్తులు సమర్పించిన ఖరీదైన వస్తువులతో అలంకరించారు. అందుకే ఇంత భారీ మొత్తంలో బీమా చేయించారు. గతేడాది కూడా ఈ మండపానికి రూ.400.58కోట్ల బీమా తీసుకున్నారు.

మూతపడ్డ ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: డ్రీమ్11, మై11సర్కిల్, విన్‌జో, జూపీ, పోకర్‌బాజీ వంటి పలు ప్రముఖ సంస్థలు తమ ఆన్‌లైన్ మనీ గేమింగ్ సర్వీసులను నిలిపివేశాయి. దీనికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ ఇవ్వకుండానే వాటిని నిలిపివేయడం గమనార్హం. నిజమైన డబ్బుతో ఆడే అన్ని రకాల గేమింగ్ సేవలనూ తమ ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేసినట్టు.. మై11సర్కిల్ ఆన్‌లైన్ ఫాంటసీ గేమును నిర్వహించే 'ప్లేగేమ్స్ 24/7 ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించింది. దిగ్గజ క్రికెటర్లు ధోనీ, రోహిత్ శర్మ, బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ వంటివారు ప్రమోట్ చేసిన డ్రీమ్11 సేవలను కూడా 'ద ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్, 2025' ఆమోదం పొందిన నేపథ్యంలో నిలిపివేసినట్టు ఆ సంస్థ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. తమ యాప్‌లో ఉన్న వినియోగదారుల సొమ్ము సురక్షితంగా ఉందని, యూజర్లు తమ సొమ్మును ఉపసంహరించుకోవచ్చని పోకర్‌బాజీ సంస్థ 'ఎక్స్' పోస్టు ద్వారా తెలిపింది. ఇక, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లను నిషేధిస్తూ కేంద్రం రూపొందించిన 'గేమింగ్ బిల్లు'కు రాష్ట్రపతి ముర్ము శుక్రవారం ఆమోదం తెలిపారు. దీంతో, ఈ బిల్లు చట్టంగా మారింది.


20 ఏళ్లు దాటిన వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజు పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఇరవై ఏళ్లు దాటిన పాత మోటార్ వాహనాల వాడకాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇలాంటి వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ ఫీజును భారీగా పెంచింది. ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 20 ఏళ్లు దాటిన లైట్ మోటార్ వాహనాల (ఎల్ఎంవీ) రెన్యూవల్ ఫీజును రూ.5వేల నుంచి రూ.10వేలు చేశారు. 20 ఏళ్లు దాటిన మోటార్‌సైకిళ్ల రెన్యూవల్ ఫీజు రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు, త్రీవీలర్లు, క్వాడ్రీసైకిళ్ల రెన్యూవల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5వేలకు పెంచారు.

భారత్‌లోకి మళ్లీ 'టిక్‌టాక్'?

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ప్రముఖ షార్ట్ వీడియో యాప్ 'టిక్‌టాక్' సేవలు మళ్లీ భారత్‌లో అమల్లోకి రాబోతున్నాయంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇందుకు కారణం ఐదేళ్లుగా కనిపించని టిక్‌టాక్ వెబ్‌సైట్ భారత్‌లో మొదటిసారి అనేక మందికి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రావడమే.. ఈ విషయాన్ని కొందరు సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో పలు ఊహాగానాలకు దారితీసింది. ప్లే స్టోర్‌లో ఇప్పటివరకు ఈ యాప్ అందుబాటులోకి రాలేదు. అలాగే టిక్‌టాక్ సేవలను భారత్‌లో తిరిగి ప్రారంభించే విషయమై మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ కంపెనీ కూడా ఏ ప్రకటన చేయలేదు.

ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత



లండన్, న్యూఢిల్లీ, ఆగస్టు 22: ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ లండన్‌లో గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయన వయస్సు 94 ఏళ్లు. కపారో గ్రూప్ పేరిట యూకేలో పలు పరిశ్రమలు స్థాపించిన ఆయన ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే కన్ను మూశారు. భారత్‌లోని జలంధర్‌లో జన్మించిన ఆయన 1960లో తన కుమార్తె అంబిక క్యాన్సర్ చికిత్స కోసం యూకే చేరుకున్నారు. కాలక్రమంలో యూకే ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యుడయ్యారు. నాలుగేళ్ల వయస్సులోనే తన కుమార్తె అంబిక క్యాన్సర్‌తో మృతి చెందడంతో అంబికాపాల్ ఫౌండేషన్, చారిటబుల్ ట్రస్ట్‌ని స్థాపించారు. దీని ద్వారా బాలల ఆరోగ్యం, విద్య కోసం ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల డాలర్లు దానం చేశారు. 2015లో తన కుమారుడు అంగద్‌పాల్, 2022లో ఆయన భార్య అరుణ మృతి చెందగా వారి జ్ఞాపకార్థం ఇదేవిధంగా పలు దాన కార్యక్రమాలు చేపట్టారు.


మంత్రి నారాయణ అల్లుడికి బురిడీ..!

నెల్లూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సామాన్యుల నుంచి వీఐపీల వరకూ సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి కోట్లు పోగొట్టుకుంటున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పెద్ద అల్లుడు పునీత్ పేరిట సైబర్ నేరగాళ్లు రూ.1.96 కోట్లు లూటీ చేసిన ఘటన కూడా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే దీనిపై వెంటనే సమాచారం అందడంతో అప్రమత్తమైన నెల్లూరు రూరల్ పోలీసులు సైబర్ నేరగాళ్ల ఖాతా నుంచి కోటీ 40 వేల రూపాయలు ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కొన్నిరోజుల క్రితం మంత్రి నారాయణ పెద్ద అల్లుడు పునీత్ నిర్వహిస్తున్న ఐవీ గ్రీన్ ఇన్‌ఫ్రా అకౌంటెంట్‌కు పునీత్ పేరిట సైబర్ నేరగాళ్లు వాట్సాప్ మేసేజ్ పెట్టారు. అర్జెంట్‌గా తాను పంపిన ఖాతాకి రూ.1.96 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరడంతో అకౌంటెంట్ వెంటనే ఆ మొత్తాన్ని ఆ మెసేజ్‌లో చూపించిన బ్యాంకు ఖాతాకు పంపించారు. తర్వాత ఈ విషయం నారాయణ అల్లుడికి తెలియజేయడంతో.. ఆయన ఇదంతా సైబర్ నేరగాళ్ల పన్నాగమని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించి రూ.కోటీ 40 వేలను ఫ్రీజ్ చేయించినట్టు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. అనంతరం వారి నుంచి అందుకున్న ఫిర్యాదుతో గత నెలలో ఉత్తరప్రదేశ్‌లో సంజీవ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. న్యాయస్థానం చొరవతో రూ.49 లక్షలు విడుదలకు అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. ఈ కేసులో రెండో సూత్రధారి అయిన అరవింద్‌కుమార్ శ్రీవాత్సవ్‌ను కూడా తాజాగా ఉత్తరప్రదేశ్‌లోనే అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సైబర్ కుట్రలో ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. కాగా.. భారీ మొత్తాల్లో నగదు ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించే కరెంట్ ఖాతాదారులకు సైబర్ నేరగాళ్లు 2శాతం నగదు కమీషన్‌గా చెల్లిస్తున్నారని తమ విచారణలో తేలినట్లు సీఐ తెలిపారు.



అంతరిక్షంలో 2035 నాటికి భారత్ సొంతంగా ఏర్పాటు చేయనున్న భారతీయ అంతరిక్ష్ స్టేషన్ నమూనాను ఇస్రో ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత మండపంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాల వేళ దీన్ని ఆవిష్కరించారు. తొలి మాడ్యూల్‌ను 2028 నాటికి భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెడతారు. అంతరిక్షంలో ప్రస్తుతం ఉన్న రెండు స్టేషన్లలో ఒకటి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కాగా మరొకటి చైనా సొంతంగా నిర్మించుకున్న తియాంగాంగ్ స్పేస్ స్టేషన్.

సుదర్శన్‌రెడ్డి నక్సల్స్ మద్దతుదారు



తిరునల్వేలి సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అందుకనే సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పునిచ్చారు

- ఆ తీర్పు ఇవ్వకపోతే ఐదేళ్ల కిందటే

నక్సలిజం అంతమైపోయేది: అమిత్ షా

కొచ్చి, ఆగస్టు 22: విపక్ష కూటమి ఇండియా ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 'నక్సలిజం మద్దతుదారు' అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఒకప్పుడు నక్సలైట్లపై పోరాటానికి నడుంకట్టిన సల్వాజుడుంను నిషేధిస్తూ 2011లో ఆయన ఇచ్చిన తీర్పే దీనికి నిదర్శమన్నారు. సల్వాజుడుంను నిషేధించకపోతే నక్సలిజం 2020 నాటికే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేదని చెప్పారు. కేరళకు చెందిన ప్రముఖ మీడియాసంస్థ 'మలయాళ మనోరమ' శుక్రవారం కొచిలో ఏర్పాటు చేసిన ఒక సదస్సులో మాట్లాడుతూ అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు. నక్సలిజం భావజాలానికి ప్రేరేపితులైనందువల్లే సుదర్శన్‌రెడ్డి.. సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారన్నారు. నక్సలిజానికి మద్దతివ్వటానికి ఆయన సుప్రీంకోర్టు వంటి అత్యున్నత సంస్థను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టిందని విమర్శించారు. నక్సలిజం సమస్యతో కేరళ కూడా ఒకప్పుడు సతమతమైందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు లేవని అమిత్‌షా పేర్కొన్నారు. జైలుపాలైన ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించి తాజాగా తీసుకొచ్చిన మూడు బిల్లులను అమిత్‌షా ప్రస్తావించారు. ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ గతంలో జైలులో ఉన్నప్పటికీ సీఎం పదవికి రాజీనామా చేయని విషయాన్ని పరోక్షంగా పేర్కొంటూ.. 'జైలు నుంచే ఒక సీఎం ప్రభుత్వాన్ని నడిపించారు. అటువంటప్పుడు, ఈ బిల్లులు తీసుకురావాలా? వద్దా?' అని ప్రశ్నించారు. బిల్లులపై ప్రతిపక్షాల నిరసనను, రాజ్యాంగంలో ఇది లేదన్న వారి వాదనను ఖండించారు. 'ఇది నైతిక విలువలకు సంబంధించిన విషయం. ముఖ్యమంత్రి జైలు పాలైనప్పటికీ.. రాజీనామా చేయకుండా ఉంటారని మన రాజ్యాంగ రూపకర్తలు ఊహించి ఉండరు. అందుకనే ఇప్పుడు కొత్తగా రాజ్యాంగానికి సవరణ చేస్తున్నాం' అని అమిత్‌షా వివరించారు.

సల్వాజుడుం నిషేధం వెనుక నేపథ్యం

2005లో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో సల్వాజుడుం (శాంతియాత్ర అని అర్థం) అనే సాయుధ గ్రూపు ఏర్పాటైంది. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మహేంద్ర కర్మ దీని ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. సల్వాజుడుం కింద ఆదివాసీ యువతకు సాయుధ శిక్షణ ఇచ్చి, నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో ఉపయోగించేవారు. అయితే, సల్వాజుడుం సభ్యులు ఆదివాసీలను ఊచకోత కోస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. సల్వాజుడుంను నిషేధించాలన్న పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. విచారించిన కోర్టు 2011 డిసెంబరులో సల్వాజుడుంను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

రాహుల్ పీఎం కాలేడు.. ఉదయనిధి సీఎం కాబోడు!

చెన్నై, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో ఉన్న ప్రధాన పార్టీల నేతలంతా వారి వారసులకు పట్టం కట్టాలనే లక్ష్యం పెట్టుకున్నారని అమిత్‌షా అన్నారు. ప్రజల మేలు వారికి అవసరం లేదని విమర్శించారు. తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఏకైక లక్ష్యం.. తన కుమారుడు ఉదయనిధిని సీఎం చేయడమేనని, సోనియాగాంధీ ప్రధాన లక్ష్యం తనయుడు రాహుల్ గాంధీని పీఎం సీటలో కూర్చోబెట్టడమేనని అన్నారు. ఈ మేరకు తమిళనాడులోని తిరునల్వేలిలో శుక్రవారం జరిగిన బీజేపీ బూత్ కమిటీ నిర్వాహకుల సమావేశంలో షా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదయనిధి సీఎం కాలేడని, రాహుల్ ప్రధాని కాబోడని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో ఇటీవల ప్రధాని, మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు తీవ్ర నేరారోపణలతో అరెస్టయితే పదవి నుంచి తొలగించేందుకు వీలుకల్పించే బిల్లును ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ బిల్లును ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయని, దీనికి కారణం ప్రతిపక్ష పార్టీల్లో అత్యధిక శాతం మంది అవినీతి పరులేనన్నారు. ఈ బిల్లును తమిళనాడు సీఎం స్టాలిన్ నల్లచట్టంగా పేర్కొనటం విడ్డూరంగా ఉందన్నారు.

జైలు నుంచి పాలన కుదరదు

(మొదటి పేజీ తరువాయి)



కోల్‌కతా మెట్రోలో విద్యార్థులతో ప్రధాని మోదీ

రోడ్డు, ఆరోగ్యం, పట్టణాభివృద్ధి, నీటి సరఫరా రంగాల్లో రూ.13 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోదీ ప్రసంగించారు. ఆర్జేడీ పాలనను లాంతరు యుగంగా అభివర్ణించారు. రాష్ట్రాన్ని అంధకారం, అశాంతి, వెనుకబాటుతనంలోకి నెట్టేశారని ఆరోపించారు. బిహార్ ప్రజలను ఓటు బ్యాంకుగానే పరిగణించి, వారి ఆకాంక్షలు, గౌరవం, అభివృద్ధిని విస్మరించారని ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మూడు బిల్లులను వ్యతిరేకిస్తున్న విపక్షాలపై మోదీ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఒక్క అవినీతి కేసును కూడా ఎదుర్కోలేదని, అయితే 60-65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో వారి అవినీతికి సంబంధించిన పెద్ద చిట్టానే ఉందని ఎద్దేవా చేశారు. అందుకే ఈ బిల్లులను వారు వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లోని మమత ప్రభుత్వంపైనా ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి టీఎంసీని శత్రువుగా అభివర్ణించారు. మహిళలు, పేదల సంక్షేమం కోసం కేంద్రం పంపిన నిధులను పార్టీ కేడర్ కోసం వినియోగిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్ అభివృద్ధి చెందేవరకూ వికసిత్ భారత్ యాత్ర విజయవంతం కాదన్నారు. టీఎంసీ అధికారంలో ఉన్నంత వరకూ రాష్ట్రంలో అభివృద్ధి అనే మాట ఉండదన్నారు. అధికార దాహంతో ఉన్న టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలు అక్రమ చొరబాట్లను ప్రోత్సహిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ ప్రయోజనాలు దక్కాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. అంతకు ముందు కోల్‌కతాలో మూడు కీలక మెట్రో రైల్వే స్టేషన్లు సహా రూ.5,200 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. అలాగే హౌరా-కోల్‌కతా మధ్య కనెక్టివిటీని పెంచనున్న రూ.1,200కోట్లకు పైగా విలువైన 7.2కిలోమీటర్ల ఎలివేటెడ్ కోనా ఎక్స్‌ప్రెస్‌వేకు ప్రధాని శంకుస్థాపన చేశారు.



12 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు

- సీఎం రేవంత్‌రెడ్డిపై 89 కేసులు
- స్టాలిన్‌పై 47.. చంద్రబాబుపై 19
- ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా వెల్లడించిన ఏడీఆర్

న్యూఢిల్లీ, ఆగస్టు 22: దేశంలోని 30 మంది ముఖ్యమంత్రుల్లో 12 మంది తమపై క్రిమినల్ కేసులున్నాయని ప్రకటించారు. దీనికి సంబంధించి అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. తనపై 89 కేసులున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ తనపై 47 కేసులున్నాయని తెలపగా, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనపై 19 కేసులున్నాయని ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనపై 13 కేసులున్నాయని తెలపగా, తనపై 5 కేసులున్నాయని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ ప్రకటించారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌పై 4, హిమాచల్ ప్రదేశ్ సుఖ్వీందర్ సింగ్‌పై 4, కేరళ సీఎం పినరాయి విజయన్‌పై 2, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌పై ఒక క్రిమినల్ కేసు ఉన్నట్లు ప్రకటించారు. కనీసం 10 మంది సీఎంలు తమపై హత్యాయత్నం, కిడ్నాపింగ్, లంచాలకు సంబంధించిన అత్యంత తీవ్రమైన నేరారోపణలు ఉన్నట్లు ప్రకటించారు. కనీసం ఐదేళ్ల శిక్షపడే కేసుల్లో అరెస్టై 30 రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజు ప్రధానినైనా, ముఖ్యమంత్రినైనా, మంత్రులనైనా పదవుల్లోంచి తొలగించే బిల్లును కేంద్రం తీసుకొచ్చిన నేపథ్యంలో ఈ కేసుల వివరాలు బయటకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సందర్భంగా ఆయా ముఖ్యమంత్రులు ప్రకటించిన అఫిడవిట్‌ల ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలు సేకరించింది.

ఆధార్‌కార్డును అంగీకరించాల్సిందే

- బిహార్‌లో ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు కోసం పరిగణనలోకి తీసుకోవాల్సిందే
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా జాబితాలో పేర్లను కోల్పోయిన వారిలో ఎవరైనా తమ ఆధార్ కార్డును చూపించి తిరిగి ఓటరుగా నమోదు కావచ్చునని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పటికే పేర్కొన్న 11 డాక్యుమెంట్లతో పాటు ప్రజలను ఓటరు జాబితాలో చేర్చేందుకు ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని శుక్రవారం ఆదేశించింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం వాదనలను కొనసాగించింది. కొత్త ఓటర్ల జాబితాపై తమ అభ్యంతరాలను ఓటర్లు, బూత్ స్థాయి ఏజెంట్లు(బీఎల్ఏ) ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని సూచించింది. వ్యక్తిగతంగా బూత్ లెవల్ ఆఫీసర్ల(బీఎల్‌వో) దగ్గరికి వెళ్లి సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించనక్కర్లేదని పేర్కొంది. అయితే, సవరించిన జాబితాపై ఇప్పటివరకు కేవలం బూత్ స్థాయిల నుంచి కేవలం రెండే అభ్యంతరాలు రావడం పట్ల సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కానీ, బూత్ లెవల్ ఆఫీసర్లు ఫిర్యాదులను స్వీకరించకపోవడమే ఫిర్యాదుల సంఖ్య తక్కువగా ఉండటానికి కారణమని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ నేపథ్యంలోనే, ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను సమర్పించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.

స్టెరిలైజేషన్ తర్వాత కుక్కల్ని వదిలేయండి

రేబిస్ సోకినవాటిని మాత్రం వదలొద్దు.. గత తీర్పును సవరించిన సుప్రీంకోర్టు

- కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు
- త్రిసభ్య బెంచ్ స్పష్టీకరణ



సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఢిల్లీలో జంతుప్రేమికుల ఆనందోత్సాహం

న్యూఢిల్లీ, ఆగస్టు 22 : ఢిల్లీలో ఒక్క వీధికుక్క కూడా కనిపించకుండా అన్నింటినీ తరలించివేయండి.. స్టెరిలైజేషన్ (సంతాననియంత్రణ ఆపరేషన్) తర్వాత కూడా వీధుల్లోకి వదిలిపెట్టవద్దంటూ ఇచ్చిన తీర్పును శుక్రవారం సుప్రీంకోర్టు సవరించింది. వీధుల్లో పట్టుకున్న కుక్కలను స్టెరిలైజేషన్ తర్వాత తిరిగి వీధుల్లోకి వదిలిపెట్టాలని ఆదేశించింది. అయితే, రేబిస్ వ్యాధికి గురైనవాటిని, తీవ్రస్వభావం కలిగినవాటిని మాత్రం షెల్టర్లకే పరిమితం చేయాలని స్పష్టం చేసింది. వీధుల్లో కుక్కలకు ఆహారం పెట్టడాన్ని అనుమతించరాదని, ఈ నిబంధనను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ తాజా ఉత్తర్వులు జారీచేసింది. నిజానికి, వీధికుక్కలపై ఇటీవల సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం జంతుప్రేమికులను కలతపరిచింది. వీధికుక్కల సమస్యను నియంత్రించడంలో స్టెరిలైజేషన్ ప్రక్రియకు ఉన్న ప్రాధాన్యాన్ని కోర్టు విస్మరించిందని 'పెటా' వంటి జంతు సంరక్షణ సంస్థలు పెదవి విరిశాయి. ఈ నెల 8వ తేదీన జస్టిస్ పార్దీవాలా నేతృత్వంలోని ద్విసభ్య బెంచ్ ఇచ్చిన తీర్పుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ స్వయంగా కలగజేసుకున్నారు. పునఃపరిశీలన కోసం ఈ అంశాన్ని ముగ్గురు సభ్యుల బెంచ్‌కు ఆయన కేటాయించారు. ఒక బెంచ్ తీసుకున్న నిర్ణయంలో చీఫ్‌జస్టిస్ జోక్యం చేసుకోవడం చాలా అరుదు. ఈ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన బెంచ్ శుక్రవారం తాజా ఆదేశాలు జారీచేసింది. 'కోర్టు వ్యాఖ్యలు మరీ కఠినంగా ఉన్నాయి' అంటూ గత తీర్పును బెంచ్ ప్రస్తావించింది. ఉద్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం ఏకపక్ష తీర్పులతో వీలు కాదని వ్యాఖ్యానించింది. కుక్కలను ఎక్కడ నుంచి పట్టుకువెళ్లారో వ్యాక్సినేషన్, డీవార్మింగ్ జరిపిన తర్వాత తిరిగి అక్కడికే తెచ్చి వదిలిపెట్టాలని అధికారులకు బెంచ్ సూచించింది. వీధికుక్కలను పెంచుకునేందుకు జంతుప్రేమికులను అనుమతించిన కోర్టు.. ఒకసారి దత్తత తీసుకున్నాక తిరిగి అవి వీధుల్లోకి రాకుండా చూడాల్సిన బాధ్యత దరఖాస్తుదారులదేనని తేల్చిచెప్పింది. వీధికుక్కల అంశంపై హైకోర్టుల్లో దాఖలైన అన్ని పిటిషన్లను తెప్పించుకుంటామని, త్వరలోనే దీనిపై జాతీయ పాలసీని రూపొందిస్తామని తెలిపింది. వ్యక్తిగత పిటిషనర్లు, ఎన్‌జీవోలు రూ.25 వేలు నుంచి రూ. రెండు లక్షల వరకు కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. తీర్పును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్వాగతించారు. జంతువుల సంరక్షణకు, ప్రజల భద్రతకు మధ్య సాధించాల్సిన సమన్వయం విషయంలో సుప్రీంకోర్టు గొప్ప ముందడుగు వేసిందన్నారు.

సంబరాల్లో మునిగిన జంతుప్రేమికులు

సవరించిన కోర్టు తీర్పు జంతుప్రేమికుల్లో సంతోషాన్ని నింపింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని వారంతా సంబరాలు జరుపుకొన్నారు. కొందరు భగవంతునికి ధన్యవాదాలు తెలిపితే, 'హరహర మహాదేవా..' అంటూ మరికొందరు నినాదాలు చేశారు. కమ్యూనిటీ జంతువుల సంరక్షణపై కోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని ఓ జంతు ప్రేమికురాలు సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్రంప్ మాజీ సలహాదారుపై ఎఫ్‌బీఐ దాడులు



జాన్ బోల్టన్

వాషింగ్టన్, ఆగస్టు 22: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇటీవల తీవ్ర విమర్శలు చేసిన ఆయన మాజీ సలహాదారు జాన్ బోల్టన్‌పై అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ 'ఎఫ్‌బీఐ' తాజాగా దాడులు చేసింది. మేరీలాండ్‌లోని బెతెస్డా ప్రాంతంలోని జాన్ బోల్టన్ నివాసంలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. నిజానికి వైట్‌హౌజ్ జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేసిన జాన్ బోల్టన్‌కు.. ట్రంప్ సన్నిహితుడుగా పేరుండేది. కానీ వాణిజ్య విధానాలు, సుంకాల అంశంలో విభేదాలు రావడంతో గతంలోనే ట్రంప్ ఆయనను పక్కనపెట్టారు. ఇటీవల జాన్ బోల్టన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ట్రంప్ 'దారి తప్పిన అధ్యక్షుడు' అంటూ విమర్శలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై అదనపు సుంకాలు విధించడం, అదే పనిచేస్తున్న చైనా జోలికి వెళ్లకపోవడంపై ప్రశ్నలు సంధించారు. ఆ కొన్నిరోజులకే జాన్ బోల్టన్‌పై ఎఫ్‌బీఐ దాడులు జరిగాయి మరోవైపు, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న అంశంపై తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి నోరుజారారు. రష్యాకు బట్టలు ఉతికిపెట్టే వాషింగ్ మెషీన్‌లా భారత్ మారిందని మీడియాతో వ్యాఖ్యానించారు.

అమెరికాలో 5.5 కోట్ల మంది విదేశీయుల వీసాల పరిశీలన

- నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే దేశ బహిష్కరణ

వాషింగ్టన్: అమెరికాలోని వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కారు.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అక్కడ ఉంటున్న 5.5 కోట్ల మందికి పైగా విదేశీయుల వీసా పత్రాలను సమీక్షించనున్నట్లు ప్రకటించింది. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే.. తక్షణమే వారి వీసా రద్దు చేసి అమెరికా నుంచి బహిష్కరించే ప్రక్రియను ప్రారంభిస్తామని విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికాలోని వీసాదారులందరిపై నిరంతర పరిశీలన ఉంటుందని.. వీసా జారీ తర్వాత వారి ప్రవర్తనలో ఏమైనా మార్పు వచ్చిందా.. వీసా రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించారా అనేది సమీక్షిస్తామని స్పష్టం చేసింది.

విదేశీ ట్రక్కు డ్రైవర్లకు అమెరికా వీసాల నిలిపివేత

విదేశీ వాణిజ్య ట్రక్కు డ్రైవర్లకు వర్కర్ వీసాల జారీని అమెరికా గురువారం నుంచి నిలిపివేసింది. ఇటీవల భారత్‌కు చెందిన ఓ సిక్కు ట్రక్కు డ్రైవర్ ఫ్లోరిడా హైవేపై నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకోవడం వల్ల ముగ్గురు అమెరికన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ యంత్రాంగం తాజా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వీసాలను నిలిపివేశారు. దీంతో వీసా గడువు ముగిసిన వారికి రెన్యూవల్ చేసే అవకాశం ఉండదు. కొత్తగా వీసాల జారీ ఉండదు కాబట్టి భారత్ సహా విదేశీ ట్రక్కు డ్రైవర్లు అమెరికాకు వచ్చే ఆస్కారం ఉండదు. ఇంతకు ముందు విదేశీ ట్రక్కు డ్రైవర్లు హెచ్-2బీ వీసా వంటి తాత్కాలిక వీసాల కోసం దరఖాస్తు చేసుకునేవారు.

చైనాకు భారత ఎగుమతులు జంప్!

ఉద్రిక్తతలు తగ్గడంతో 4 నెలల్లోనే 20% వృద్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ఉద్రిక్తతల ఉపశమనం.. అమెరికా అడ్డగోలు టారిఫ్‌ల నేపథ్యంలో చైనాతో భారత వాణిజ్యం మళ్లీ గాడినపడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే (ఏప్రిల్-జూలై మధ్య) భారత ఎగుమతులు ఏకంగా 19.97 శాతం పెరిగాయి. వీటి విలువ రూ.49,013 కోట్లు (5.76 బిలియన్ డాలర్లు). ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 2023-24లో రూ.1.46 లక్షల కోట్ల ఎగుమతులు జరుగగా.. 24-25లో రూ.1.25 లక్షల కోట్లకు తగ్గాయి. 25-26లో మొదటి నాలుగు నెలల్లోనే రూ.49,013 కోట్లకు చేరడం.. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించాలని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఇటీవలి భారత పర్యటనలో ఉభయ దేశాలు నిర్ణయించడం, ప్రభుత్వంగా సరిహద్దుల్లో లిపులేక్ పాస్, షిప్కి లా పాస్, నాథు లా పాస్ వాణిజ్య మార్గాలను తిరిగి తెరవాలని నిశ్చయించడం.. తదితర పరిణామాలతో చైనాకు ఇండియా ఎగుమతులు ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగానే పెరిగే అవకాశముందని అధికార వర్గాలు అంటున్నాయి. ఏప్రిల్-జూలై నడుమ ఎగుమతుల్లో ఇంధన, ఎలక్ట్రానిక్స్, ఆహార పదార్థాల వాటా అత్యధికంగా ఉండడం గమనార్హం. ఏప్రిల్లో 12.9%, మేలో 24%, జూన్‌లో 17%, జూలైలో 27 శాతానికి ఎగుమతులు చేరాయి. వాస్తవానికి 2024-25లో చైనాతో ఇండియా వాణిజ్య లోటు రూ.8.69 లక్షల కోట్లుగా ఉంది. తాజా పరిణామాలతో ఈ ఏడాది ఈ లోటు కొంతవరకు భర్తీ అవుతుందన్న ఆశాభావం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది.


గ్యాస్ పైప్‌లైన్ లీక్ అయినచోట నుంచి వస్తున్న మంటలు

'యానాం'లో గ్యాస్ పైప్‌లైన్ లీక్

» ఎగసిన మంటలు.. ఎరుపెక్కిన ఆకాశం

» కిలో మీటరు మేర మడ అడవులు అగ్నికి ఆహుతి

» భయభ్రాంతులకు గురైన స్థానికులు

యానాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల సరిహద్దు, పుదుచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాం సముద్రం నుంచి గోదావరి మీదుగా వెళ్లిన ఓఎన్జీసీ గ్యాస్‌పైప్‌లైన్ శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటలకు లీక్ అవ్వడంతో మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఒక్కసారిగా ఆకాశం ఎరుపెక్కింది. 40 అడుగుల మేర మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయాన్ని స్థానికులు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఓఎన్జీసీ, యానాం పరిపాలనాధికారి, పోలీసులతో మాట్లాడి తక్షణం సంఘటన ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. ఓఎన్జీసీ సేఫ్టీ అధికారులు పైప్‌లైన్ నుంచి వచ్చే గ్యాస్‌పైప్ వాల్‌ను సముద్రంలోనే మూసివేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. సంఘట ప్రాంతానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' టీమ్ సాహసోపేతంగా వెళ్లింది. అక్కడ నీటి నుంచి బుడగల రూపంలో నీరు పొంగడంతో పాటు సమీపంలోని మడ అడవులు కిలోమీటరు మేర అగ్నికి ఆహుతయ్యాయి.

బర్లీ పొగాకు నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్‌డీ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకును నియంత్రించేందుకు జిల్లా, డివిజనల్, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, జిల్లా వ్యవసాయాధికారి, డీఎంహెచ్‌వో, న్యాయాధికారి సభ్యులుగా ఉంటారు. డివిజనల్ స్థాయిలో ఆర్డీవో చైర్మన్‌గా డీఎస్పీ, ఏడీఏ, డివిజనల్ హెల్త్ ఆఫీసర్, అభ్యుదయ రైతు, మండల స్థాయిలో తహశీల్దారు చైర్మన్‌గా, ఎస్‌ఐ, ఏవో, మెడికల్ ఆఫీసర్, అభ్యుదయ రైతు సభ్యులుగా ఉంటారు.

గోదావరి లెక్కల్లో స్పష్టతేదీ?

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) డైరెక్టర్ దేవేంద్రరావు, గోదారి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్ బన్యమిణ్ ప్రసాద్ పాండే ఆధ్వర్యంలో గోదావరి-కావేరి అనుసంధాన పథకంపై సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, పుదుచ్చేరి జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర నదీ జలాల విభాగం చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే నిర్మించిన నాగార్జునసాగర్, సోమశిల ప్రాజెక్టులను వినియోగించుకుంటూ గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని ఎలా అమలు చేస్తారని రాష్ట్ర అధికారులు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ రెండు ప్రాజెక్టులనూ గోదావరి-కావేరి అనుసంధానానికి వాడితే.. నీటి లెక్కల్లో గందరగోళం నెలకొంటుందని తెలిపారు. గోదావరి నీటి కేటాయింపులపై రికార్డు లెక్క చెబుతున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు. గోదావరి మిగులు జలాల్లో లెక్కలు తేల్చకుండా నదుల అనుసంధాన ప్రక్రియను చేపడతామంటే ఎలాగని ఎన్‌డబ్ల్యూడీఏను అడిగారు. ఇచ్చంపల్లి వద్ద గోదావరి మిగులు జలాలు లేనందున.. తెలంగాణ నుంచి కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్రాష్ట్ర నదీ అనుసంధాన పథకాలను వినియోగించుకోవాలని.. అప్పుడు దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించేందుకు వీలు కలుగుతుందని పేర్కొంది. గతంలో ప్రతిపాదించిన ధవళేశ్వరం-కావేరి అనుసంధానం పథకాన్ని అమలు చేస్తే.. జాతీయ నదుల అనుసంధాన ప్రక్రియను విజయవంతంగా అమలు చేసేందుకు వీలు కలుగుతుందని రాష్ట్రప్రభుత్వం అభిప్రాయపడింది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును వినియోగించుకోవాలని సూచించింది. చింతలపూడి ఎత్తిపోతల, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గోదావరి (పోలవరం)-పెన్నా లింకు ప్రాజెక్టును కూడా గోదావరి-కావేరి అనుసంధానం ఫేజ్-1లో అంతర్భాగం చేయాలని ప్రతిపాదించింది.

గంగా జలాలు ఎప్పుడొస్తాయ్?

గంగా జలాలు ఎప్పుడు వస్తాయో చెప్పకుండా గోదావరి-కావేరి అనుసంధాన పథకం అమలు చేస్తామంటే ఎలాగని ఎన్‌డబ్ల్యూడీఏను సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. అకస్మాత్తుగా ఛత్తీస్‌గఢ్ తన వాటా 147 టీఎంసీలను వాడేసుకుంటామంటే.. దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని, నీటి కొరత ఏర్పడితే ఎంతో నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఆయన ప్రశ్నలకు ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్, జీఆర్ఎంబీ చైర్మన్ సమాధానం ఇవ్వలేకపోయారు.

ఇంకా ఏ రాష్ట్రం ఏం కోరిందంటే..

» గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని ఇచ్చంపల్లి నుంచి కాకుండా ఎగువన 25 కిలోమీటర్ల దూరంలోని సమక్క-సారలక్క ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మళ్లించేలా పథకాన్ని మార్పు చేయాలని తెలంగాణ సూచించింది. ఈ పథకాన్ని అమలు చేస్తున్నందుకు ఛత్తీస్‌గఢ్‌కు కేటాయించిన 127 టీఎంసీల్లో సగం తమకు కేటాయించాలని డిమాండ్ చేసింది. గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని సమక్క సారలక్క ప్రాజెక్టు నుంచి అమలు చేస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో చెరో 300 కిలోమీటర్ల మేర గోదావరి జలాలు ప్రవహిస్తాయని పేర్కొంది. దీనివల్ల రెండు రాష్ట్రాలకూ ప్రయోజనమేనని తెలిపింది.

» తమకు కేటాయించిన 147 టీఎంసీలను త్వరలోనే సద్వినియోగం చేసుకుంటామని.. ఇందుకు అవసరమైన ప్రాజెక్టులను నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ఛత్తీస్‌గఢ్ వెల్లడించింది. ఆ 147 టీఎంసీలను తాను వాడుకోనందునే.. ఆ నీటిని గోదావరి-కావేరి అనుసంధాన పథకానికి వినియోగిస్తామనడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్‌డబ్ల్యూడీఏ జోక్యం చేసుకుని.. హిమాలయన్ వ్యాలీ నుంచి గంగా జలాలను దిగువకు తరలిస్తున్నందున భవిష్యత్‌లో నీటి కొరత రాబోదంటూ బుజ్జగించే ప్రయత్నం చేసింది. కానీ ఆ రాష్ట్రం అంగీకరించలేదు. తమ రాష్ట్రానికి కేటాయించిన 147 టీఎంసీలను కచ్చితంగా తామే వాడుకుంటామని తెగేసి చెప్పింది. సమావేశంలో పాల్గొన్న తమిళనాడు మాత్రం గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియకు ఆమోదం తెలిపింది. పుదుచ్చేరి తమకు అదనంగా 12.5 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించాలని కోరింది. రాష్ట్రాలు వెలిబుచ్చిన అభిప్రాయాలను తీసుకున్న ఎన్‌డబ్ల్యూడీఏ.. త్వరలోనే కీలక భేటీ ఉంటుందని వెల్లడించింది.

టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షల విరాళం



టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు శుక్రవారం రూ.50 లక్షలు విరాళంగా అందింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్‌నకు చెందిన ఎక్స్‌ప్రెస్ ఇన్‌ఫ్రా ఎండీ కవిత సింఘానియా తరపున జాన్ ముని, బొమ్మల మురళి తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. - ఆంధ్రజ్యోతి, తిరుమల

హథిరాం మఠం కూల్చివేతను విరమించుకోవాలి

» భక్తుల మనోభావాలు చంద్రబాబు పరిగణనలోకి తీసుకోవాలి: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హాథిరాం బావాజీ మఠం భవనాన్ని కూల్చివేసే ప్రయత్నాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. ఈ నిర్ణయం బంజారాల మనోభావాలను దెబ్బతీస్తోందని, మఠం కూల్చివేతపై పునరాలోచించాలని ఆమె కోరారు. సీఎం చంద్రబాబు భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని హాథిరాం బావాజీ మఠం కూల్చివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని శుక్రవారం ఎక్స్ వేదికగా కవిత విజ్ఞప్తి చేశారు.

బీసీ హాస్టళ్లలో సిబ్బందిని నియమిస్తాం

» బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ వసతి గృహాల్లో వచ్చే నెల 5వ తేదీ నాటికి 244 మంది నాల్గవ తరగతి సిబ్బందిని నియమిస్తామని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, హెచ్‌డబ్ల్యువోలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పనితీరు తెలుసుకోవడానికి నూతన విధానాన్ని తీసుకువచ్చినట్టు తెలిపారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పనితీరు ఆధారంగా కొన్ని మార్కులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

కార్మిక శాఖ జేసీ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

» ఏక కాలంలో 9 ప్రాంతాల్లో తనిఖీలు

కర్నూలు క్రైం/తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై కర్నూలు కార్మిక శాఖ జాయింట్ కమిషనరు బాలు నాయక్ నివాసాలతో పాటు, ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. స్థానిక చల్లా కాంపౌండులో ఉన్న ఆయన కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ఏసీబీ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు తనిఖీలు చేశారు. తిరుపతి రాఘవేంద్రనగర్‌లోని ఆయన ఇంటితో పాటు, బంధువుల ఇళ్లు, అన్నమయ్య జిల్లాలోని పొల్కీపారం.. సహా తొమ్మిది ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు జరిపారు. తిరుపతిలోని ఇంట్లో పలు కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కర్నూలు బాలాజీనగర్‌లో అద్దెకు ఉన్న తన ఇంట్లో రాత్రి పొద్దుపోయే వరకు అధికారులు సోదాలు నిర్వహించారు.

నేటి నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఒంగోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 28వ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనున్నాయి. శనివారం ఒంగోలులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం అద్దంకి బస్టాండు సమీపంలోని కూరగాయాల మార్కెట్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొంటారు.

స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

» మానవ హక్కుల వేదిక డిమాండ్

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. ఇటీవల ఒకేసారి కీలకమైన 34 విభాగాలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఇచ్చారని, ఇది నిబంధనలకు విరుద్ధమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉక్కు ఉత్పత్తి అతి ప్రమాదకరమైన పరిశ్రమ అని, అన్నిరకాలుగా శిక్షణ పొందిన వారే దానిని నడపాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఫార్మా సిటీల్లో ప్రమాదాలు జరుగుతున్నట్టు ఇక్కడ కూడా ప్రమాదాలు జరుగుతాయని హెచ్ఆర్ఎఫ్ ప్రతినిధులు కేవీ జగన్నాథరావు, వీఎస్ కృష్ణ పేర్కొన్నారు. అదే విధంగా కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తొలగించారని, తక్షణమే వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణాలు త్యాగం చేస్తే విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటైందని, దానిని ప్రైవేటు సంస్థల కోసం నిర్వీర్యం చేయడం తగదని మానవ హక్కుల వేదిక పేర్కొంది.


రాజధానిలో కొండవీటి వాగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అమరావతిని ఆపాలని చూస్తే ప్రజలే ఛీ కొడతారు : మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిని ఆపాలని చూస్తే వారిని ప్రజలే ఛీ కొడతారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాజధాని ప్రాంతంలోని నీరుకొండ వద్ద కొండవీటి వాగును మంత్రి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, కొండవీటి వాగు వద్ద సమస్య ఏంటో తెలుసుకోకుండా, కావాలని కొంతమంది దుష్ప్రచారం చేశారన్నారు. వెస్ట్ బైపాస్ బ్రిడ్జి కింద వాగు ప్రవాహం కారణంగా మట్టితో నిండిపోవడం వల్ల నీళ్లు వెనక్కి వచ్చాయని, అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు గండి కొట్టి నీటిని బయటకు పంపించారన్నారు. నిజాలు తెలుసుకోకుండా పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం సరికాదని సూచించారు. అమరావతిలో ఎంత వరద వచ్చినా ఇబ్బంది లేకుండా కాలువలు, రిజర్వాయర్లు డిజైన్ చేశారన్నారు.

అమరావతిపై రాబందుల రెక్కల చప్పుడు

» అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు బాలకోటయ్య

తుళ్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ వైసీపీ నాయకులు, వైసీపీ సోషల్ మీడియా శవాల కోసం గాలించే రాబందుల్లా చేస్తున్న రెక్కల చప్పుడును తక్షణం ఆపాలని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య కోరారు. ఆరోపణలు చేస్తున్న నాయకులు అమరావతిలో ముంపునకు గురైన ఒక్క ఇల్లు చూపగలరా? ఒక్క బాధితుని పేరు చెప్పగలరా? అంటూ ఓ ప్రకటనలో సవాల్ చేశారు. ఏ రైతు నష్టపోయాడు.. ఏ రైతు నష్టపరిహారం కోసం రోడ్డెక్కాడు..? అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబును ప్రశ్నించారు. ఐకానిక్ టవర్స్ నిర్మాణాల కోసం కందకాలు తీస్తే, వాటిల్లోకి నీళ్లు వస్తే, ముంపు అంటారా? అంటూ మాజీ మంత్రి బొత్సను ప్రశ్నించారు.

కుల ధ్రువీకరణ విషయంలో వీఆర్వోలపై ఒత్తిడి

» ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో వీఆర్వోలపై అధికారులు ఒత్తిడి చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్.రవీంద్రరాజు తెలిపారు. గత ప్రభుత్వం కొనసాగించిన విధానాన్నే ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని ఒక ప్రకటనలో విమర్శించారు. కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు నేరుగా తగిన ఆధారాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే జారీ చేస్తారని వెల్లడించారు. తప్పుడు సమాచారం వీఆర్వో లాగిన్‌లకు పంపించి మీరు ఏం చేస్తారో తెలియదు వెంటనే పూర్తి చేయాలని అధికారులు తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నారని, అర్బన్ ప్రాంతాల్లో ఇబ్బందికర పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు కాకినాడ జిల్లాలో సీఎం పర్యటన

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం కాకినాడ జిల్లా పర్యటనకు రానున్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా సామర్లకోట, పెద్దాపురంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

విద్వేషాలకు ఆజ్యం!

ఉత్తరాఖండ్ వరదలతో వొణికిపోతోంది. మరింత కుంభవృష్టి సిద్ధంగా ఉన్నట్టుగా వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తూనే ఉంది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలో 150కు పైగా దారులు మూసుకుపోయాయని, ఆఖరుకు చార్‌ధామ్ యాత్రకు కూడా ఆటంకం కలిగిందని వింటున్నాం. ఈ నెలారంభంలో క్లౌడ్‌బరస్ట్ కారణంగా ఆకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి, ధరాలీ సహా కొన్ని గ్రామాలు తుడిచిపెట్టుకుపోయిన దృశ్యాలు మన కళ్ళముందు కదలాడుతూనే ఉన్నాయి. వందమందికి పైగా స్థానికులూ పర్యాటకులూ ఆ భయానకమైన బురదలో ప్రాణాలు వదిలేశారు. 2013 కేదార్‌నాథ్ వరదలు రాష్ట్రానికి భారీ ఆస్తినష్టాన్ని, మౌలిక సదుపాయాల విధ్వంసాన్ని కలిగించినస్థాయిలో రాష్ట్రం మళ్ళీ ఇప్పుడు దెబ్బతిన్నదని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రకృతి ఆగ్రహానికి అల్లాడిపోతున్న ప్రజలను ఆదుకోవడం, రాష్ట్రాన్ని తిరిగి గాడినపెట్టడం ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ ప్రథమ కర్తవ్యం కావాలి. ఈ నెల 19న ఆరంభమైన అసెంబ్లీ సమావేశాలను ఆయన వినియోగించుకున్న ముఖ్యమంత్రి, మైనారిటీలపై దాడికీ, మత రాజకీయాలకు దానిని వాడుకున్నారు. మదర్సాల నియంత్రణ, మతమార్పిడి నిరోధం సహా మొత్తం తొమ్మిది బిల్లులు బుధవారం సభలో నెగ్గాయి.

రాష్ట్రాన్ని రక్షించగల ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన ముఖ్యమంత్రి విద్వేషవ్యూహాల మీద శ్రద్ధపెడుతున్నారు. రాష్ట్రంలో రమారమి 14శాతం ముస్లిం జనాభా ఉంది. ఇప్పటికే, మదర్సా బోర్డును రద్దుచేసి, వివిధ ఆరోపణలతో మదర్సాలను మూసివేయిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు కొత్తచట్టంతో మరిన్ని ఆంక్షలు ప్రయోగించింది. అత్యంత స్వల్పసంఖ్యలో ఉన్న సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్సీలకు మైనారిటీ విద్యాసంస్థల లబ్ధిని విస్తరింపచేస్తూ, రాష్ట్ర మైనారిటీ ఎడ్యుకేషన్ విభాగానికి సర్వాధికారాలను ప్రభుత్వం దఖలుపరిచింది. మదర్సాల్లో చదువులను నిర్ధారించి, నియంత్రించడంతో పాటు, నిర్వహణలో అక్రమాలు, పారదర్శకత లేకపోవడం, సామాజిక అశాంతి, మతవిద్వేషం ఇత్యాది ఆరోపణలతో ఏ చిన్న కారణంతోనైనా మైనారిటీ హోదాను రద్దుచేయగల, ఆస్తిని స్వాధీనపరచుకోగల అధికారాన్ని ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుంది. ఈ చట్టం ద్వారా మదర్సాలను స్వల్పసంఖ్యలో అనుమతించి, మిగతావన్నీ మూసివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దేశం మొత్తంమీద ఇంతటి ప్రగతిశీలచట్టం ఎక్కడాలేదని ముఖ్యమంత్రి చెబుతుంటే, లవ్‌జిహాద్, లాండ్ జిహాద్‌లు ఎదుర్కొంటున్న తమమీద ఇదో కొత్త జిహాద్ అని ముస్లింలు అంటున్నారు. ఇక, మతమార్పిడి నిరోధక చట్టం కూడా మరిన్ని కఠినమైన సవరణలతో మరింత బలపడింది. 'బలవంతంగా' మతం మార్చినవారికి యావజ్జీవం తప్పదు. బూటకపు ప్రేమలు, పెళ్ళి హామీలకు పదేళ్లశిక్షలు, లక్షల్లో జరిమానాలు పడతాయి. ఒక బహుమతి, మంచిజీవితం, విద్య, వైద్యం, ఉద్యోగం, దైవానుగ్రహం ఇత్యాది హామీలన్నీ తీవ్ర శిక్షలకు దారితీస్తాయి. మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీల మతమార్పిడుల విషయంలో మరింత కఠినమైన నియంత్రణలు, నిబంధనలు ఉన్నాయి. డిజిటల్, ఆన్‌లైన్, సోషల్ మీడియాల్లో ఒక మతాన్ని దూషించి, మరో మతాన్ని కీర్తించినా, ప్రచారం చేసినా మత మార్పిడికి సాయపడినట్టే. నిందితులను వారెంట్ లేకుండా అరెస్టుచేయవచ్చు, సదరు వ్యక్తుల, సంస్థల ఆస్తులు స్వాధీనం చేసుకోవచ్చు, 20ఏళ్ల వరకూ శిక్షలు పడవచ్చు. పొరుగునే ఉన్న ఉత్తరప్రదేశ్‌తో ఏ బీజేపీ పాలిత రాష్ట్రాలలోనూ ఇంతటి కఠినమైన మతమార్పిడి వ్యతిరేక చట్టం లేదని నిపుణులు అంటున్నారు. బలవంతపు మతమార్పిడులను నిరోధించడం లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆ పేరిట ముస్లింలను మరింత వేధించడానికి ఈ చట్టం ఉపకరిస్తుంది.

దేశంలో ఉమ్మడిపౌరస్మృతి అమలుచేసిన తొలిరాష్ట్రం ఉత్తరాఖండ్. ఈ ఏడాది జనవరిలో అది అమలులోకి వచ్చింది. గిరిజనతెగలకు మినహా మిగతావారందరికీ ఇది సమానంగా వర్తిస్తూ, వివాహం, విడాకులు, వారసత్వం సహా సమస్త అంశాలను నిర్దేశిస్తోంది. సహజీవనాన్ని నియంత్రించే నిబంధనలమీద విమర్శలు, కేసులు ఉన్నప్పటికీ, ధామీ ప్రభుత్వం వెనుకంజవేయకుండా, ఇప్పుడు మరిన్ని సవరణలతో దానిని మరింత కఠినతరం చేసింది. బంధాన్ని విధిగా బహిరంగపరచాల్సిన నిబంధనలకు తోడుగా, అనధికార, అక్రమ బంధాలకు శిక్షలు తీవ్రమైనాయి. వివాహితులు సహజీవనంలోకి ప్రవేశించినా, బలవంతంగా లేదా మోసపూరితంగా ఈ బంధంలో ఉన్నా ఏడేళ్ళ జైలు తప్పదు. ఈ బిల్లులు, వాటికి చేసిన సవరణలు సామాజిక శాంతిని కాక, విద్వేషాలను పెంచి, కొత్త సమస్యలను సృష్టిస్తాయన్నది సుస్పష్టం.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా గతించిన గతమేనా?

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ నిరుడు కురిసిన హిమసమూహమేనా? జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన భారత రాజ్యాంగ అధికరణ 370 'రద్దు చేసేందుకు' నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను దేశ సర్వోన్నత న్యాయస్థానం సమర్థించిందనే భావన ఒకటి దేశ ప్రజలలో విస్తృతంగా ఉన్నది. అధికరణ 370 రద్దు సక్రమమేనని సుప్రీంకోర్టు ప్రమాణీకరించిందని ప్రభుత్వం వాదించింది. న్యాయశాస్త్ర పండితులు కొంతమంది ప్రభుత్వ వాదనను అంగీకరించారు. పొరపాటు, డిసెంబర్ 17, 2023న ఇదే కాలమ్‌లో నేనా విషయాన్ని బలమైన రుజువులతో స్పష్టం చేశాను. నిజానికి సుప్రీంకోర్టు అధికరణ 370 రద్దుపై ప్రభుత్వ వాదనకు విరుద్ధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అధికరణ 370 రద్దు రాజ్యాంగ విరుద్ధం, సందేహం లేదు. ఆగస్టు 5, 2019న మోదీ ప్రభుత్వం మూడు చర్యలు చేపట్టింది: అధికరణ 370(1)ని దృష్టాంతంగా చూపుతూ రాజ్యాంగ నిర్వచన నిబంధన (అధికరణ 367)కు అదనంగా 4వ నిబంధనను చేర్చింది; విస్తరింపచేసిన నిర్వచన నిబంధనను అధికరణ 370(3)లోని నిబంధన సవరణకు ఉపయోగించింది; సవరణ చేసిన అధికరణ 370(3), అధికరణ 370ని రద్దు చేసేందుకు ఉపయోగించింది. ఈ మూడు చర్యలూ న్యాయసమ్మతమైనవికావని, రాజ్యాంగ విరుద్ధమైనవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయినప్పటికీ రాజ్యాంగ నిబంధనలు అన్నిటినీ జమ్మూ–కశ్మీర్‌కు వర్తింపచేస్తూ అధికరణ 370(1) కింద అధికారాలను ఉపయోగించడం సక్రమమేనని, అధికరణ 370 రద్దుతో సమమైన ప్రభావదాయకమవుతుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

సరే, జమ్మూ–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు అయిందని అంగీకరిద్దాం. అయితే ప్రత్యేక హోదా ఉపసంహరణ కశ్మీర్ ప్రజలకు అమిత మనస్తాపం కలిగిస్తోందని, కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వంపై వారిలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని చెప్పడం సత్యదూరం కానే కాదు. అధికరణ 370 రద్దుతో ఆ వ్యవహారం ముగిసిపోలేదు. ఆగస్టు 5, 2019న, భారత్‌లో విలీనమైన నాటినుంచి రాష్ట్ర ప్రతిపత్తితో వర్ధిల్లుతున్న జమ్మూ–కశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. 'ఇది రాజ్యాంగ సమ్మతమూ, న్యాయబద్ధమేనా?' కేంద్ర ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసినవారు పై ప్రశ్నపై కూడా విచారణ జరపాలని అభ్యర్థించారు. సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. కారణమేమిటి? లద్దాఖ్ మినహా జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామని, ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు నివేదించింది. మోదీ సర్కార్ నివేదనను అంగీకరిస్తూ 'ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగ సమ్మతమూ, న్యాయబద్ధమైన చర్యేనా?' అన్న అంశాన్ని విచారణ చేపట్టకుండా వదిలివేసింది. అయితే జమ్మూ–కశ్మీర్‌లో ఎన్నికలను సెప్టెంబర్ 30, 2024లోగా నిర్వహించి తీరాలని మోదీ సర్కార్‌కు నిర్దేశించింది. ఆ నిర్దేశానికి అనుగుణంగా సెప్టెంబర్ 2024లో కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించారు. అయితే ఈ రోజుకీ రాష్ట్ర హోదాను పునరుద్ధరించలేదు. దేశ సర్వోన్నత న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీని మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదు. ఇది స్పష్టంగా వాగ్దాన భంగమే.



'ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగ విహితచర్యేనా?' అన్న న్యాయపరమైన సమస్య సర్వోన్నత న్యాయస్థానం ముందు స్పష్టంగా ఉన్నది. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టు ఆ అంశంపై నిర్ణయం తీసుకోలేదు. ఆ హామీని వెన్వెంటనే నెరవేర్చాలని కేంద్రాన్ని ఆదేశించడమో లేదా అపరిష్కృతంగా ఉన్న ఆ అంశంపై తీర్పు వెలువరించడమో సుప్రీంకోర్టు ముందున్న బాధ్యత.

జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించే విషయమై జరుగుతున్న తాత్సారానికి బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యత వహించి తీరాలి. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ–కశ్మీర్‌లో సెప్టెంబర్ 2024లో నిర్వహించిన ఎన్నికలలో విజయం సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్ అక్టోబర్ 16, 2024న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బహుశా, వ్యూహాత్మకంగానే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న డిమాండ్ గట్టిగా చేయడం లేదు. ప్రభుత్వం నుంచి గానీ, ప్రజల నుంచి గానీ బలమైన డిమాండ్ లేకపోవడంతో రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణకు కశ్మీర్ ప్రజలు ప్రథమ ప్రాధాన్యమివ్వడంలేదని కేంద్ర ప్రభుత్వం విశ్వసించేందుకు దారి తీసింది. వాస్తవంగా ప్రతి కశ్మీరీ కూడా తమ జన్మభూమి రాష్ట్ర ప్రతిపత్తి కోల్పోయినందుకు ఆగ్రహిస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రగిలిపోతున్నాడు.

పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతి భారతీయుడూ చలించిపోయాడు. పాకిస్థాన్ నుంచి చొరబడిన ఉగ్రవాదులతో భారత్‌కు చెందిన ఉగ్రవాదులు కూడా ఆ హింసాకాండలో పాల్గొన్నారని నేను గట్టిగా భావిస్తున్నాను. పాకిస్థాన్ నుంచి చొరబడిన ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చారనే ఆరోపణపై పహల్గాంలో ఇద్దరు భారతీయులను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అరెస్ట్ చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం, జూలై 28, 29 తేదీల్లో ముగ్గురు విదేశీ ఉగ్రవాదులను ఒక ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టారు. ఈ ఘటనతో 'పహల్గాం'కు ప్రభుత్వం తెరదించినట్టు కనిపిస్తోంది. అయితే పహల్గాంలోనే అరెస్ట్ చేసిన ఇద్దరు భారతీయుల విషయమై ప్రభుత్వం పూర్తి మౌనం వహిస్తోంది. వారు భద్రతాదళాల కస్టడీలో ఉన్నారా? లేక విడుదల చేసి కేసు ముగించారా? అన్నది స్పష్టంగా తెలియదు. అంతా రహస్యం.

అయితే ప్రజలకు అన్ని విషయాలు జ్ఞాపకముంటాయి. జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ ఇంకా నెరవేరలేదన్న వాస్తవాన్ని వారు ఎలా విస్మరిస్తారు? ఆ హామీని నెరవేర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కొంతమంది బాధ్యతాయుత పౌరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై విచారణలో భాగంగా సర్వోన్నత న్యాయస్థానం మౌఖికంగా కొన్ని నిర్దిష్ట వ్యాఖ్యలు చేసింది. పహల్గాంలో సంభవించినదాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించడం తగదనేది ఆ వ్యాఖ్యల సారాంశం. 'ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగ విహిత, న్యాయబద్ధమైన చర్యేనా?' అన్న న్యాయపరమైన సమస్య సర్వోన్నత న్యాయస్థానం ముందు స్పష్టంగా ఉన్నది. కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టు ఆ న్యాయపరమైన సమస్యపై నిర్ణయం తీసుకోకుండా సంయమనం వహించింది. కేంద్రం ఆ హామీని నెరవేర్చలేదు. సుప్రీంకోర్టు ఇప్పుడు ఆ హామీని వెన్వెంటనే నెరవేర్చాలని కేంద్రాన్ని ఆదేశించడమో లేదా అపరిష్కృతంగా ఉన్న ఆ అంశంపై తీర్పు వెలువరించడమో చేసి తీరాలి. రాజ్యాంగ న్యాయస్థానం న్యాయాన్ని సమకూర్చగలదని నేను విశ్వసిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

క్రికెట్ జగత్తును శాసిస్తున్న భారత్

నరేంద్ర మోదీ మే 2014లో ప్రధానమంత్రి అయిన నాటి నుంచీ మన దేశాన్ని 'విశ్వ గురు'గా చేయాలనే తమ ఆకాంక్షను భారతీయ జనతా పార్టీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బిగ్గరగా ప్రకటిస్తున్నాయి. సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా ఆ రెండు సంస్థల ఆకాంక్ష నెరవేరడమనేది ఇంకా చాలా దూరంలోనే ఉన్నది. అంతర్జాతీయ రాజకీయాలలో మన వైఫల్యాలు ఏమైనప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో మన ప్రభ దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అయితే భారత్ నిర్ణయాలు, చర్యలు సదా కాకపోయినా తరచుగానైనా క్రికెట్‌కు లబ్ధి కలిగించేవిగా ఉంటున్నాయా అనేది పూర్తిగా మరో విషయం.



భారత క్రికెట్ నియంత్రణ సంస్థ (బీసీసీఐ) కార్యకలాపాలలో మరింత జవాబుదారీతనం, పారదర్శకత తీసుకువచ్చే లక్ష్యం (చివరకు ఇది నెరవేరనేలేదు)తో సుప్రీంకోర్టు 2017లో నియమించిన 'పాలనాధికారుల కమిటీ'లో నేను కొన్ని నెలల పాటు సభ్యుడుగా ఉన్నాను. ఇతర క్రికెటింగ్ బోర్డ్‌లు అన్నిటినీ తమ అడుగుజాడల్లోకి తీసుకురావాలనే ఆరాటం బీసీసీఐ అధికారులలో ప్రగాఢంగా ఉన్నట్టు నేను గమనించాను. ఒక చరిత్రకారుడుగా ఇది నన్ను కలవరపరిచింది. ఎందుకంటే గతంలో శ్వేతజాతుల సామ్రాజ్యవాద దురహంకారం క్రికెట్‌ను సమున్నతం చేసేందుకు ఎలా అవరోధమయిందో నాకు బాగా తెలుసు. 2022లో ప్రచురితమైన నా పుస్తకం 'The Commonwealth of Cricket'లో ఇలా రాశాను: 'ఇంగ్లీష్, ఆస్ట్రేలియన్ ఆధిపత్యం తరచు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విశాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసిందని బీసీసీఐలోని నా సహచరులకు చెప్పాను. భారత్ ప్రస్తుత ప్రాబల్యమూ అదే విధంగా పరిణమిస్తున్నదని కూడా చెప్పాను. అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా వహిస్తున్న పాత్రనే అంతర్జాతీయ క్రికెట్‌లో నిర్వహించేందుకు భారత్ ఆరాటపడగూడదని నేను వాదించాను. ప్రపంచ దేశాల మధ్య సత్సంబంధాలు వర్ధిల్లేందుకు నియమనిబంధనలు నిర్దేశిస్తూ తన ప్రయోజనాలకు దోహదం చేయని అంతర్జాతీయ ఒడంబడికలను పూర్తిగా ఉపేక్షించడమే కదా అమెరికా పోకడ. క్రికెట్ జగత్తులో భారత్ ఆ తీరున వ్యవహరించకూడదు'.

నా హెచ్చరికలు బధిరుని ముందు శంఖనాదమే అయ్యాయి. Rod Lyall కొత్త పుస్తకం 'The Club : Empire, Power and the Governance of World Cricket' చదివినప్పుడు ఆ హెచ్చరికలు నా మనసులోకి మళ్లీ వచ్చాయి. 1909లో స్థాపితమైన Imperial Cricket Conference కథతో లైయల్ పుస్తకం ప్రారంభమయింది. బ్రిటిష్ సామ్రాజ్య మైనింగ్ మ్యాగ్నెట్ ఏబ్ బెయిలీ మేధో శిశువు అయిన ICC తొలి కాలంలో ఇంగ్లాండ్, శ్వేతజాతీయులు అత్యధికంగా ఉన్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌ల ఆధిపత్యంలో ఉండేది. క్రికెట్ ఎలా ఆడాలో ఈ దేశాలు, ముఖ్యంగా ఇంగ్లండ్ నిర్ణయించేది. కొత్త సభ్య దేశాలుగా ఏ దేశాలను చేర్చుకోవాలో, చేర్చుకోకూడదో; టూర్‌లు, సిరీస్‌ల షెడ్యూళ్లను, నియమాలు, నియంత్రణలనూ ఇంగ్లాండే ప్రధానంగా నిర్ణయించేది.

క్రికెటింగ్ దేశాలు అయిన ఇండియా, పాకిస్థాన్, వెస్టిండీస్‌ను చులకనగా చూసేవారు, లెక్కలోకి తీసుకునేవారు కాదు. అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాలను ఎలా నిర్వహించాలనే విషయమై ఈ దేశాల మాటకు మన్నన ఉండేది కాదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే

akbar

గత వంద సంవత్సరాలుగా ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో భారత్ పాత్ర వేర్వేరు దశలలో భిన్నరీతులలో ఉన్నది: తొట్ట తొలుత శ్వేతజాతీయుల ఆధిపత్యాన్ని వినయపూర్వకంగా గౌరవించింది. ఆ తరువాత సమాన ప్రతిపత్తికి ఆరాటపడింది. అనంతరం ఒక ప్రముఖ పాత్రను సముపార్జించుకున్నది. అంతిమంగా ఇప్పుడు తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది.

అది పూర్తిగా సామ్రాజ్యవాద, జాత్యహంకార క్రీడా వ్యవస్థ (1946లో సైతం ఐసీసీ సమావేశాలలో బీసీసీఐ ప్రతినిధిగా ఒక ఆంగ్లేయుడే పాల్గొనేవాడు). 1950ల్లోను, ఆ తరువాయి దశాబ్దంలోను బ్రిటిష్ వలస రాజ్యాలు స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఐసీసీ తన విధివిధానాలలో మరింత ప్రజాస్వామ్యయుతంగా ఉండాలని ఆ కొత్త స్వతంత్ర దేశాల క్రికెట్ బోర్డులు వినయపూర్వకంగా విన్నవించుకునేవి. ఈ విషయంలో భారత్, పాకిస్థాన్‌లు తరచు కలిసికట్టుగా వ్యవహరించి, ఇంగ్లాండ్ ప్రాధాన్యం తగ్గించేందుకు ప్రయత్నించేవని లైయల్ వివరంగా రాశాడు. 1965లో ICCలోని I 'Imperial' నుంచి 'International'గా మారింది. 1989లో 'Conference' అనే పదం స్థానంలోకి 'Council' వచ్చింది. 2005లో ICC ప్రధాన కార్యాలయం లండన్ నుంచి దుబాయికి మారింది. తద్వారా 'ఉపఖండంలోని తన కొత్త అధికార కేంద్రానికి ఆ సంస్థ చేరువయింది'. ఇటీవలి దశాబ్దాలలో ప్రపంచ క్రికెట్ వ్యవహారాల నిర్వహణ (అసమర్థ, అవినీతిదాయక నిర్వహణలో కూడా)లో భారత్ ఎలా ఆధిపత్యం చెలాయిస్తుందో లైయల్ రాశాడు. ఆయన కథనంలో కొన్ని పొరపాట్లు ఉన్నాయి. 1983 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయం ప్రాధాన్యాన్ని లైయల్ గుర్తించినట్టు కనిపించలేదు; సాక్ష్యాధారాలు చూపకుండానే, 2011 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ విజయం 'మ్యాచ్ ఫిక్సింగ్' వల్లే సాధ్యమయిందని రాశాడు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

మొత్తం మీద బీసీసీఐ మొరటు సామ్రాజ్యవాద ఆకాంక్షల గురించి లైయల్ రాసిన విషయాలు నిష్పాక్షికంగా ఉన్నాయి. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, ఐసీసీ ఛైర్మన్ శశాంక్ మనోహర్ అరుదైన వివేకవంతుడని పేర్కొంటూ బీసీసీఐ సంకుచిత ప్రయోజనాలకు అతీతంగా ఆలోచించిన, వ్యవహరించిన అగ్రశ్రేణి భారతీయ క్రికెట్ పాలనాధికారి అని లైయల్ వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా 'శశాంక్ వంటి ప్రాజ్ఞులు ముఖ్యంగా భారత్‌లో అరుదుగా ఉంటారని' కూడా లైయల్ వ్యాఖ్యానించాడు.

డిసెంబర్ 2024లో హోంమంత్రి అమిత్ షా కుమారుడు జై షా ఐసీసీ ఛైర్మన్ అయ్యాడు. లైయల్ ఇలా రాశాడు: 'ఒకప్పుడు ఎంసీసీ (Marylebone Cricket Club) విదేశీ విభాగం'గా ఉన్న ఐసీసీ ఇప్పుడు జాతీయవాద భారత రాజకీయ పార్టీ, దాని కార్పొరేట్ ఆకాంక్షల సాధనకు ఒక ఉపకరణమై పోయింది. ప్రపంచ క్రికెట్‌కు ఎంసీసీ ఒకప్పుడు ఎలా ఉండేదో ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌కు బీసీసీఐ అలా పరిణమిస్తోందని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ టోనీ గ్రెగ్ సరిగానే భావించాడు. 'గ్యాంబ్లింగ్, అసమర్థ నిర్వహణ, ఐసీసీ సభ్య దేశాల మధ్య అధికారాల అసమ పంపిణీ మొదలైనవి ప్రస్తుతం క్రికెట్‌ను పీడిస్తున్న సమస్యలు' అని 2012లో ఆయన ఒక ఉపన్యాసంలో వ్యాఖ్యానించాడు. క్రికెట్ స్ఫూర్తికి భారత్ నిబద్ధమయి వ్యవహరిస్తే ఈ సమస్యలలో చాలా భాగం పరిష్కారమవుతాయని ఆయన ముక్తాయించాడు. 'ప్రపంచ క్రికెట్ వ్యవహారాలను దాదాపు వంద సంవత్సరాల పాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా శాసించాయని... దురదృష్టవశాత్తు చాలా సందర్భాలలో క్రికెట్ స్ఫూర్తి కంటే స్వార్థ ప్రయోజనాలకే ఆ రెండు దేశాలు ప్రాధాన్యమిచ్చాయని, భారత్, న్యూజిలాండ్‌ల పట్ల వివక్ష చూపడం జరిగిందని' గ్రెగ్ అంగీకరించాడు. 'ఇప్పుడు ఐసీసీకి సారథ్యం వహిస్తున్న భారత్ క్రికెట్ స్ఫూర్తితో వ్యవహరించగలదని, వివిధ అంశాలపై ఓటింగ్ విషయంలో ఇతర సభ్య దేశాలను ప్రభావితం చేయబోదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశాడు.

ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో సంపూర్ణ ఆధిపత్యం సాధించాలనే బీసీసీఐ ప్రగాఢ ఆరాటానికి, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లలోని (స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్న) క్రికెట్ అధికారులు తోడ్పడుతున్నారు. ఇదే సమయంలో ఉపఖండంలోని ఇతర దేశాలతో పాటు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లోని క్రికెటర్లు, క్రికెట్ అభిమానులు, క్రికెట్ బోర్డుల అధికారులను బీసీసీఐ దూరం చేసుకున్నది. మూడో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ముగిసిన తరువాత ప్రచారంలోకి వచ్చిన ఒక వీడియో, విజేత దక్షిణాఫ్రికా టీమ్ కంటే జై షానే క్రికెట్‌కు చాలా ముఖ్యం అన్నట్లుగా వివరించింది. దీనిపై వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్లు ఆండీ రాబర్ట్స్, మైకేల్ హోల్డింగ్ ప్రతిస్పందిస్తూ ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో భారత్ ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద ధోరణులపై ధ్వజమెత్తారు.

1909లో ప్రభవించిన నాటి నుంచీ ఐసీసీ కుట్ర, అసమర్థత, అనర్హతలకు నెలవుగానే ఉన్నది. ఇప్పుడు వాటికి అవినీతి, అపకార బుద్ధి తోడయ్యాయి. ఇంగ్లాండ్ సారథ్యంలో అది అంతర్జాతీయ క్రికెట్‌కు అందించిన ఆరోగ్యకరమైన సేవలు స్వల్పమే. ఇప్పుడు భారత్ నాయకత్వంలోనూ పరిస్థితులు మెరుగ్గా లేవు. అసలు భారతీయ క్రికెట్‌కు అయినా బీసీసీఐ ప్రశస్తంగా సేవలు అందిస్తున్నదా అన్నది స్పష్టంగా చెప్పలేము. టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైన, ప్రతిష్ఠాత్మక ఆట అని, అది క్రికెట్‌కు అత్యంత సంప్రదాయక ఫార్మాట్ అని ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు అందరూ అంగీకరించారు. అయితే ఇప్పటివరకు మూడుసార్లు జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో టీమ్ ఇండియా ఒక్కసారి కూడా గెలవలేదు. మన క్రికెటర్లు అసంఖ్యాక క్రికెట్ అభిమానుల నుంచి అవధులు లేని ఆరాధన, అంతకు మించి ఆర్థిక లబ్ధి పొందుతున్నారు; బీసీసీఐ కోశాగారంలో అపార ధనరాశులు ఉన్నాయి; మన కుబేరులు, రాజకీయవేత్తలు తమ ఆర్థిక వనరులు, పేరు ప్రతిష్ఠలను భారతీయ క్రికెట్‌కు వెచ్చిస్తున్నారు. అయినా తొలి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో న్యూజిలాండ్ చేతిలో ఇండియా ఓడిపోయింది. (ఆ దేశ జనాభా మన సూరత్ నగర జనాభా కంటే తక్కువ. ద్వితీయ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఇండియా ఓడిపోయింది (ఆ దేశ జనాభా మన ముంబై నగర జనాభా కంటే తక్కువ). ఇక తృతీయ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఇండియా చేరనేలేదు!

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ రికార్డు సాధారణమైనది. గత వంద సంవత్సరాలుగా ప్రపంచ క్రికెట్ వ్యవహారాలలో భారత్ పాత్ర భిన్న కాలాలలో విభిన్నంగా ఉన్నది: తొట్ట తొలుత శ్వేతజాతీయుల ఆధిపత్యాన్ని వినయపూర్వకంగా గౌరవించింది. ఆ తరువాత సమాన ప్రతిపత్తిని అభ్యర్థించింది; అనంతరం ఒక ప్రముఖ పాత్రను సముపార్జించుకున్నది. అంతిమంగా ఇప్పుడు అధికార ఆధిపత్యాన్ని చెలాయిస్తోంది. అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేయడంలో అమెరికా, చైనా, రష్యా కంటే మనం చాలా వెనుక స్థానంలో ఉన్నాం. ఆర్థిక శక్తి విషయంలో (జీడీపీ పరంగా కాకుండా తలసరి ఆదాయం విషయంలో) మనం ప్రస్తుతం ప్రపంచంలో 137వ స్థానంలో ఉన్నాం. అయితే అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాల నిర్వహణ (దుష్ట నిర్వహణలో కూడా) విషయానికి వస్తే భారత్ కేవలం విశ్వ గురు మాత్రమే కాదు, విశ్వ బాస్, ఇంకా చెప్పాలంటే విశ్వ రౌడీ.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 16,449 ఉపాధ్యాయుల నియామకాల కోసం 2003 నవంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 4, 5, 6 తేదీల్లో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను 2004 జూన్‌లో విడుదల చేసింది. అదే నెలలో అభ్యర్థుల ఎంపిక జాబితాలను ప్రకటించి, సర్టిఫికెట్లను పరిశీలించి, వెంటనే నియామకాల కోసం షెడ్యూల్ విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ ప్రభుత్వం పరిపాలనాపరమైన కారణాలతో కాలయాపన చేసింది. దీంతో ఎంపికయిన డీఎస్సీ–2003 అభ్యర్థులు ఉద్యమ బాట పట్టడంతో ప్రభుత్వం నవంబర్ 2005లో నియామకాలు పూర్తిచేసింది.

జనవరి 1, 2004 నుంచి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు నూతన్ పెన్షన్ విధానాన్ని (ఎన్‌పీఎస్) అమల్లోకి తీసుకొచ్చింది. సెప్టెంబర్ 2004లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను కేంద్రం అమలుచేసింది. ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 1, 2004 నుంచి విధుల్లోకి వచ్చిన ఉద్యోగులకు డిఫైన్డ్ పెన్షన్ స్కీం(పాత పెన్షన్) రద్దు చేసి, సీపీఎస్ విధానాన్ని అమలు చేసింది. కానీ 2003లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో సీపీఎస్ విధానం అమలు గురించి గానీ, నియామక ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఉండే విషయాలు వర్తిస్తాయని గాని ఎక్కడా పేర్కొనలేదు. డీఎస్సీ–2003 ద్వారా నియామకమైన వారికి జీపీఎఫ్ స్థానంలో సీపీఎస్ ఖాతా ప్రారంభించింది. దీంతో ఆందోళనకు గురైన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఫోరం తరపున ప్రభుత్వ పెద్దలను అనేకసార్లు కలిసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తులు చేసినా, ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉపాధ్యాయులే కాక, డిసెంబర్ 1999లో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా గ్రూప్–2 పోస్టులకు; డిసెంబర్ 2003లో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి కొన్ని అనివార్య కారణాల వల్ల సెప్టెంబర్, 2004 తర్వాత నియామకాలు జరిగాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 1) డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు 7,361 మంది, పోలీస్ కానిస్టేబుల్స్ 1,821, గ్రూప్–2 సర్వీస్ ఉద్యోగులు 1,800... మొత్తంగా 10,982 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఉద్యోగ, ఉపాధ్యాయులకు వజ్రాయుధం అయింది.

జనవరి 1, 2004కు ముందు నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నూతన పెన్షన్ విధానంలోకి అనివార్యంగా వచ్చిన సందర్భంలో వారు కోర్టులను ఆశ్రయించారు. వివిధ రాష్ట్రాల హైకోర్టులు, కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ కోర్టు తీర్పులను సూచిస్తూ, వివిధ ప్రాతినిధ్యాలు, నిర్ణయాల దృష్ట్యా డిసెంబర్ 22, 2003కి ముందు ఎంపికై జనవరి 1, 2004 తరువాత నియమితులైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెంట్రల్ మెమో 57 ప్రకారం వన్ టైం ఓపీఎస్ (పాత పెన్షన్) ఆప్షన్‌ను కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఇప్పటివరకు భారతదేశంలో మెమో 57 ప్రకారం భారతీయ రైల్వే, తపాలా, సెంట్రల్ బెటాలియన్ ఫోర్స్ తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు; సుమారు 16 రాష్ట్రాల్లోని ఉద్యోగులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం పాత పెన్షన్ అమలుకై నిర్ణయం తీసుకోలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వంలోని ముగ్గురు ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2023లో గత రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించిన సంగతి తెలిసిందే. అత్యున్నత హోదాలో ఉన్న అధికారులకు ఒక న్యాయం, దిగువ స్థాయిలో ఉన్న ఉద్యోగ–ఉపాధ్యాయులకు ఒక న్యాయం సరైన విధానం కాదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ముగ్గురు ఐఏఎస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2023లో గత ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరించింది. అత్యున్నత హోదాలో ఉన్న అధికారులకు ఒక న్యాయం, దిగువ స్థాయిలో ఉన్న ఉద్యోగ–ఉపాధ్యాయులకు ఒక న్యాయం సరైన విధానం కాదు.



రాష్ట్రంలో గత ప్రభుత్వం 2022లో ఉద్యోగ సమస్యలపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి అంగీకరించింది. అలాగే 2024 ఫిబ్రవరిలో ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో కూడా అర్హత గల ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి లిఖితపూర్వక హామీ ఇచ్చింది.

ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ, నిబంధనలకు సంబంధించి సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం నవంబర్ 7, 2023న కీలక తీర్పు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదని, ఉద్యోగ నియామక ప్రక్రియ నిబంధనలు ఏకపక్షంగా ఉండకూడదని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని, వివక్షకు తావు ఉండరాదని పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా సెప్టెంబర్ 1, 2004కు ముందు రిక్రూట్ అయిన ఉద్యోగుల వివరాలను 2020 నుంచి ఇప్పటివరకు దాదాపు 20సార్లు రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. గత ప్రభుత్వం ఉద్యోగులకు హామీ ఇచ్చి కూడా మొండి చేయి చూపించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాది దాటినా ఈ సమస్య పట్ల సాచివేత ధోరణితోనే ఉంది. మాకు సంబంధించిన ఫైల్ ఆర్థికశాఖ వద్ద సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉంది. మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరణకు కేంద్రం, రాష్ట్రాలకు ప్రత్యేక మార్గదర్శకాలు ఇవ్వనవసరం లేదు.

ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణం స్పందించి రాష్ట్రంలో ఉన్న 11,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

■ కొమ్మనబోయిన లక్ష్మీశ్రీనాథ్


రాష్ట్ర కన్వీనర్, డీఎస్సీ–2003 ఉపాధ్యాయుల ఫోరం

(పాత పెన్షన్ సాధనకై ఆగస్టు 25న విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా)

అంతరిక్ష పరిశోధనలో నవ శకం

భారతదేశం నూతన అంతరిక్ష సాంకేతికతతో విశ్వ రహస్యాల అన్వేషణకు సిద్ధమవుతున్నది. 2023, ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3లోని విక్రమ్ ల్యాండర్ 'శివశక్తి' అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నది. ఈ మిషన్ విజయం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్‌లో వృత్తిని కొనసాగించడానికి భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇవ్వనున్నది. 2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడి పైకి పంపాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ఇస్రో నిర్దేశించుకున్నది. ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించడానికి గగన్‌యాన్ మిషన్ కీలకం కానున్నది. మరోవైపు ఇస్రో 2035 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. వీటితో పాటు ఉన్నత విద్య, పరిశోధనలో యువ భాగస్వామ్యాన్ని పెంచాలి. శాస్త్ర పరిశోధనలకు మన దేశ జీడీపీలో ఒక శాతం లోపే ఖర్చు చేస్తున్నారు. మరింత బడ్జెట్ కేటాయించాలి. అప్పుడే వికసిత్ భారత్ 2047 కల సాకారం అవుతుంది.

–సంపతి రమేష్ మహరాజ్



ఇచ్చారు.. తీసేశారు
- శావల్యాపురం - రొంపిచర్ల మార్గంలో నెలాఖరు వరకే

తగ్గిన వరద
- ఊపిరి పీల్చుకుంటున్న తీరప్రాంత ప్రజలు

ప్రతి విద్యార్థికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు
- రెండో సారి దరఖాస్తు చేసుకోకుండా ఆధార్‌తో సర్టిఫికెట్లు జారీ
- ఉమ్మడి జిల్లాలో సర్టిఫికెట్లు జారీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

8

సర్‌చార్జి.. పెండింగ్

- 1172 పంచాయతీలకు రూ.30 కోట్లు..
- నెలలు తరబడి నిలిచిపోయిన చెల్లింపులు
- సర్‌చార్జి కోసం స్థానిక సంస్థల ఎదురుచూపు
- సీఎఫ్‌ఎంఎస్‌తో నిధుల విడుదలకు అంతరాయం

ప్రభుత్వం నుంచి నిధులు రాక.. ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యంతో.. న్యాయబద్ధంగా రావాల్సిన సర్‌చార్జి కూడా అందక పంచాయతీలు ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక సంస్థల ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే సర్‌చార్జి(ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) ముఖ్యమైనది. ప్రతి రిజిస్ట్రేషన్‌లోనూ వసూలు చేసే 1.5 శాతం సర్‌చార్జిని జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు జమ చేయాలి. గతంలో రిజిస్ట్రార్లు ఎప్పటికప్పుడు లెక్కలు వేసి దామాషా పద్ధతిలో చెల్లింపులు చేసేవారు. సీఎఫ్ఎంఎస్(కాంప్రహెన్సీవ్ ఫైనాన్స్ సిస్టం) అమల్లోకి వచ్చిన తర్వాత ఆ స్టాంప్‌డ్యూటీ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి వెళ్తుంది. అక్కడ నుంచి స్థానిక సంస్థలకు చెల్లింపులు జరగాలి. అయితే ఈ ప్రక్రియ సక్రమంగా జరగడంలేదు. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి ఎంత బకాయి ఉన్నదో చెప్పేందుకు కూడా రిజిస్ట్రేషన్ శాఖ తటపటాయిస్తోంది.

జడ్పీకి రూ.28 కోట్ల బకాయి

గుంటూరు సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు సర్‌చార్జి చెల్లింపులు పెండింగ్ పెట్టారు. ఆరేళ్ల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు సర్‌చార్జి రూపేణా సుమారు రూ.65 కోట్ల వరకు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం రూ.37 కోట్లు మాత్రమే చెల్లించినట్లు లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన రూ.28 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అసలు ఏ సంవత్సరం వరకు సర్‌చార్జి జమ అయ్యిందో కూడా సమాచారం లేదని సంబంధిత పాలకవర్గాలు వాపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పంచాయతీలకు ఏడాదిగా సర్‌చార్జి రాలేదు. గ్రామ పంచాయతీలకు సుమారు రూ.30 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. సర్‌చార్జి నిధులు జమ కాకపోవడంతో పంచాయతీల్లో కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులతో పాటు ఇతర కార్యకలాపాలు జరగని దుస్థితి నెలకొంది.

మాదేమీ లేదంటున్న రిజిస్ట్రార్లు

సర్‌చార్జి చెల్లింపుల కోసం జిల్లా రిజిస్ట్రార్లను పలువురు సర్పంచ్‌లు కలుస్తున్నారు. నిధులు జమలో తమకు సంబంధం లేదని ఐజీ (మిగతా 6వ పేజీలో)





- పెదకాకాని

శ్రావణమాసం చివరి శుక్రవారం పెదకాకాని శ్రీ భ్రమరాంబ అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు జరిపించారు.

బీజేపీ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు



గుంటూరు(తూర్పు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ముగ్గురికి పదవులు దక్కాయి. రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ మకుటం శివలను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఉత్తర్వులను జారీ చేశారు. వల్లూరి జయప్రకాష్ నారాయణ బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. రాష్ట్ర కమిటీలో ఎన్నికైన నాయకులకు పలువురు జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

వరద తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలి

బొమ్మువానిపాలెం పర్యటనలో మంత్రి నాదెండ్ల

కొల్లిపర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరదలతో పంటలు నష్టపోయిన లంకగ్రామాల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో శుక్రవారం ఆయన పర్యటించారు. నదిలో వరద ఉధృతిని, గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి పరిశీలించారు. వరద తగ్గేవరకు వైద్య సిబ్బంది, మండలస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయాధికారులు, రైతులను అడిగి వరద కారణంగా పంటలకు జరిగిన నష్టాల గురించి తెలుసుకున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 4 లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని దిగువకు విడుదల చేసినందున లంకగ్రామాల ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పల్లపు ప్రాంతాల్లో ఉద్యాన పంటలు కొంతమేర దెబ్బతిన్నట్లు అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని వారిని ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రైతులకు విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను అందించనున్నట్లు తెలిపారు. పామాయిల్ తోటలు వేసుకుంటే 90 శాతం సబ్సిడీ ఇప్పిస్తామని రైతులకు తెలిపారు. మంత్రి వెంట సర్పంచ్ కొల్లి రజని, తహసీల్దార్ సిద్ధార్థ, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఏడీఏ రాజకుమారి, నాయకులు అడపా నారాయణరెడ్డి, మొవ్వా వెంకటయ్య, యర్రు వెంకయ్యనాయుడు, కన్నెగంటి శ్రీనివాసరావు ఉన్నారు.



ద్వారకా తిరుమలరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర

విద్యుత్ బస్సులతో.. పల్లె వెలుగు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

పొన్నూరు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో అందుబాటులోకి రానున్న విద్యుత్ బస్సులను పల్లెవెలుగు గ్రామీణ ప్రాంత సర్వీసులకు కేటాయిస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. పొన్నూరులోని ఆర్టీసీ డిపోని శుక్రవారం ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకంలో పొన్నూరు నియోకవర్గంలో నిత్యం 11,800 మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుండగా ఆ సంఖ్య రాష్ట్రంలో 21 లక్షలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మహిళా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా సిబ్బందికి సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు. ఏడాది ప్రతిభ చూపిన ఉద్యోగులకు ఎండీ బహూమతులను అందజేశారు.

డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే వినతి

డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, డిపో పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని, బస్సు సర్వీసులు పెంచాలని ఎండీకి ఎమ్మెల్యే నరేంద్ర వినతిపత్రం అందజేశారు. 1966లో ఏర్పడిన డిపో అనేక కారణాలతో వెనుకబడిందని, సర్వీసులు ఇతర ప్రాంతాలకు తరలించడంతో ప్రస్తుతం పొన్నూరు డిపోకు ప్రాధాన్యం తగ్గిపోయిందని ఎమ్మెల్యే ఎండీకి వివరించారు. పొన్నూరు డిపో నుంచి గ్రామీణ ప్రాంతాలకు బస్ కనెక్టివిటీ పెంచాలని కోరారు. శ్రీశైలం, తిరుపతి, బెంగళూరు, చెన్నై హైదరాబాద్, రాయచోటి, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు బస్సులు నిర్వహించాలన్నారు. డిపో అభివృద్ధికి సహకరిస్తానని, బస్సు సర్వీసులు పెంచుతామని ఎండీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీలు ప్రసాద్, చంగల్‌రెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.



కోబాల్డ్‌పేటలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ

నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ

- 6 నెలల్లో 35 గంజాయి కేసుల్లో 200 మంది గుర్తింపు
- కోబాల్డ్‌పేటలో కార్డెన్‌సెర్చ్‌లో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నిఘా నేత్రాలతో సమర్థవంతంగా నేరాలు నియంత్రించవచ్చని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోబాల్డ్‌పేటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించగా ఎస్పీ స్వయంగా పాల్గొని పర్యవేక్షించారు. ఈ ప్రాంతంలోని మూడో లేన్ నుంచి ఏడో లేన్ వరకు కార్డెన్‌సెర్చ్ వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, 125 మంది సిబ్బందితో నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి, శాంతి భద్రతలకు సంబంధించి సమస్యలను ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమేరాల ఏర్పాటుతో పాటు వాటి పని తీరును ఎస్పీ పరిశీలించారు. సున్నిత ప్రాంతాలు, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమేరాల ఆవశ్యకత గురించి సీఐ గంగా వెంకటేశ్వర్లుకు సూచించారు. ఫింగర్‌ప్రింట్ పరికరాల ద్వారా అనుమానితుల వివరాల పరిశీలించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికల గురించి ఆరా తీశారు. ధ్రువీకరణ పత్రాలు సరిగా లేని, నెంబర్ ప్లేట్లు లేని 61 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు కలిపి మొత్తం 65 వాహనాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెనాలి, మంగళగిరి, తాడేపల్లిలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి గంజాయి ముఠాల సంచారం, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల చర్యలను కట్టడి చేశామన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో గంజాయి నిర్మూలన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గడచిన 6 నెలల్లో సుమారు 35 కేసుల్లో 200 మందికి పైగా నిందితులను గుర్తించామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పటిష్ఠమైన చర్యలతో గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శివాజీరాజు తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

- నేతన్నల నుంచి భారీగా దరఖాస్తులు
- షెడ్డు కార్మికులకూ వర్తింపజేసేందుకు కసరత్తు
- గుంటూరు జిల్లాలో 2,460, పల్నాడులో 280 మంది గుర్తింపు
- బాపట్ల జిల్లాలో 7 వేలకు పైగా కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఊరట కల్పించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ నెల 7న మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ రోజు నుంచే పథకం అమలులోకి వస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ముమ్మరంగా సాగుతోంది. ఈ ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేస్తున్నారు. చేనేత, జౌళీ శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో లబ్ధిదారుల జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. చేనేత కార్మికులుగా గుర్తింపు ఉన్న కార్మికుల ఇళ్లకు వెళ్లి వాళ్ల వివరాలను సేకరిస్తున్నారు. చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం (మిగతా 6వ పేజీలో)

మెగా డీఎస్సీ.. మెరిట్ జాబితా విడుదల

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ జనరల్ మెరిట్ లిస్టు - 2025ని విద్యా శాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. రాష్ట్ర, జోన్, జిల్లా మెరిట్‌లిస్టులను ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో పోస్టుల వారీగా పొందుపరిచింది. మొత్తం 60 కేటగిరీల పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టులను వెబ్‌సైట్‌లో అప్‌లోడింగ్ చేసింది. పరీక్ష రాసిన అభ్యర్థులు తమకు ఎంత ర్యాంకు వచ్చిందోనని వెబ్‌సైట్‌లో శోధించారు. ఆయా కేటగిరీల్లో మొదటి మూడు ర్యాంకుల వివరాలు..

- ఎస్ఏ(ఎల్) ఇంగ్లీషులో మొదటి ర్యాంకు కన్నా సాంబశివరావు (85.80 స్కోరు), రెండో ర్యాంకు సుమన్ నలుకుర్తి(85.70), మూడో ర్యాంకు పరుచూరి హేమంత్ అర్జున్ కుమార్(85.37) సాధించారు.
- ఎస్ఏ(ఎల్) హిందీలో మొదటి ర్యాంకు వెంకట శివనాగజ్యోతి భాస్కరుని(92.10), రెండో ర్యాంకు జానీ షేక్(85.80), మూడో ర్యాంకు ముత్తిరెడ్డి రమ(83.50) సాధించారు.
- ఎస్ఏ(ఎల్) తెలుగులో మొదటి ర్యాంకు తిమ్మసముద్రం నాగమణి(84.63947), రెండో ర్యాంకు సోముల అంజలి కుమారి (83.70947), మూడో ర్యాంకు దుర్గా కోడిపల్లి(83.67730) సాధించారు.
- ఎస్ఏ(ఎల్) ఉర్దూలో మొదటి ర్యాంకు మీరా సాహెబ్(77.10), రెండో ర్యాంకు మొహమ్మద్ రబ్బాని (76.80), మూడో ర్యాంకు షేక్ ఇమ్రాన్(74.33) సాధించారు.
- ఎస్ఏ(ఎన్ఎల్) బయోలాజికల్ సైన్స్‌లో మొదటి ర్యాంకు చలగిరి వీ రమణ(86.89280), రెండో ర్యాంకు భవనాసి మరియబాబు (84.25983), మూడో ర్యాంకు సీన్ బాషా షేక్(83.87909) సాధించారు.
- ఎస్ఏ(ఎన్ఎల్) మాథమెటిక్స్‌లో మొదటి ర్యాంకు ఫసీహ బేగం(89.33357 స్కోరు), రెండో ర్యాంకు ఆవుల నాగ శ్రీవల్లి (89.31408), మూడో ర్యాంకు చల్లగిరి మురళీకృష్ణ (88.58383) సాధించారు.
- ఎస్ఏ(ఎన్ఎల్) ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మొదటి ర్యాంకు సాంబశివరావు చందాల(89 స్కోరు), రెండో ర్యాంకు కోట కృష్ణతేజ చైతన్య(89), మూడో ర్యాంకు తిరువైపాటి ఆనంద్ (88.5) సాధించారు.
- ఎస్ఏ(ఎన్ఎల్) సోషల్ స్టడీస్ ఉర్దూ మీడియంలో మొదటి ర్యాంకు వెంకట షమ్మా సుల్తానషేక్ (62.45), రెండో ర్యాంకు ఈసుబు తాడికొండ షేక్(60.87), మూడో ర్యాంకు అజీ జున్‌బీ షేక్ (59.31) సాధించారు.
- ఎస్ఏ(ఎన్ఎల్) ఫిజిక్స్‌లో మొదటి ర్యాంకు కూరాకుల బాల కిశోర్(88.98), రెండో ర్యాంకు నాగ రాజు నక్కా(81.87), మూడో ర్యాంకు సయ్యద్ అజీజ్(80.14) సాధించారు.
- ఎస్‌జీటీ ఉర్దూ మీడియంలో మొదటి ర్యాంకు రుసుందార్ షబనాజ్(82.73), రెండో ర్యాంకు షేక్ రేష్మా(77.57); మూడో ర్యాంకు రేష్మా బేగం(75.77) సాధించారు.

ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు

గుంటూరు మెడికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే విజయలక్ష్మి శుక్రవారం నగరంలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. కొత్తపేటలోని అమృత యాంజియో కేర్, తక్కెళ్లపాడులోని కిమ్స్ చక్ర ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ జరిపి పలు లోపాలు గుర్తించారు. ఆయా ఆసుపత్రుల్లో వివిధ వైద్య సేవల ధరల పట్టికలు లేకపోవుటం, వెంటిలేషన్ సదుపాయం లేకపోవుటంపై నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అల్లోపతి యాక్ట్‌ను అతిక్రమించిన ఆసుపత్రులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. పేదలకు ప్రైవేట్ ఆసుపత్రులు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆస్పత్రుల నిర్వాహకులను హెచ్చరించారు.



ప్రైవేటు వైద్యశాలలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

లబ్ధిదారులకు రుణసాయం అందించాలి

పీఎం విశ్వకర్మ సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకంలో శిక్షణ పొందిన వారికి పరికరాలతోపాటు అవసరమైన వారికి రుణాల మంజూర అయ్యేలా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటుకు ఏక గవాక్ష విధానం ద్వారా అందించిన దరఖాస్తులను గడువు లోపు పరిష్కరించాలన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంగళగిరిలో గోల్డ్‌క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతుల మంజూరు చేసినందున పనులు వేగవంతం చేయాలన్నారు. చేనేత క్లస్టర్‌కు దేవదాయశాఖను సమన్వయం చేసుకుని భూములను ఏపీఐఐసీకి బదలాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలు మేరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వ్యాపార సంస్థల విస్తరణకు అవసరమైన రుణ సాయం బ్యాంకుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాణిజ్య, వ్యాపారవేత్తలకు నైపుణ్యాల పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించే ఆర్ఏఎంపీ శిక్షణ తరగతులకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈలకు వివిధ ప్రోత్సాహకాలకు సంబంధించి 24 క్లెయిమ్‌లకు రూ.1,37,39,826 మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు ఏ జయలక్ష్మి, ఉప సంచాలకుడు మధుసూదనరావు, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ మనోరమ, ఏపీఎస్‌పీసీ సీనియర్ బ్రాంచ్ మేనేజరు పీ వెంకయ్య, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్ర బాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ ఎన్ అల్లూరయ్య, ఏపీపీసీబీ ఈఈ ఎండీ నజీమబేగం, జిల్లా నైపుణ్య అధికారి సంజీవరావు, ఏపీసీపీడీసీఎల్ ఏఈ రత్నశోభ, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు డాక్టర్ ఎంఎల్ఎన్ రావు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, ఫ్యాప్సీయ ప్రతినిధి చాణుక్య, సిక్కీ రీజినల్ హెడ్ పరిమణ పాల్గొన్నారు.

నైపుణ్యాల మెరుగునకు ఏఎన్‌యూ ఒప్పందం


ఒప్పంద పత్రాలు చూపుతున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య శుక్ర వారం ఒప్పందం కుదిరింది. స్కిల్ డిజైర్ డైరెక్టర్ ఎం.శ్రీకాంత్, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఎంఓ యూ పత్రాలు మార్చుకున్నారు. వర్సిటీలోని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి నైపుణ్యాలు మెరుగుపడటానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం, మాస్టర్ క్లాసెస్, టెక్నికల్ ట్రైనింగ్స్‌ను ఉచితం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ సింహాచలం, రెక్టార్ రత్న శిలామణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్. లింగరాజు పాల్గొన్నారు.

యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు

● అనంత్ టెక్నాలజీస్ చైర్మన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి


మాట్లాడుతున్న సుబ్బారావు

గుంటూరు (విద్య)ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆవి ష్కరణలు, ఉపగ్రహ ప్రాజె క్టులు, పరిశోధనలు ఇవన్నీ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తాయని హైదరా బాద్‌లోని అనంత్ టెక్నాల జీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బా రావు పావులూరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని టీమ్ సీవోఈ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తు తరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చే రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవమని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 23న చంద్రయాన్3 మిషన్ ల్యాండర్ విక్రం చంద్రుడి ఉపరితలాన్ని తాకిన చారిత్రక సందర్భాన్ని గుర్తుగా చేసుకుంటూ, ఈ రోజును అధికారికంగా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వెల్లడించారు. విజ్ఞాన్స్ వర్సిటీలో జరిగిన నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌స్పేస్ టెక్ అకాడమీ (ఏపీఎస్‌ఏ)ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి నూతన అధ్యక్షుడిగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ఎంపికయ్యారు. గౌరవ అతిథి శ్రీహరికోట మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరి రావు, హైదరాబాద్ జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ ఐ.వీ.మరళీకృష్ణ, ఏఎస్‌టీసీ సెక్రటరీ సి.ఎల్. నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాస రెడ్డి, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి పాల్గొన్నారు.

జీఎస్టీ శ్లాబులు 12శాతం మించకూడదు

● చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి


సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో ఇకపై అమలు చేయనున్న రెండు శ్లాబులు కూడా 12 శాతం మించకుండా చర్యలు తీసుకోవాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీలో ఇకపై నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబులే కొనసాగేలా కేంద్ర మంత్రివర్గం తీర్మానం చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే 5, 18 శాతం ఉంచడానికి తీర్మానం చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 12 శాతం మించకూడదని, పైగా సామాన్య ప్రజలు వినియోగించే వస్తువులను 5 శాతం శ్లాబులో చేర్చాలని కోరారు. అదే విధంగా రైతులు వినియోగించే యూరియాతో పాటు వస్తువులపై పన్ను లేకుండా మినహాయింపు కల్పించాలన్నారు. గృహ నిర్మాణాలపై కూడా ఐటీ మినహాయింపు కల్పిస్తే అత్యధిక శాతం మందికి సొంత ఇల్లు కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీలో చేర్చాలని తాము తొలి నుంచి డిమాండ్ చేస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతుందన్నారు. వీటిని జీఎస్టీలో చేర్చితే.. నిత్యావసరాల ధరలు తగ్గే అవకాశం ఉంటుందని, సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూళ్ల ఆలోచన కంటే తక్కువ పన్నుతో ఎక్కువ ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చాంబర్ సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీరాంబాబు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, ఆతుకూరి నగేష్‌కుమార్, కొత్తూరి వెంకట్ తదితరులున్నారు.

విజేత ఆంధ్ర గ్రీన్ క్రికెట్ జట్టు


ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

గుంటూరు (క్రీడ లు) ఆగస్టు 22(ఆంధ్ర జ్యోతి): స్థానిక పిచ్చుకుల గుంట క్రికెట్ మైదా నంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర అంధుల క్రికెట్ పోటీలలో ఆంధ్ర గ్రీన్ క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్, విజువల్లీ చాలెంజ్‌డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 42 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభను కనబరిచిన వారిని ఆంధ్ర ప్రదేశ్ అంధుల క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ అధ్యక్షుడు జి. రవీంద్ర బాబు విచ్చేశారు. ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరిని ప్రశంసించారు. విజేత జట్టుకు ట్రోఫీని, ప్రశంస పత్రాలను అందజేశారు. పోటీల నిర్వాహకుడు కొలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐటీసీ, ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఈ పోటీలకు సహాయ సహకారాలు అందజేశాయని అన్నారు. అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి, ఒడిశాకు చెందిన భారత అంధుల క్రికెటర్ పంకజ్ బోయి, శ్రీధర్ బాబు, పరమహంస పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

(5వ పేజీ తరువాయి)

సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ దరఖాస్తుల కోసం సచివాలయాల వద్ద బారులు తీరుతున్నారు. కాగా ఇప్పటికే మూడు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చింది. అర్హుల జాబితా ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్యాలయాలకు చేరినట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది షెడ్డులో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాగా పల్నాడు జిల్లాలో 280 మంది మాత్రమే అర్హులుగా ఉన్నట్లు తేలింది. అయితే బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7వేల పైచిలుకే ఉండే అవకాశం కనిపిస్తోంది. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పొందినవారి సంఖ్యే 7వేల పైచిలుకు ఉంది. అయితే అట్టడుగు వర్గానికి చెందిన కార్మికులను నేతన్న నేస్తం లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదు. అలాంటివారు కూడా ఇప్పుడు ఉచిత విద్యుత్ స్కీముకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారిని కూడా కలుపుకుంటే మూడు జిల్లాల్లో ఈ సంఖ్య మరో ఐదువేల వరకూ పెరిగే అవకాశం కనిపిస్తోంది.

సర్‌చార్జి.. పెండింగ్

(5వ పేజీ తరువాయి)

అనుమతి ఇస్తే నిధులు జమవుతాయని వారు సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తుంది. ఐజీ అనుమతి ఇవ్వాలంటే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని సమాచారం.

అప్పుల్లో కూరుకుపోతున్నాం

గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం విడుదల చేసి ఎనిమిది నెలలు దాటింది. కానీ ఇంతవరకు గ్రామ పంచాయతీలకు జమ చేయలేదు. గ్రామాల్లో ఏ చిన్న అవసరం వున్నా అప్పు చెయ్యాల్సి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న సర్‌చార్జి నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి సర్‌చార్జి రాలేదని గుంటూరు జిల్లా వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలితకుమారి తెలిపారు.

భార్యను రైలు కిందకు తోసిన భర్త

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త రైలు కిందకు తోసిన ఘటన తాడేపల్లి పట్టణంలో శుక్రవారం జరిగింది. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన వెంకటేశ్వరరావు, భార్య అంజలి కొద్దికాలంగా తాడేపల్లిలో నివాసం ఉంటున్నారు. స్థానిక సలాం హోటల్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఇద్దరూ గొడవ పడుతున్న సమయంలో అకస్మాత్తుగా భార్య అంజలిని రైలు కిందకు తోసేశాడు. గొడవను గమనిస్తున్న స్థానికులు గాయాల పాలైన ఆమెను కాపాడి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావును రైల్వే పోలీసులకు అప్పగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

వైద్యుల సమస్యల్ని తప్పక పరిష్కరిస్తాం

● ఐఎంఏ రాష్ట్ర బృందానికి సీఎం హామీ


సీఎంకు సమస్యలను వివరిస్తున్న నందకిషోర్

గుంటూరు మెడికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగంలో సేవల్ని మరింత విస్తృతపరచడంలో, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ఐఎంఏ ఎల్లప్పుడు ప్రభుత్వానికి సహకరిస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి నందకిషోర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. శుక్రవారం ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు, డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.సురేష్‌బాబుతో కలిసి ఆయన వైద్యుల సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ ఏపీ ఐఎంఏ శాఖలో 25 వేల మంది వైద్యులు ఉన్నారని వివరించారు. వృత్తిపరంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామన్నారు. ముఖ్యంగా వైద్యులపై దాడుల విషయంలో ప్రస్తుతం ఉన్న చట్టంలో మరికొన్ని మార్పులు చేయాలని కోరామన్నారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో అగ్నిమాపక శాఖ నిబంధనలను కొన్నింటిని సవరించాలని సూచించారు. అదేవిధంగా పది పడకల లోపు ఉన్న ఆసుపత్రుల విషయంలో కొన్ని నిబంధనలు సడలించాలన్నారు. ఫైర్ ఎన్‌వోసీ రెన్యువల్ ఐదేళ్లకు ఒకసారి చేయించుకొనేలా నిబంధనలు మార్చాలని ముఖ్యమంత్రిని కోరారు. ఐఎంఏ వైద్య బృందం వివరించిన సమస్యలన్నీ శ్రద్ధగా విన్న చంద్రబాబు వాటిని పరిశీలించి, సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం: ఎమ్మెల్యే నరేంద్ర


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తోందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులోని తన కార్యాల యంలో ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి మంజూరైన నగదు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 7 చెక్కులను రూ.9,08,300లను అందజేశారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడుకు చెందిన బొమ్మిశెట్టి విశ్వనాథవర్మకి రూ.4,86,300, ఇంటూరి శివకృష్ణకి రూ.1,18,881, పెదకాకానికి చెందిన ఉల్లం శంకర్‌కి రూ.30,785, గాదె హరిరమా సుబ్బమ్మకి రూ.50,000, గరికముక్కు జోషప్ కుమార్‌కి రూ.32,100, వెనిగండ్ల గ్రామానికి చెందిన చొప్పర ముత్తయ్యకి రూ.1,25,308, ఉప్పలపాడు గ్రామానికి చెందిన నక్కల కృష్ణకుమారికి రూ.64,926 చెక్కులను ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అందజేశారు.

రైతులకు శనగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న శేషుమాధవ్

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రి కల్చర్(నిర్కా) ఆధ్వర్యం లో చిన్న, సన్నకారు రైతులకు శనగ విత్తనాలను అధికా రులు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం మిర్చియార్డు ఎదురుగా ఉన్న ఎన్ఐఆర్‌సీఏ(పూర్వ సీటీఆర్ఐ) ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిర్కా రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సీ సబ్‌ప్లాన్ కింద చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఒక్కో మహిళ రైతుకు 20 కేజీల శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ విత్తనాలను పొలాల్లో నాటుకొని మంచి లాభాగా గడించాలని ఆకాంక్షించారు. మొత్తం 55 మంది మహిళ రైతులకు శనగలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్కా గుంటూరు స్టేషన్ హెడ్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, అధికారులు జయకృష్ణా, సుబ్బారావు, దీపక్, ఏసు, గోవిందరాజు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వమిత్వపై సమీక్షిస్తున్న జేసీ భార్గవ తేజ

స్వమిత్వ రీసర్వేని త్వరితగతిన పూర్తి చేయాలి

● జేసీ భార్గవ తేజ ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ స్వామిత్వ(రీసర్వే) కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు రెవెన్యూ, సర్వే, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్వమిత్వ రీ సర్వే పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. జేసీ భార్గవ తేజ మాట్లాడుతూ, పెద్ద గ్రామాలు, మండల కేంద్రాలలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వే జరగని గ్రామాల సిబ్బందిని ఎంపీడీవోలు ఎక్కువ పీపీఎంలో ఉన్న గ్రామాలకు కేటాయించి అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి బృందానికి రోజుకు కనీసం 50 ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్‌ల గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలన్నారు. అదే రోజు క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్స్ తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం, ఇంజనీరింగ్, డిజిటల్ సహాయకులకు సర్వేయర్ల ద్వారా క్యూజీఐఎస్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, గ్రామ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, అలాగే మండల స్థాయి డిప్యూటీ ఎంపీడీ వోలు, ఎంపీడీవోలు, తహసీల్దారులు, మండల సర్వేయర్లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించండి

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు, గృహ సముదాయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని టీడీపీ శ్రేణులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు తమ పరిసర ప్రాంతాల్లోనిపాఠశాలలు, ఇతర సముదాయాల్లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నారని తెలిపారు. అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ రోడ్ లో జరుగుతున్న సెంట్రల్ డివైడర్ పనులను, రెడ్డిపాలెం, గోరంట్ల, శ్రీనగర్, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను, రోడ్ల, డ్రైన్ల ఆక్రమణలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ల నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తమ క్షేత్ర స్థాయి పర్యటనల్లో నాణ్యతా లోపాలు గుర్తిస్తే సంబందిత ఎమినిటి కార్యదర్శి, ఏఈలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్టీఓ కార్యాలయం దగ్గరలోని అన్న క్యాంటీన్ ని పరిశీలించారు. ఆయన వెంట ఇంచార్జి ఎంహెచ్ఓ రామారావు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

30లోగా నిరక్షరాస్యులు సర్వే పూర్తి కావాలి

గుంటూరు నగరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీలోపు నిరక్షరాస్యుల వివరాల నమోదు సర్వే పూర్తి కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మెప్మా సీఎంఎంలు, సీఓలను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిరక్షరాస్యుల, వీధి వ్యాపారుల సర్వేపై మెప్మా సిబ్బందితో నగర కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఆస్తి పన్ను యజమాని పేరుతో లేకపోతే దరఖాస్తు చేయాలి

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను ఆస్తి యజమాని పేరుతోనే ఉండాలని, ఆవిధంగా లేని వారు ఈ నెలాఖరు లోపు స్థానిక వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి కార్యక్రమంగా సెప్టెంబర్ 1 నుండి నక్షా (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషణ్) ప్రకారం రీ సర్వే జరుగుతుందని, సదరు సర్వే మేరకు ఆస్తి పన్ను కల్గిన వారికి ఓనర్ షిప్ కార్డ్ జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను సంప్రదించాలని తెలిపారు.

వృధాగా తాగునీరు..

గుంటూరుకార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కొరిటెపాడు హై లెవెల్ రిజర్వాయర్ (హెచ్ ఎల్ ఆర్) నుంచి శుక్రవారం ఉదయం పైప్‌లైన్ ద్వారా తాగునీరు వృధాగా పోయింది. అధికారుల బాధ్యతారాహిత్యంతో తాగునీరు మురుగు కాలువ పాలవడం విమర్శలకు తావిచ్చింది.



హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్ నుంచి రోడ్డుపైకి వృధాగా పోతున్న తాగునీరు

అసెస్‌మెంట్ బుక్లెట్స్ తొలగించాలి : ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్లెట్స్‌ను తొలగించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గుంటూరు డీఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిఈఓ సివి రేణుక, ఆర్జెడి లింగేశ్వర రెడ్డికి ఏపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ అస్సెస్మెంట్ బుక్లెట్స్ వల్ల విద్యార్థులు 50 నుంచి 70 గంటల బోధనా పీరియడ్స్ నష్టపోతున్నారని, ఆగస్టు నెలలో సిలబస్ పూర్తి కాకా ఉపాధ్యాయులలో ఆందోళనతో, విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ 1వ తరగతి విద్యార్థికి ఓఎంఆర్ షీట్ పెట్టడం యెందుకు పనికి రాని చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ నాయకులు పి.లక్ష్మీనారాయణ, పి.పార్వతి, మూర్తి,జి.దాస్,బి.సాయి లక్ష్మీ,వెంకటేశ్వరావు,కిషోర్ షా, రాంమోహన్, శివరామకృష్ణ,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంలో మెరుగైన మార్పు రావాలి

● అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరంలో నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల ద్వారా నగరంలో పారిశుధ్యంలో మెరుగైన మార్పు రావాలని, అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నగరంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని సచివాలయాల వారీగా ప్రజా ప్రతినిధులను, స్థానిక ప్రజలను, ఎన్జిఓలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శనివారం నిర్వహించు పారిశుధ్య కార్యక్రమాలలో నీటి కాల్వలు, మురుగు కాలువలు, నీటితో నిండిన ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య, కాలువ శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో దోమల పెరుగుదలను నివారించడానికి ఫాగింగ్ నిర్వహించాలని, అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ టాయిలెట్స్ క్లీనింగ్ చేయాలనీ, వార్డులలో అవసరమైన ప్రాంతాలలో డ్రెయిన్ల పూడికతీత నిర్వహించాలని తెలియచేశారు. నగరంలోని 57 డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు 57 మంది నోడల్ అధికారులకు విధులు కేటాయించామని, వారు కార్యక్రమాలను ఫోటోలతో డాక్యుమెంట్లను తయారుచేసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర యాప్ లో అప్ లోడ్ చేయాలని తెలియచేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు బీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఎస్ఈ సుందరరామి రెడ్డి, ఇంచార్జి ఎంహెచ్ఓ రామారావు, కార్పొరేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఇండియా స్కిల్ పోస్టర్స్ ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు (విద్య) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియా స్కిల్స్ కాంపిటీషన్-2025 పోస్టర్స్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతీ యువకులు ఇండియా స్కిల్స్ కాంపిటీషన్‌లో పాల్గొని తమ నైపుణ్యాల ద్వారా ఉత్తమ శిఖరాలు అధిరోహించడానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న యువత యువకులు సెప్టెంబర్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనే జయలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి , జిల్లా నైపుణ్యం అధికారి కె. సంజీవరావు,జిల్లా ఉపాధి అధికారి దుర్గ భాయి, తదితరులు పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ ఇతర వివరాలు కోసం నైపుణ్యం డాట్ ఏపీ డాట్ జీవోవీ అనే వెబ్సైట్లో చూడాలని సూచించారు.

24న ఎన్‌టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్తంభాలగరువులోని ఎన్‌టీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని విగ్రహ కమిటీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గల్లా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని), ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, కార్పొరేషన్ల ఛైర్మన్లు మన్నవ మోహనకృష్ణ, డేగల ప్రభాకర్, కార్పొరేటర్ మానం పద్మశ్రీ హాజరవుతారని తెలిపారు.

ఆర్వీఆర్ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు (విద్య) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డెల్టా ఎక్స్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాలకృష్ణ శుక్రవారం ప్రకటనలు తెలిపారు. కళాశాల సీఎంఎస్ విభాగం నుండి కే అజయ్ కుమార్, డేటా సైన్స్ విభాగం నుండి ఎన్ తేజ తదితరులు ఏడు లక్షల వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని తెలిపారు .విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ అధ్యాపకులు అభినందించారు.

అనుమతి లేని మందుల అమ్మకాలు బంద్

గుంటూరు సిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆదేశాలతో మూడు టీం లుగా ఏర్పడిన అధికారులు పలు దుకాణాల్లో తనిఖీ లు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణం బజారు లోని విజయసాయి సీడ్స్, పెస్టిసైడ్స్ నందు అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ. 4.83 లక్షలు విలువ చేసే పురుగు మందులను సీజ్ చేసినట్లు ఏడీఏ మోహన్‌రావు తెలిపారు. రాష్ట్రంలో అనుమతి లేని కలుపు మందును విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పలు దుకాణల్లో స్టాక్ రిజిస్టర్లు కూడా పరిశీలించామని తెలిపారు.



ఆటోడ్రైవర్‌కు నెంబర్ అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన సీఐ అశోక్‌కుమార్

నగరంలో ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ నంబర్

● ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో కార్యక్రమం అమలు తీరు పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ నెంబర్ అమలు తీరును ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన పోలీస్ నెంబరింగ్ విధానాన్ని పరిశీలించి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతను పెంపొందించడంతో పాటు అనధికార ఆటో డ్రైవర్లను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీస్ నంబర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా వర్షంలో కూడా ట్రాఫిక్ విధులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఎస్పీ రెయిన్ కోట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఎస్సైలు రవీంద్ర బాబు, శ్రీహరి, సాంబశివరావు నాయక్, నరేంద్ర, మదన్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంటే న్యాయస్థానాల్లో నేరస్తులకు కఠిన శిక్షలు వేయించగలమని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఈస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా పోక్సో కేసులు, గంజాయి, తీవ్ర నేరాలకు సంబంధించిన కేసుల రికార్డులు పరిశీ లించి, ఆ కేసుల దర్యాప్తు పురోగతిని పరీక్షించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, లాలాపేట సీఐ శివ ప్రసాద్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్, ఎస్పీ సీసీ ఆదిశేషు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె లలిత అన్నారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వేతనాల పెంపు, సంక్షేమ పథకాల అమలు, కేంద్రాలకు నాణ్యమైన సరుకులను అందజేయడంతో పాటు ఇతర సమస్యలను స్త్రీ, శిశు సంక్షేమ శిఖ కమీషనర్ వేణుగోపాలరెడ్డి దృష్టికి తీసుకువచ్చామని గుర్తుచేసుకున్నారు. వేతనాల పెంపు త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని మిగిలిన సమస్యలను రెండు నెలల్లో పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో డి రత్నకుమారి, సాబీరా తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి జీవితం నిత్య స్ఫూర్తిదాయకం


● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు మెడికల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వయంకృషితో అత్యున్నత స్థాయికి ఎదిగిన మెగాస్టార్, పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జీవితం నిత్య స్ఫూర్తిదాయకమని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి కొనియాడారు. మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర చిరంజీవి యువత నాయకులు, జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. తొలుత కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, వీర మహిళలు బిట్రగుంట మల్లిక, రామిశెట్టి ధరణి, కోలా పద్మావతి, సరోజినీ, సుంకర రాజ్యలక్ష్మి, చిరంజీవి అభిమానులు బండారు రవీంద్ర, మెహబుబ్ బాషా, సోమి ఉదయ్, ఉల్లి గోపాల్ , చింతకాయల సాయి, రాధాకృష్ణ మూర్తి, కోలా ఆంజనేయులు, షేక్ సుభాని, సయ్యద్ చాంద్, నాజర్ వలి, బాలకృష్ణ, బాలాజీ, మువ్వా వేణు బాబు, గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినీ చరిత్రలో చిరు అధ్యాయం సువర్ణలిఖితం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ చరిత్రలో చిరంజీవి అధ్యాయం సువర్ణలిఖితమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే నసీర్ కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాపు సంఘ నాయకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమ 'పునాదిరాళ్ల'లో ఒకరు చిరంజీవి : డేగల

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): చిత్ర పరిశ్రమ 'పునాదిరాళ్ల'లో చిరంజీవి ఒకరని ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ గుంటూరు నగర కార్యాలయంలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై కేకు కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో యర్రగోపు నాగేశ్వరరావు, చెన్నంశెట్టి చక్రపాణి(రిటైర్డ్ ఎస్పీ), పలువురు నేతలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డేగల ప్రభాకర్ తదితరులు

చిరంజీవి సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో కొణిదల చిరంజీవి జన్మదినం పురస్కరించుకొని స్థానిక నాజ్ సెంటర్లోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి వారి దేవాలయంలో అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా వారం రోజులుగా రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రసన్న ఆంజనేయస్వామి ఆశీస్సులు కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హనుమాన్, శ్రీనివాస్ ఈశ్వర్, అభిమానులు యుగంధర్, రమణమూర్తి, నాగేశ్వరరావు, జైదీప్, రమేష్, తరుణ్, శ్రీకర్ పాల్గొన్నారు.



లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తున్న మేకల రవీంద్రబాబు తదితరులు

ప్రతి మహిళకు 'స్త్రీ శక్తి' ఆశీర్వాదం

● నగరంలో ఎమ్మెల్యే మాధవి విస్తృత పర్యటన



బస్సులో మహిళా ప్రయాణికులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఆశీర్వాదమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం అమలు స్థితిని తెలుసుకోవడానికి శుక్రవారం ఆమె మార్కెట్ సెంటర్లోని పల్నాడు బస్ స్టాండ్‌ను సందర్శించారు. మహిళా ప్రయాణికులతో ఎమ్మెల్యే ముచ్చటించారు. నర్సరావుపేటకు వెళ్ళే పల్లె వెలుగు బస్సులో ప్రయాణికులతో కలిసి ప్రయాణించి, వారి అనుభవాలను తెలుసుకున్నారు.

● పీ.వీ.కే నాయుడు మార్కెట్లో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వర్తకుల సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వలన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని ఈఈ, ఎస్.ఈలను ఆదేశించారు.

● పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలోనే కాకుండా సామాజికసేవలో కూడా అగ్రగామిగా నిలిచారని తెలిపారు.

● నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ సౌకర్యాల విస్తరణే తన ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం

● విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి



చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కమ్మరి పార్వతి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయమని విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి అన్నారు. బీసీ భవన్ లో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్వతి మాట్లాడుతూ చేతి వృత్తుల మీద ఆధారపడుతున్న విశ్వబ్రాహ్మణులకు ఉపాధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాల వారీగా పర్యటించి సమస్యలను తెలుసుకుంటానన్నారు. వారికి అవసరమైన పనిముట్లుతో పాటు ఇతర ఆర్థిక తోడ్పాటునందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కీలకమైన బాధ్యతలు అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఆమె తెలిపారు.

దేవుడిపై విశ్వాసం లేని వ్యక్తి జగన్ : పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డికి ఏ దేవుడు మీద విశ్వాసం లేదని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ క్రీస్తుని నమ్ముకుని ఉంటే పదవి కోసం జంధ్యం వేసుకొని గంగానదిలో మునిగేవాడు కాదని, హిందువు అయితే భార్యని తీసుకొని ఏ గుడికైనా వెళ్ళేవాడేనని విమర్శలు చేశారు. తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు అంటే గౌరవం లేదని, అధికారం కోసం తండ్రి, బాబాయ్ మరణాలకు కారణమయ్యాడని ఆరోపించారు. ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని నడిబజారులో నిలబెట్టాడన్నారు. జగన్‌కు ప్రజలంటే విలువ లేదన్నారు. నమ్మి 151 సీట్లు ఇచ్చి అధికారాన్ని కట్టబెడితే ఆ ప్రజల్ని హిట్లర్ కంటే ఘోరంగా హింసించాడన్నారు. రాష్ట్రం అంటే ప్రేమ లేదని, రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ఛీత్కారానికి గురైన జగన్ ప్రజలపై కోపంతో రాష్ట్రాన్ని అభాసుపాలు చేయాలని చూస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు గానీ, ఆయన రక్త సంబంధీకులు గానీ జగన్‌ను ఎప్పటికీ క్షమించరన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలి

● దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరింత సమర్థవంతంగా అమలు చేయాలని దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ కోరారు. బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన అరండల్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ భవన్‌లో జిల్లా బడ్జెట్ వాచ్ సమావేశం శుక్రవారం జరిగింది. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అత్యాచారాలు రోజూ జరుగుతూనే ఉండటం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొడ్డు కోటేశ్వరరావు, చంద్రా నాయక్, సంకూరి రాజారావు, గనుపల్లి తిరుపతిరావు, హేమలత, నిర్మల, రవితేజ, రజనీ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు



కోటి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస ముగింపు సందర్భంగా చివరి శుక్రవారాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో వేద పండితులు గోపూజ, గణపతి పూజ, శ్రీ చక్ర మహామేరుకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అరండల్‌పేట, సంపత్‌నగర్, ఆర్ అగ్రహారం, బ్రాడీపేట, పాతగుంటూరు, గోరంట్ల, ఇతర ప్రాంతాల్లో కొలువైన అమ్మ వారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. అరండల్‌పేట, అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారిని కలువ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి లక్షగాజులతో అభిషేకం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిపాటి ప్రసాద్‌శర్మ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టాభిపురం, లక్ష్మీపురం, రామన్నపేట ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, అలానే విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా నిలిపివే యనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామిరెడ్డితోట ప్రకాష్ నగర్ మూడో లైన్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలయ పూజారి శోభనాద్రిచార్యులు (22) మృతి చెందాడు. నెహ్రూనగర్ గేటు నుంచి మణిపురం బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనకనుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం స్కిడ్ అయ్యి వాహనంపై వెళ్తున్న వ్యక్తి ట్రాక్టర్ కింద పడ్డాడు. ఆ వ్యక్తిపై ట్రాక్టర్ టైర్లు ఎక్కి పోవడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. చినకాకానికి చెందిన శోభనాద్రిచార్యులు స్థానికంగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో పూజారిగా పని చేస్తున్నాడు.

బాలికపై అత్యాచారయత్నం

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకాని రోడ్డుకి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్ఫూర్తి పొందిన ఆచరణకు..అంతర్జాతీయ ఖ్యాతి!

- రాష్ట్ర సచివాలయాన్ని తలపించేలా..హంగులు
- తెనాలి తహసీల్దారు కార్యాలయం ఆధునికీకరణ
- హెల్ప్ డెస్క్, వెయిటింగ్ హాల్..పచ్చదనంతో ఆహ్లాదం
- సేవలు, పనులను పరిశీలించిన ఐఎస్ఓ బృందం



నూతన నేమ్ బోర్డుతో తహసీల్దారు కార్యాలయం ముఖద్వారం

తెనాలి, తెనాలి అర్బన్, ఆగస్టు 22,(ఆంధ్రజ్యోతి): ఎప్పుడో 143 ఏళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో నిర్మించిన భవనం. వలస పాలకుల ప్రభుత్వంలో ప్రధాన అధికారిక కార్యాలయం. 1882లో కొండరాళ్లతో కట్టిన గోడలు, పెంకులతో పైకప్పు.. చిన్నపాటి మరమ్మతులు మినహా ఇప్పటి వరకు ఆ భవనానికి పెద్దగా మార్పులు చేసింది లేదు. తెనాలి తాలూకా పేరుతో ఉన్న ఏక భవనంలోనిదే ఈ తహసీల్దార్ కార్యాలయం. ఆవరణంతా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, మద్యం సీసాలతో నిండిపోయింది. రక్షణ లేక అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. ఇదంతా.. నాలుగు నెలల క్రితం. కానీ, ఇప్పుడు అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన హంగులను సంతరించుకుని.. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండార్డ్స్(ఐఎస్ఓ) సర్టిఫికెట్ పొందేందుకు సిద్ధమైంది. ఇదంతా సాధ్యమైంది.. ఇక్కడికొచ్చిన ఒక తహసీల్దారు చొరవ, ఒక దాత స్పందన కారణం.

ముఖ్యమంత్రి మాటే స్ఫూర్తిగా..

గతంలో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు సేవలు సకాలంలో అందించాలనే సూచనలను తెనాలికి తహసీల్దార్ గోపాలకృష్ణ స్ఫూర్తి పొందారు. ఈయన తెనాలి మండలానికి రాక ముందు బాపట్ల, చేబ్రోలు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో పనిచేశారు. అక్కడి కార్యాలయాల సుందరీకరణ, ఆవరణలో పరిశుభ్రత చేపట్టారు. అలాగే అత్యంత విలువైన రికార్డులను భద్రపరిచే పనులు చేపట్టారు. దీనిని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారు. సంవత్సరం క్రితం తెనాలికి బదిలీపై తహసీల్దార్‌గా వచ్చిన తర్వాత కార్యాలయ ఆవరణ చెత్తతో నిండిపోవటం, కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరటంతో వాటిని బాగు చేసే పనికి ఆయన శ్రీకారం చుట్టారు.

స్పందించిన దాత

ఇక్కడ రెవెన్యూ, విశ్రాంత ఉద్యోగుల భవనం పడిపోయి, చెత్త కుప్పలా మారటంతో దానిని పూర్తిగా తొలగించి, మొత్తం శుభ్రపరిచారు. దీనిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. దానికి ఆకర్షితుడైన తెనాలికే చెందిన సూర్యదేవర భువన్‌కుమార్ స్పందించారు. కొత్త భవనం నిర్మించేందుకు సహకారం అందిస్తానని ముందుకొచ్చారు. ఆయనే దగ్గరుండి ఆధునికీకరణ పనులను చేయిస్తున్నారు. తాను ప్రచారం పొందడానికి ఇదంతా చేయడం లేదని, తహసీల్దార్ పనితీరునచ్చి.. ఆయన ఆలోచనలకు అనుగుణంగా కార్యాలయ అవరణను తీర్చిదిద్దటానికి ముందుకు వచ్చానని స్పష్టం చేశారు. కొత్త బోర్‌వేసి తాగునీటి సదుపాయం కల్పించామన్నారు. భవనం పైకప్పు పెంకులతో సరిచేయాల్సి ఉందని, దీనికి భారీ ఖర్చుతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి పనివారిని తీసుకొచ్చి చేయించాల్సి ఉందన్నారు.

ఆధునిక హంగులు..

రేకులతో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌ను కార్యాలయానికి వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు.. గదిగా మార్చారు. వసతుల ఏర్పాటుతో పాటు.. తల్లులు పిల్లలకు పాలివ్వడానికి ప్రత్యేక ఫీడింగ్ రూమ్‌ను తీర్చిదిద్దారు. కార్యాలయానికి ప్రహరీ నిర్మించారు. పెద్ద ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి, కార్యాలయానికి ఎదురున్న ఖాళీ స్థలంలో గార్డెన్ తీర్చిదిద్దారు. దాని మధ్యలో నాలుగు సింహాల విగ్రహం, చుట్టూ వాటర్ ఫౌంటేన్, గోడలపై అందంగా మొక్కల ఏర్పాటు చేశారు. జెండా వందనానికి వీలుగా.. స్టీల్ పైపుతో దిమ్మెనూ ఏర్పాటు చేశారు. ప్రాంగణం మొత్తం పాలిష్ రాళ్లతో ఫ్లోర్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక పార్కింగ్, ఆధునిక టాయిలెట్స్ కల్పించారు. ఆవరణలో వర్షపాతం కొలిచే యూనిట్ సుందరంగా తీర్చిదిద్దారు. ఐటీ ఉద్యోగులు ఇక్కడికి వస్తే.. ల్యాప్‌టాప్ పెట్టుకుని వర్క్ కూడా చేసుకునే విధంగా సౌకర్యం కల్పించారు. కార్యాలయం ముఖద్వారంలో భారీగా నేమ్ బోర్డును ఏర్పాటు చేశారు. గ్రానైట్ పలకలపై స్టీల్ అక్షరాలతో తీర్చిదిద్దటం ఆకర్షణగా నిలిచింది. దీంతో స్థానికులు ఇక్కడికి వచ్చి సెల్ఫీలు దిగుతున్నారు.

ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు సంసిద్ధత

తాలూకా సముదాయం మొత్తం 3.87 ఎకరాలు. కాలక్రమంలో మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి వచ్చాయి. ఇప్పుడు ఆధునిక హంగులను అద్దుకున్న తహసీల్దారు కార్యాలయాన్ని తాజాగా 15 మందితో కూడిన ఐఎస్ఓ బృందం సందర్శించింది. పరిసరాలను, ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను, సేవలను, సిటిజన్ చార్ట్ అమలు తీరును పరిశీలించింది. కార్యాలయానికి వచ్చిన ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఐఎస్ఓ ప్రమాణాలకు తగ్గట్టుగా కార్యాలయం ఉండటంతో.. చిన్నపాటి మార్పులు, సదుపాయాల వంటివి సమకూర్చే విషయంలో సూచనలు చేసి వెళ్లారు. అవన్నీ సరిచేయించడంతో.. శుక్రవారం పరిశీలించిన ఐఎస్ఓ ప్రతినిధులు త్వరలో సర్టిఫికెట్ ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వెల్లడించారు.

చివరి దశలో ప్రక్రియ

నాణ్యత, భద్రత, ఇతర సేవా పరమైన అంశాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ఒక నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించడమే కాకుండా.. వాటి ప్రమాణాల తీరును ఐఎస్ఓ నిర్ధారిస్తుంది. ఇతర రంగాల్లో సేవల తీరును కూడా. దీని కోసం అంతర్జాతీయంగా నిపుణుల బృందం ఎప్పటికప్పుడు ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తారు. ఒక ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో అందించాల్సిన సేవలు, వసతుల కల్పనలోనూ ఐఎస్ఓ విధివిధానాలు రూపొందిస్తుంది. అటువంటి అంతర్జాతీయ ప్రమాణాలుంటే.. ఆ సంస్థలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. దీనికోసం ప్రజాభిప్రాయ సేకరణ, ముసాయిదా ప్రకటన వంటివి ఉంటాయి. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం విషయంలో ఆ ప్రక్రియ చివరి దశలో ఉంది.

సీఎం మాటలే ఆదర్శంగా: గోపాలకృష్ణ, తహసీల్దారు

మన ఇంటినే కాకుండా మనం పనిచేసే కార్యాలయాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని గతంలో ముఖ్యంత్రి చంద్రబాబు చెప్పిన మాటలు నాలో స్ఫూర్తి నింపాయి. తెనాలి వచ్చాక రాష్ట్ర మంత్రి మనోహర్ ప్రోత్సాహం నాలో ఉత్సాహం నింపింది. సిబ్బంది సహకారం, దాతల తోడ్పాటు ఉండటంతో ఇదంతా చేయగలిగాం. మా శ్రమకు తగ్గట్టుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ కూడా దక్కనుండటం మరింత సంతోషాన్ని కలిగించింది. వ్యవస్థ శాశ్వతం అన్నదే నా ఆలోచన.



ప్రాంగణంలో పచ్చదనంతో సుందరీకరణ



పాలిష్ రాళ్లతో ఫ్లోరింగ్



జనం వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన గది



కొత్తగా నిర్మించిన భవనం లోపలి భాగం



ఆవరణలో నాలుగు సింహాల విగ్రహం

అర్బన్ హెల్త్ సెంటర్లకు నిధులు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గుంటూరు నగరంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీకి, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని మానుకొండవారిపాలెం, మాచర్లలోని జెండా చెట్టు పాత పట్టణం యూపీహెచ్‌సీకి రూ. కోటి వంతున నిధులు మంజూరు చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

9న భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు సెప్టెంబరు 9న బాబా బైద్యనాథ్ ధామ్‌తో అయోధ్య - కాశీ పుణ్యక్షేత్ర యాత్ర కోసం బయలు దేరుతుందని ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరీ జగన్నాథస్వామి, కోణార్క్ సూర్య భగవానుడు, దేవగఢ్‌లోని బాబా బైద్యనాథ్, వారణాసిలో కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి, అన్నపూర్ణదేవి ఆలయాలతో పాటు గంగా హారతి, అయోధ్యలో రామజన్మభూమి, హనుమాన్ గర్హి, ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం సందర్శన ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 9701360701 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

సంతృప్తికర పరిహారానికి కృషి

- 167ఏ జాతీయ రహదారికి భూములిచ్చిన రైతులతో సమావేశం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం 167ఏ జాతీయ రహదారి నరసరావుపవేట బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులతో కలెక్టర్ పి. అరుణ్‌బాబు సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణం విషయంలో సానుకూలంగా ఉంటూ భూములు ఇచ్చిన రైతులకు చట్ట పరిధిలో సంతృప్తకరమైన పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

ఇచ్చారు.. తీసేశారు

- శావల్యాపురం - రొంపిచర్ల మార్గంలో నెలాఖరు వరకే రైలు సర్వీసులు
- వచ్చే నెల నుంచి నాందేడ్-ధర్మవరం-నాందేడ్ రైళ్ల మళ్లింపు
- రైల్వే మంత్రికి నివేదించాలని ఎంపీకి ట్విట్టర్‌లో ప్రయాణికుల పోస్టులు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గంలో భాగంగా ఇప్పటి వరకు పూర్తి అయిన పిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్‌లో ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలు సర్వీసుని రైల్వే శాఖ ఎలాంటి ప్రకటన లేకుండానే ఈ నెలాఖరుతో నిలిపివేయనుంది. ఈ నూతన రైలు మార్గంలో నాందేడ్ - ధర్మవరం - నాందేడ్ ప్రత్యేక రైలు సర్వీసులను రైల్వే శాఖ తీసుకొచ్చింది. అయితే ఏ కారణం చేతనో సెప్టెంబరు మొదటి వారం నుంచి ఈ రెండు రైళ్లను కరీంనగర్ మార్గంలో మళ్లించింది. ఇప్పటికే 07189 నాందేడ్ - ధర్మవరం(ప్రతీ శుక్రవారం), 07190 ధర్మవరం - నాందేడ్(ప్రతి ఆదివారం) రైళ్లను కరీంనగర్, వరంగల్, విజయవాడ, తిరుపతి మార్గంలో మళ్లించి టైం టేబుల్‌ని అప్‌డేట్ చేసింది. దీంతో రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ తదితర ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

ఎంపీకి సామాజిక మాధ్యమంలో వినతి

పల్నాడు ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైలు మార్గంలో రైల్వే శాఖ రైలు సర్వీసుని ఇచ్చినట్లే ఇచ్చి నిలిపేయడంపై ప్రయాణికులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ మార్గంలో ప్రవేశపెట్టిన రైళ్లు అర్ధరాత్రి దాటిన తర్వాత వస్తున్నా.. తాము ఆదరిస్తున్నామని, అయినా ప్రత్యేక రైలు సర్వీసులు నిలిపేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రయాణికులు ఎక్స్ సామాజిక మాధ్యమం ద్వారా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు తమ ఆవేదనని వెలిబుచ్చారు. తక్షణమే రైల్వేబోర్డు ఛైర్మన్, రైల్వే మంత్రితో మాట్లాడి నాందేడ్ - ధర్మవరం - నాందేడ్ రైళ్లను సెప్టెంబరు నుంచి శావల్యాపురం, రొంపిచర్ల మీదగా పునరుద్ధరించాలని కోరారు. వేరే రూట్లలో కొన్ని రైళ్లకు ఎలాంటి ఆదరణ లేకపోయినా నడుపుతున్న రైల్వే శాఖ ఈ నూతన రైలు మార్గంలో రైలు సర్వీసుని ఆపేయడం సమంజసం కాదంటున్నారు.

- కాగా వినుకొండ - నడికుడి మధ్యన ఒక షటిల్ సర్వీసుని కూడా ప్రవేశపెట్టాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. దీని వల్ల వినుకొండ, శావల్యాపురం, రొంపిచర్ల, పిడుగురాళ్ల, నడికుడి మధ్యన ప్రయాణికులకు మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

- అలానే కాచీగూడ - మిర్యాలగూడ మెమూ రైలుని వినుకొండ వరకు పొడిగిస్తే హైదరాబాద్‌కు రైలు సదుపాయం కూడా తమకు అందుబాటులోకి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉన్న 142 కిలోమీటర్ల సెక్షన్ సికింద్రాబాద్‌లోకి వెళ్లిపోతుంది. అప్పుడు ప్యాసింజర్ రెవెన్యూ పూర్తిగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వినుకొండ - శావల్యాపురం - రొంపిచర్ల - న్యూపిడుగురాళ్ల సెక్షన్‌లో ఎక్కువ రైలు సర్వీసులు ప్రవేశపెట్టుకోగలిగితే కొంతలో కొంతైనా రికవరీ జరుగుతుందన్న సూచిస్తున్నారు.

ప్రతి విద్యార్థికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు

- రెండవసారి దరఖాస్తు లేకుండా ఆధార్‌తో జారీ
- ఉమ్మడి జిల్లాలో సర్టిఫికెట్లు జారీచేస్తున్న రెవెన్యూ అధికారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు.. విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా కూటమి ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువులు పూర్తయ్యేంత వరకు ఏటా తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటారు. వాటి కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతుంటారు. ఇక విద్యార్థులకు అలా తిరగాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ఆధారంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 18 లక్షల మందికి పైగా విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. ఇప్పుడు ఇస్తున్న సర్టిఫికెట్లు పొరపాటున కనిపించకుండా పోతే.. ఆ విద్యార్థి ఆధార్ నంబరు సమీప సచివాలయంలో ఎంటర్ చేస్తే మళ్లీ సర్టిఫికెట్‌ను నిమిషాల వ్యవధిలో తీసుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రతి ఏడాది ఎంసెట్, బీటెక్, డిగ్రీ కళాశాలలో చేరేందుకు ప్రతి విద్యార్థికి పలు రకాల సర్టిఫికెట్లు తప్పనిసరిగా కావాల్సి ఉంది. నిర్దిష్ట గడువులోగా వాటిని ఆయా కళాశాలలో అందజేయాల్సిన విద్యార్థులు కొందరు చివరి నిమిషం వరకు ఏఏ సర్టిఫికెట్లు ఇవ్వాలో తెలుసుకోలేకపోతున్నారు. తీరా తెలుసుకున్న తర్వాత దరఖాస్తు చేయడం, వాటిని తీసుకొని కళాశాలలో అందజేయడం పెద్ద ప్రహసనంగా మారుతోంది. ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి విద్యార్థికి పర్మినెంట్ కుల, ఆదాయ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం జారీ చేస్తుంది. దీంతో ప్రతి విద్యార్థి ప్రతి సంవత్సరం దరఖాస్తు చేసుకునే వెతలు తప్పుతాయి. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 5.28 లక్షలు, గుంటూరు జిల్లాలో 8.11 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.50లక్షలకు పైగా విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లను రెవెన్యూ అధికారులు అందజేయనున్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలి

- కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఇన్‌చార్జి మనోజ్‌పూరి గోస్వామి

ప్రత్తిపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్ర ఇన్‌చార్జి మనోజ్ పూరి గోస్వామి తెలిపారు. మండల పరిధిలోని గొట్టిపాడులో ప్రత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, అపరాల పంటలలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రెండు రోజుల పాటు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాలను ఆయన సందర్శించారు. విత్తు నుంచి రైతులు తీసకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్తి పంట 45 రోజుల సమయంలో రసం పీల్చు పురుగు, పచ్చదోమ, తామర పురుగు, పేనుబంకలను గమనించడం జరుగిందని, దీని నివారణకు వేప నూనెను ఒక లీటరు నీటికి మూడు మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రత్తి పొలాల్లో జిగురు, పసుపు, నీలం అట్టలు ఎకరాకు పది నుంచి పదిహేను ఏర్పాటు చేసుకోవడం వల్ల రసం పీల్చు పురుగులను అదుపు చేయవచ్చునన్నారు. ప్రస్తుత దశలో ఎకరాకు ఎనిమిది చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా అలాగే డ్రోన్‌లను ఉపయోగించే విధానం, ప్రత్తి పంటలో డ్రోన్ ద్వారా పిచికారి చేసే విధానం గురించి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కే వీరయ్య చౌదరి, సమగ్ర సస్యరక్షణ అధికారి డాక్టర్ టీ ప్రేమ రంజితం, ఏడీఏ మోహనరావు,ఏవో సుగుణ బేగం పాల్గొన్నారు.



డ్రోన్ వాడకంపై రైతులకు వివరిస్తున్న కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం బృందం

బర్లీ పొగాకు సాగు కట్టడికి టాస్క్‌ఫోర్సులు

- జిల్లా, డివిజనల్, మండల స్థాయి బృందాలతో పర్యవేక్షణ

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హెడ్ బీఆర్‌జీ/బర్లీ/బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేసి ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోవడంతో ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే ఆయా రకాల పొగాకుని రైతులు సాగు చేయకుండా కట్టడి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం టాస్కు ఫోర్సు బృందాలను ఏర్పాటు చేసింది. తరచుగా పర్యటనలు చేసి నివేదికలు తెప్పించుకొని పైన పేర్కొన్న మూడు కేటిగిరీల పొగాకుని రైతులు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇందుకోసం జిల్లా, డివిజనల్, మండల స్థాయి టీమ్‌లు ఏర్పాటు చేసింది. త్వరలోనే జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి టాస్కు ఫోర్సులకు సంబంధించి విధి విధానాలపై చర్చిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, ఎస్పీ, డీఎంహెచ్‌వో, న్యాయ అధికారి సభ్యులుగా, కన్వీనర్‌గా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని టాస్కుఫోర్సు బృందంలో ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మండలాల నుంచి ప్రతి వారం నివేదికలు తెప్పించుకొంటుంది. అలానే గ్రామాల్లో పర్యటించి క్రాస్ చెక్ చేస్తుంది. నర్సరీ ఉత్పత్తిదారులు, స్థానిక ట్రేడర్లు, దళారులు, కంపెనీల ప్రతినిధులు, టుబాకో గోడౌన్లు, ప్రాసెసింగ్ యూనిట్లలో ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కరిస్తుంది. లక్ష్యం నిర్దేశించుకొన్న మండలాలు, క్లస్టర్లలో పొగాకు సాగు చేపట్టకుండా చర్యలు తీసుకొంటుంది. డివిజనల్ టాస్కు ఫోర్సుకి ఛైర్మన్‌గా ఆర్డీఓ, సభ్యులుగా డీఎస్పీ, డివిజనల్ వైద్య అధికారి, ప్రోగ్రసివ్ రైతు సభ్యులుగా ఉంటారు. కన్వీనర్‌గా ఏడీఏ(ఆర్) వ్యవహరిస్తారు. మండల స్థాయిలో బృందానికి తహసీల్దార్ ఛైర్మన్‌గా, ఎస్ఐ, మెడికల్ అధికారి, ప్రోగ్రసివ్ రైతు సభ్యులుగా, ఎంఏవో కన్వీనర్‌గా ఉంటారు. నర్సరీలలో పొగాకు మొక్కలు పెంచకుండా నోటీసులు జారీ చేస్తారు. కొనుగోలు చేస్తామన్న ఒప్పందాలను రద్దు చేయిస్తారు. రైతులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పొగాకు సాగు చేపట్టకుండా చూస్తారు.

గతేడాది గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో బర్లీ పొగాకుని రైతులు విపరీతంగా సాగు చేశారు. పంట సాగు చేయడానికి ముందు తాము బర్లీ పొగాకుని కొనుగోలు చేస్తామని చెప్పిన ఎగుమతి కంపెనీలు తీరా పంట వచ్చాక విదేశాల నుంచి డిమాండ్ లేదని ముఖం చాటేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రైతులను ఆదుకునేందుకు రంగంలోకి దిగింది. దాదాపుగా రూ. 300 కోట్లు విడుదల చేసి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకుని కొనుగోలు చేయిస్తోంది. బాపట్ల జిల్లాలో 66,814, గుంటూరులో 14,094, పల్నాడులో 7,875 ఎకరాల్లో గతేడాది రైతులు బర్లీ పొగాకు సాగు చేశారు. దాదాపుగా 102.48 మిలియన్ కేజీల పొగాకుని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అయినప్పటికీ క్వింటాల్ రూ. 12 వేలుగా ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేపట్టింది.

కొనసాగుతున్న వరద ఉధృతి

విజయపురిసౌత్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం శ్రీశైలం నుంచి 4,31,678 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 583.50 అడుగులు ఉంది. ఇది 293.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019, ఎడమ కాలువ ద్వారా 6401, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,155, 26 క్రస్ట్‌గేట్లను ఎత్తి 3,54,718 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 4,04,993 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 32.58 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,96,223 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, 13 గేట్ల ద్వారా 3,90,778, మొత్తం 4,07,778 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

పులిచింతలకు 4,36,601 క్యూసెక్కులు..

రెంటచింతల,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 4,36,601 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ నాగరాజు,సుబ్రహ్మణ్యం తెలిపారు. చెప్పారు. డ్యాం 20 గేట్లకు గాను 13 గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను 5 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 4,04051 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 74.31 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.284 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు తెలిపారు.



సాగర్ 26 కస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి భారీగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి శుక్రవారం రాత్రి వరకు 4,33,393 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. రిజర్వాయర్‌లో 12.5 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,16, 622 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 9,750, పశ్చిమ డెల్టాకు 7, 26 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నిలకడగా కృష్ణానదిలో వరద ప్రవాహం



పెనుమూడి వద్ద వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ పుష్కర ఘాట్



కొల్లూరు కరకట్ట దిగువున వరద నీటిలో మునిగిన రేకుల షెడ్డు

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి కొంత మేరకు వరద ఉధృతి తగ్గినప్పటికీ అమావాస్య పోటు కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అడుగుకు మించి వరద నీటి ప్రవాహం తగ్గలేదు. శుక్రవారం ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం కంటే సుమారు లక్ష క్యూసెక్కులు తక్కువ దిగువకు విడుదల కావడంతో 3 అడుగులు మేర కృష్ణా నదిలో నీటి తగ్గాల్సి ఉంది. కానీ, అమావాస్య పోటు కారణంగా కేవలం ఒక్క అడుగు మాత్రమే తగ్గడంతో లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన వాణిజ్య పంటల్లో వరద నీరు నిలిచిపోయింది. పైగా లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీరు వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వెనక్కి వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో ముంపునకు గురైన పంటలు కుళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి ఆవులవారిపాలెం, పెసర్లంకకు వెళ్లే రహదారులకు ఇరువైపులా వరద నీరు చేరడంతో సముద్రాన్ని తలపిస్తున్నాయి. అక్కడక్కడ లోతట్టు ప్రాంతాల్లో ఇటుక పరిశ్రమదారులు నిల్వ ఉంచిన ముడిసరుకు సైతం వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో నష్టపోయామని నిర్వాహకులు వాపోతున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లోలెవల్ చప్టాలపై వరద ఉధృతి కొనసాగుతోంది. రెండు చోట్ల పోలీసు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వరద ప్రవాహం తగ్గుముఖం

రేపల్లె, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టటంతో తీరప్రాంత వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా వరద పోటెత్తడంతో కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. భట్టిప్రోలు మండలం పెసర్లకకు వెళ్లే చిన్నరేవు, ఓలేరు చిన్నరేవుల్లో వరద నీరు రెండు అడుగుల మేర తగ్గింది. అరటి, కంద, పసుపు, కూరగాయపంటలు పొలాల్లో నీరు నిలిచే ఉంది. ఇదే విధంగా నీరు బయటకు పోకుంటే మొక్క కిందబాగం నానిపోయి పనికిరాకుండా పోతుందని రైతులు చెబుతున్నారు.



వంటిల్లు

ఆ కాకరకాయ రుచే వేరు...

వర్షాకాలంలో విరివిగా దొరికే ఆకాకరకాయలను ఇష్టపడనివారు ఉండరు. వీటినే కొన్నిప్రాంతాల్లో బోడ కాకరకాయలు, బొంత కాకరకాయలని కూడా పిలుస్తుంటారు. వీటితో వేపుడు, ఇగురు ఎక్కువగా చేస్తూ ఉంటారు. ఇవికాక ఆకాకరకాయలతో తయారుచేసే విభిన్న వంటకాలు మీకోసం...

ఆకాకరకాయ చికెన్

కావాల్సిన పదార్థాలు

ఆకాకరకాయలు- పావు కేజీ, చికెన్- అర కేజీ, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- అర చెంచా, గసగసాలు- ఒక చెంచా, లవంగాలు- అయిదు, యాలకులు- రెండు, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, అల్లం- ఒక పెద్ద ముక్క, వెల్లుల్లి రెబ్బలు- పది, నూనె- అయిదు చెంచాలు, పచ్చిమిర్చి- అయిదు, ఉల్లిపాయలు- మూడు, టమాటాలు- రెండు, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ఉప్పు- రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా



తయారీ విధానం

- ఆకాకరకాయలను శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి. ఉల్లిపాయలు, టమాటాలను కూడా చిన్న ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. చికెన్ ముక్కలను ఉప్పునీళ్లతో బాగా కడగాలి. మిక్సీలో ధనియాలు, జీలకర్ర, గసగసాలు, లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఆ పొడిని పళ్లెంలోకి తీయాలి. తరవాత మిక్సీలో అల్లం, వెల్లుల్లి రెబ్బలను కూడా వేసి పేస్టులా చేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత మధ్యకు చీల్చిన పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, పసుపు వేసి కొద్దిగా వేగనివ్వాలి. తరవాత టమాటా ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. అయిదు నిమిషాల తరవాత మూత తీసి చికెన్ ముక్కలు, వేసి కలిపి రెండు నిమిషాలు వేగనివ్వాలి. చికెన్ ముక్కలు కొద్దిగా మెత్తబడిన వెంటనే ఆకాకరకాయ ముక్కలు, కారం, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉప్పు, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాలాల పొడి వేసి బాగా కలపాలి. అందులో అర కప్పు నీళ్లు పోసి మూతపెట్టి పావుగంటసేపు మగ్గించాలి. తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న ఆకాకరకాయ చికెన్ కూర... వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

- **ఆకాకరకాయ, చికెన్ ముక్కలను మరీ మెత్తగా ఉడికించకూడదు.**
- **గ్రేవీ చిక్కగా కమ్మగా రావాలనుకుంటే కొద్దిగా జీడిపప్పు పేస్టు కలుపుకోవచ్చు**

ఆకాకరకాయ బిరియాని

కావాల్సిన పదార్థాలు

లేత ఆకాకరకాయలు- పావు కేజీ, బాస్మతి బియ్యం- రెండు కప్పులు, బిరియాని ఆకులు- రెండు, సాజీరా- ఒక చెంచా, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, లవంగాలు- అయిదు, యాలకులు- నాలుగు, అనాస పువ్వు- ఒకటి, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, ఎండు మిర్చి- అయిదు, మిరియాలు- పావు చెంచా, ఎండు కొబ్బరి ముక్కలు- రెండు చెంచాలు, కసూరి మేతి- ఒక చెంచా, పెరుగు- పావు కప్పు, చింత పండు గుజ్జు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, గరం మసాల పొడి- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒకటిన్నర చెంచాలు, పచ్చిమిర్చి- రెండు, పసుపు- అరచెంచా, బ్రౌన్ ఆనియన్స్- కొద్దిగా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పుదీనా- కొద్దిగా, నూనె- అయిదు చెంచాలు, నెయ్యి- నాలుగు చెంచాలు, కుంకుమ పువ్వు- కొద్దిగా, పాలు- అర కప్పు

తయారీ విధానం

- బాస్మతి బియ్యాన్ని కడిగి నిండా నీళ్లు పోసి అరగంట నానబెట్టాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో ధనియాలు, జీలకర్ర, ఎండు మిర్చి, మిరియాలు, ఎండు కొబ్బరి ముక్కలు వేసి దోరగా వేపి చల్లార్చాలి. వీటితోపాటు కసూరి మేతిని కూడా మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
- ఆకాకరకాయలను శుభ్రంగా కడిగి వాటిని గుత్తుల్లా కోయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో ఆకాకరకాయలు వేసి చిన్న మంట మీద అయిదు నిమిషాలు దోరగా వేపి పళ్లెంలోకి తీయాలి.
- వెడల్పాటి గిన్నెలో పెరుగు, చింత పండు గుజ్జు, ఉప్పు, కారం, గరం మసాల పొడి, ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, పచ్చి మిర్చి వేసి బాగా కలపాలి. తరవాత వేయించి పెట్టుకున్న ఆకాకరకాయలు, బ్రౌన్ ఆనియన్స్, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు వేసి జాగ్రత్తగా కలపాలి.
- స్టవ్ మీద పెద్ద గిన్నె పెట్టి సగానికిపైగా నీళ్లు పోసి చెంచా ఉప్పు, బిరియాని ఆకులు, సాజీరా, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, అనాసపువ్వు, చెంచా నూనె వేసి కలపాలి. నీళ్లు మరిగాక ముందు గా నానబెట్టిన బాస్మతి బియ్యం వేసి పలుకుల్లా ఉడికించాలి. తరవాత నీళ్లు వడగట్టాలి.
- స్టవ్ మీద అడుగు మందంగా ఉండే పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడి చేయాలి. ఇందులో ఆకాకరకాయల మిశ్రమం పరచాలి. కొన్ని నీళ్ల చుక్కలు చల్లాలి. దీనిమీద ముందుగా ఉడికించుకున్న బాస్మతి బియ్యం వేసి పైన బ్రౌన్ ఆనియన్స్, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు, కుంకుమ పువ్వు కలిపిన పాలు, రెండు చెంచాల నెయ్యి వేయాలి. మూత పెట్టి చిన్న మంట మీద పావుగంటసేపు మగ్గించాలి. ఇలా తయారు చేసుకున్న ఆకాకరకాయ బిరియానీని వేడిగా సర్వ్ చేసుకోవాలి. ఏదైనా గ్రేవీ కర్రీ లేదా రైతాతో తింటే రుచిగా ఉంటుంది.



చిట్కాలు

- **ఆకాకరకాయలు పెద్దగా ఉంటే వాటిని ముక్కలుగా కోసి లోపలి గింజలు తీసి వేయాలి.**
- **బిరియాని మగ్గుతున్నప్పుడు కొన్ని కొబ్బరిపాలు చిలకరిస్తే రుచి మరింత పెరుగుతుంది.**

ఆకాకరకాయ ఊరగాయ



కావాల్సిన పదార్థాలు

ఆకాకరకాయలు- పావు కేజీ, కారం- ముప్పావు కప్పు, ఉప్పు- పావు కప్పు, ఆవపిండి- పావు కప్పు, మెంతిపిండి- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- పది, నువ్వుల నూనె- ఒకటిన్నర కప్పులు, నిమ్మరసం- పావు కప్పు

తయారీ విధానం

- ఆకాకరకాయలను నీళ్లతో శుభ్రంగా కడిగి తడిలేకుండా పొడి గుడ్డతో తుడవాలి. వీటిని ఒక రోజంతా ఆరనివ్వాలి. తరవాత ఒక్కోదాన్ని పొడవుగా నాలుగు ముక్కలుగా కోయాలి. ఒక గిన్నెలో కారం, ఉప్పు, ఆవపిండి, మెంతిపిండి వేసి కలిపి ఉంచుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో ఆకాకరకాయల ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, కారం మిశ్రమం వేసి కలపాలి. తరవాత నువ్వుల నూనె పోసి ముక్కలకు కారం బాగా పట్టేలా కలపాలి. ముక్కల మీద నూనె తేలుతూ ఉండాలి. తరవాత నిమ్మరసం వేసి మరోసారి బాగా కలపాలి. ఈ గిన్నె మీద మూతపెట్టి ఒక రోజంతా ఊరనివ్వాలి. తరవాత ఉప్పు సరిచూసుకుని గాజు సీసాలో భద్రపరిస్తే ఈ ఆకాకరకాయ ఊరగాయ రెండు నెలల వరకు నిల్వ ఉంటుంది. ఊరినకొద్దీ దీని రుచి పెరుగుతుంది. వేడి అన్నం, ఇడ్లీ, దోశల్లోకి బాగుంటుంది.

చిట్కాలు

- **కల్లుప్పును కొద్దిసేపు ఎండలోపెట్టి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి కలిపితే పచ్చడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. నిమ్మరసాన్ని కూడా గంటసేపు ఎండలో ఉంచాలి.**

పోలాల పండుగ... సంబరాలు మెండుగా...



అన్నదాతలకు పంటల సాగులో ఆద్యంతం అండగా నిలిచేవి బసవన్నలు. వాటికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ప్రతి సంవత్సరం ఆదిలాబాద్ ప్రాంతంలోని పల్లెల్లో రైతులు ఉత్సవాలు చేస్తారు. శ్రావణమాసం చివరి రోజున... పోలాల అమావాస్య నాడు ఈ పండుగను నిర్వహించుకోవడం తరతరాల ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలను ' పోలాల అమావాస్య', ఎడ్ల పండుగ అని కూడా పిలుస్తారు. ఈ వేడుక రైతుల జీవితంలో ముఖ్యమైన భాగం.

బసవన్నలను అలంకరించి...

పోలాల అమావాస్య నాడు రైతులు ఉదయాన్నే నిద్ర లేచి, వాకిళ్లలో ఆవుపేడతో కల్లాపి చల్లుతారు. తరువాత ఎద్దులను గ్రామ సమీపంలోని చెరువులు, కుంటలు, నీటి కాలువలలోకి తీసుకువెళ్ళి శుభ్రపరుస్తారు. ఆ రోజంతా వ్యవసాయ పనుల జోలికి వెళ్ళరు. పగలంతా పశువులను కడుపునిండా మేపి, గడ్డి మోపులతో సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. పొద్దున్నే అడవి నుంచి తీసుకువచ్చిన మోదుగ కొమ్మ నారను ఎద్దు కొమ్ములకు కడతారు. దాన్ని 'పత్రి పట్టి' అంటారు. అలాగే గజ్జెలు, గంటలు, రంగురంగుల వస్త్రాలతో ఎద్దులను ముస్తాబు జేస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన వస్త్రాలను (జూళ్ళను) వాటిపై కప్పుతారు. కొమ్ములకు అద్దాల అలంకరణలు చేసి, రంగురంగుల బెలూన్స్ కడతారు. వాటి శరీరమంతా రంగులు పూసి అందంగా తయారు చేస్తారు.

ప్రత్యేక పూజలు, హారతులు, నైవేద్యాలు...

ఇలా ప్రత్యేకంగా అలంకరించిన బసవన్నలను ఊరు బయట ఒక చోటికి చేర్చుతారు. అక్కడ రైతులందరూ గ్రామ పెద్ద (పటేల్) సమక్షంలో... ఇసుకతో శివలింగాన్ని, నంది అడుగులను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలో ఉపయోగించిన పసుపు, కుంకుమలను బసవన్నల నుదుట దిద్దుతారు. అక్కడి నుంచి డప్పు వాయిద్యాలతో వాటిని గ్రామ హనుమాన్ ఆలయాలకు ఊరేగింపుగా తీసుకువెళ్తారు. ఆలయం దగ్గర కట్టిన మామిడి ఆకుల తోరణాన్ని పటేల్ ప్రత్యేకమైన కర్రతో కొట్టి తెంపుతారు. దాంతో పోలాల అమావాస్య వేడుకలు ప్రారంభమవుతాయి. "ఓం నమః పార్వతీపతయే హర హర మహాదేవ" అని నినాదాలు చేస్తూ... గ్రామ దేవతల చుట్టూ బసవన్నలను ప్రదక్షిణలు చేయించి... ఇంటికి తీసుకువెళ్తారు. అక్కడ వాటికి గుగ్గిలంతో హారతి ఇస్తారు. పప్పు బూరెలు, బియ్యం-బెల్లంతో చేసిన పాయసం, గారెలు, అప్పాలతో నైవేద్యాన్ని సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. ఆ తరువాత... పొద్దుటి నుంచి పాటించిన ఉపవాసాన్ని రైతు కుటుంబాలు విరమిస్తాయి. ఇలా చేయడం వల్ల శివపార్వతుల అనుగ్రహం, ఆశీస్సులు దక్కుతాయని, పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని రైతుల నమ్మకం.

నేడు పోలాల అమావాస్య

ఈ ఉత్సవాలు నిర్వహించడం, తోరణాలు తెంపడం తరతరాల ఆచారమనీ, ఇలా చేయడం వల్ల పంటలు పుష్కలంగా పండుతాయనీ, పశువులు ఆరోగ్యంగా ఉంటాయనీ రైతులు నమ్ముతారని తాంసి మండలానికి చెందిన గ్రామ పటేల్ కాడగిరి రామన్న యాదవ్ వివరించారు.

ప్రత్యేక గుర్తింపు కోసం...

సాగులో ఎక్కువగా యంత్రాల వాడకంపై ఆధారపడుతున్న చాలామంది అన్నదాతలు పశు పోషణపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనితో అనేక గ్రామాల్లో వేళ్ళమీద లెక్కపెట్టేటన్ని మాత్రమే కాడెద్దుల జతలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో... బసవన్నల గొప్పతనాన్ని, ఈ పండుగ వైభవాన్ని భావితరాలకు తెలియజెప్పేందుకు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తేవడానికి ప్రయత్నిస్తున్నామని, ఈ ఏడాది తాంసి మండల కేంద్రంలో శనివారం పోలాల అమావాస్య పండుగను నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా చెప్పారు. దీనిలో భాగంగా సాంస్కృతిక, హస్తకళా ప్రదర్శనలు, జానపద నృత్య కార్యక్రమాలు, తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.



• మాదస్తు రాజేశ్వర్

భోజన కుతూహలం

కంటికి మేలు చేసే ముల్లంగి ఆకులు!

ముల్లంగి దుంపలు ఘాటుగా ఉంటాయి. లేత చేదు కూడా ఉంటుంది. కానీ ముల్లంగి ఆకుల్లో ఈ చేదు ఉండదు. అందుకే ఈ ఆకులను ఉత్తర భారత దేశంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ ఆకుల్లో అనేక రకాల విటమిన్లతో పాటుగా.. ఫైబర్ కూడా ఉంటుంది. ఈ ఆకుల వల్ల కలిగే లాభాలేమిటో తెలుసుకుందాం.

- ముల్లంగి ఆకులు కంటి చూపును మెరుగుపరుస్తాయి. వీటిలో కాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ వంటివి ఎక్కువగా ఉంటాయి.
- ముల్లంగి ఆకులకు వేడి చేసే స్వభావం ఉంది. అంతే కాకుండా పచ్చి ఆకులు కఫాన్ని పెంచుతాయి. అందువల్ల పచ్చి ఆకులను తినకూడదు.
- ఈ ఆకుల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది.
- వీటిని క్రమం తప్పకుండా తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- కీళ్లవాతాన్ని హరిస్తాయి. వాపులను తగ్గిస్తాయి.
- ముల్లంగి ఆకులను ఎండబెట్టి .. వాటితో టీ కాచుకొని తాగితే కళ్ల మంటలు, దురదలు.. నీరు కారటం వంటివి తగ్గుతాయి.
- మధుమేహ వ్యాధి గ్రస్తులకు వచ్చే అరికాళ్ల మంటలు ఈ ఆకుల వల్ల తగ్గుతాయి.

ముల్లంగి ఆకులతో పప్పు, పచ్చడి చేసుకుంటారు. ఆకులను శుభ్రంగా కడిగి వాటిని.. కందిపప్పును ఉడికించి.. తాళింపు వేసుకొని తింటే పప్పు రుచిగా ఉంటుంది. ఇక ముల్లంగి ఆకులను దోరగా వేయించి.. దానిలో ఉప్పు, చింతపండు, ఎండు మిరపకాయలు వేసి బాగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత ఉప్పు వేసి మిక్సీలో వేసి ముద్దగా చేస్తే రుచికరమైన పచ్చడి అవుతుంది.

• గంగరాజు అరుణాదేవి



శ్రీశక్తి

రైల్వే నిర్వహణ... ఈ మహిళామణులదే!



భారతీయ రైల్వే... ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే సంస్థల్లో ఒకటి. నిత్యం వేల కిలోమీటర్లు తిరిగే రైళ్లు... లక్షలమంది ప్రయాణికులు... సరుకు రవాణాలు... అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ... సమయ పాలన పాటిస్తూ... సురక్షితంగా గమ్యానికి చేర్చడమంటే అడుగడుగునా సవాళ్లే. అంతటి క్లిష్టమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు ఈ మహిళా అధికారులు. సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వేలోని ఐదు ప్రధాన విభాగాలకు నేతృత్వం వహిస్తున్నారు. ఓర్పు... నేర్పు... సమయోచిత నిర్ణయాలతో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూర్చి... జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆ మహిళామణులు 'నవ్య'తో తమ అనుభవాలు పంచుకున్నారు.

దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్‌లో ప్రస్తుతం 80,527 మంది పని చేస్తున్నారు. వారిలో 8,968 మంది మహిళలు. 53 మంది లోకో పైలెట్లు, 64 మంది స్టేషన్‌మాస్టర్లతో పాటు 837 మంది ట్రాక్ మెయింటెనర్లుగా, 606 మంది సాంకేతిక నిపుణులుగా, 134 మంది మహిళలు అధికారులుగా సేవలు అందిస్తున్నారు. నిర్దిష్టమైన పని గంటలకు రైల్వే వ్యవస్థలో అవకాశం ఉండదు. ముఖ్యంగా రైళ్ల నిర్వహణను పర్యవేక్షించే అధికారులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. అన్నిటినీ అధిగమించి మగవారికి దీటుగా మహిళలు సత్తా చాటుతున్నారు.



రైళ్ల ఆపరేటింగ్ అధిపతి...
- పద్మజ

దక్షిణమధ్య రైల్వేలో అత్యంత కీలకమైన విభాగం... ఆపరేటింగ్. ఈ విభాగానికి ప్రిన్సిప ల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు... కె.పద్మజ. ప్రధానంగా ఆమె రైళ్ల రాకపోకలపై దృష్టి పెట్టారు. సమయపాలన పాటించడంలోనూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలోనూ కీలకంగా వ్యవహరించారు. 1991 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి అయిన పద్మజ... రైళ్ల షెడ్యూలింగ్, ట్రాఫిక్ నిర్వహణలో ఇతర శాఖలతో సమన్వయం చేసు కొంటూ సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ఈ ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆమె... గతంలో ఇదే జోన్‌లో వాణిజ్య, నిర్వహణ విభాగాన్ని పర్యవేక్షించారు. పండుగలు, ఉత్సవాల సమయంలో ప్రయాణికుల రద్దీని పక్కాగా అంచనా వేసి... వెయ్యికి పైగా ప్రత్యేక రైళ్లను విజయవంతంగా నడిపించారు. అంతేకాదు... 49 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసి రికార్డు నెలకొల్పారు.



నిధుల నిర్వ హణ...
- హేమసునీత

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎస్‌సీఆర్ జోన్‌లో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా హేమ సునీత బాధ్యతలు చేపట్టారు. 1993 బ్యాచ్ ఐఆర్ఎఎస్ అధికారి అయిన ఆమె... గతంలో ఫైనాన్షియల్ అడ్వైజర్-చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేశారు. ప్రిన్సిపల్ ఫైనాన్స్ అడ్వైజర్‌గా జోన్ ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'యూరోపియన్ బిజినెస్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందిన హేమ సునీత... పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్, టాక్స్ లాస్ తదితరాల్లో నైపుణ్యం సంపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై వరకు ఎస్‌సీఆర్‌కు రూ.8,081 కోట్లు ఆదాయం సమకూరింది. ఇందులో ఆమె కృషి ఎంతో ఉంది. గత ఏడాది ఇదే కాలానికి ఆదాయంతో పోలిస్తే మూడు శాతం వృద్ధి నమోదైంది. హేమ సునీత... ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో అద్భుత పనితీరు ప్రదర్శిస్తూ... జోన్‌ను లాభాల ట్రాక్‌పై నడుపుతున్నారు.



రైల్వే పోలీస్ చీఫ్...
- ఆరోమాసింగ్

రోజూ సుమారు లక్షమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే దక్షిణమధ్య రైల్వే పోలీసింగ్ వ్యవస్థను సమర్థవంతంగా నడిపిస్తున్నారు అరోమాసింగ్ ఠాకూర్. 1993 బ్యాచ్ ఐఆర్‌పీఎఫ్ఎస్ అధికారి అయిన ఆమె... 2023లో ఎస్‌సీఆర్ జోన్‌లో ఐజీ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ఆస్తులను కాపాడటంతోపాటు రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికుల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఆమె నేతృత్వంలో 'ఆపరేషన్ యాత్రి సురక్ష, ఆపరేషన్ అమానత్, ఆపరేషన్ నన్హే ఫరిస్తే, ఆపరేషన్ సతర్క్' లాంటి ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. మహిళా ప్రయాణికుల భద్రత కోసం మహిళా శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్'లు ప్రారంభించి స్టేషన్లు, రైళ్లలో నిరంతర నిఘా పెట్టారు.



ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ...
- డాక్టర్ నిర్మల

ఎస్‌సీఆర్‌లో పని చేస్తున్న ఎనభై వేల మందికి పైగా ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ బాధ్యత డాక్టర్ నిర్మల రాజారాంది. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ హోదాలో రైల్వే ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు. 380 పడకల లాలాగూడ కేంద్ర రైల్వే ఆసుపత్రితో పాటు జోన్ పరిధిలోని విజయవాడ, గుంతకల్, నాందేడ్, గుంటూరు డివిజనల్, తిరుపతి, రాయనపాడు సబ్‌డివిజనల్ ఆసుపత్రులు, 40 హెల్త్ యూనిట్‌లను పర్యవేక్షిస్తున్నారు. 1989 బ్యాచ్ ఐఆర్‌హెచ్ఎస్ అధికారి అయిన నిర్మల... గత ఏడాది డిసెంబరులో ఈ బాధ్యతలను చేపట్టారు.



వాణిజ్య విభాగం... - ఇతి పాండే

దక్షిణమధ్య రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ప్రత్యేకతను చాటుకొంటున్నారు ఇతి పాండే. 2023లో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కామ్రేడ్స్ మారథాన్‌లో... 11.47 గంటల్లో 88 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన ఏకైక మహిళా సివిల్ సర్వెంట్‌గా రికార్డులకు ఎక్కారు. 1998 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి అయిన ఆమె... 2024లో బ్యూరోక్రాట్స్ ఛేంజ్‌మేకర్స్‌లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎస్‌సీఆర్‌లో టికెట్ అమ్మకాలు, అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్, స్టేషన్ నిర్వహణ, ఫ్రయిట్ సేవలు, మార్కెటింగ్‌తో పాటు ఆదాయ వనరుల పెంపుదల కోసం సంస్కరణలు తీసుకువచ్చారు. రైల్వేకు చేసిన సేవలకు గుర్తింపుగా ఇతి పాండే 'రైల్ మంత్రి రాజభాష రజత్ పదక్ (2025), ఎక్సలెన్స్ & మెరిటోరియస్ సర్వీసెస్ (2007), విమెన్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ (2016) తదితర అవార్డులు అందుకున్నారు. అలాగే పశ్చిమ రైల్వేకు సంబంధించి సరుకు రవాణా కార్యకలాపాలపై సమగ్ర అవలోకనంతో 'రైడింగ్ ది ఫ్రయిట్ ట్రైన్' అనే పుస్తకం కూడా రాశారు.

• వరకాల యాదగిరి, హైదరాబాద్

బెంగళూరు అవుట్



అక్కడి మ్యాచ్‌లు నవీ ముంబైలో..

- షెడ్యూల్‌లో మార్పులు
- మహిళల వన్డే వరల్డ్‌కప్

వైజాగ్‌లో ఐదు మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: ఊహించినట్టుగానే మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భాగంగా బెంగళూరులో జరగాల్సిన ఐదు మ్యాచ్‌లను తరలించారు. చిన్నస్వామి స్టేడియంలో వీటి నిర్వహణకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడంలో అక్కడి క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) విఫలమైంది. దీంతో ఈ మ్యాచ్‌లన్నింటినీ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలిస్తున్నట్టుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో చాంపియన్‌గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ ర్యాలీ కారణంగా స్టేడియం బయట తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతి చెందడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించి చిన్నస్వామిలో ప్రస్తుతానికి మ్యాచ్‌లను నిషేధించింది. ఇక డీవై పాటిల్ స్టేడియంలో మూడు లీగ్ మ్యాచ్‌లు ఓ సెమీస్, ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ టైటిల్ పోరు మాత్రం పాక్ జట్టు విజయాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ దాయాది జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ కొలంబోలో నిర్వహిస్తారు. ఓవరాల్‌గా నవీ ముంబై, విశాఖపట్నం, గువాహటి, ఇండోర్, కొలంబోలో మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగుతుంది. మరోవైపు చిన్నస్వామి స్టేడియం వ్యవహారాన్ని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఓ కొలిక్కి తేలేకపోతే వచ్చే ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లకు కూడా దూరం కావాల్సి ఉంటుంది.

మరికొన్ని మార్పులు..: ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌లో ఐసీసీ కొన్ని వేదికలను మార్చింది. దీనిలో భాగంగా సెప్టెంబరు 30న ఆతిథ్య జట్లు భారత్-శ్రీలంక మధ్య జరగాల్సిన ఆరంభ మ్యాచ్‌ను బెంగళూరు నుంచి గువాహటికి తరలించారు. అక్టోబరు 3న ఇంగ్లండ్-దక్షిణాఫ్రికా మ్యాచ్ కూడా గువాహటిలోనే జరుగుతుంది. అంతేకాకుండా 10న కివీస్-బంగ్లాదేశ్ మ్యాచ్‌ను వైజాగ్ నుంచి గువాహటికి మార్చారు. ఇక అదే నెల 20న జరిగే శ్రీలంక-బంగ్లాదేశ్ మ్యాచ్, 23న జరిగే భారత్-కివీస్ మ్యాచ్‌లను నవీ ముంబైకి మార్చారు. మొత్తంగా విశాఖలో ఐదు మ్యాచ్‌లు జరగనుండగా.. భారత జట్టు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలతో ఇక్కడే ఆడనుంది.

క్రికెట్‌కు గౌహర్ వీడ్కోలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): క్రికెట్‌కు హైదరాబాదీ లెఫ్టామ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా వీడ్కోలు పలికింది. క్రికెటర్‌గా అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. 37 ఏళ్ల సుల్తానా 2008లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసింది. 2009, 2013 వన్డే వరల్డ్‌కప్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె, కెరీర్‌లో 50 వన్డేలు, 37 టీ20లు ఆడి మొత్తం 95 వికెట్లు సాధించింది. 2014 తర్వాత జాతీయ జట్టులో చోటు కోల్పోయిన సుల్తానా తిరిగి 2024 మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ తరఫున మెరిసింది. ఈ ఏడాది కూడా వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు దేశవాళీ పోటీలకు కూడా వీడ్కోలు పలికింది. కెరీర్ ఆసాంతం తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులు, సహచర క్రికెటర్లు, కోచింగ్ సిబ్బంది, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపింది. బీసీసీఐ లెవల్-2 శిక్షణ పూర్తి చేసిన సుల్తానా భవిష్యత్‌లో కోచ్‌గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది.

వలరివన్ స్వర్ణ కాంతులు



మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో అగ్రస్థానం

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): భారత ఏస్ షూటర్ ఎలవెనిల్ వలరివన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం కొల్లగొట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 253.6 పాయింట్లతో వలరివన్ టైటిల్ దక్కించుకుంది. చైనా, కొరియా రజత కాంస్యాలు అందుకున్నాయి. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభయ్ సింగ్ సెఖాన్/గనేమత్ సెఖాన్ ద్వయం కాంస్యం గెలుపొందింది. ఇక..మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో వలరివన్, మెహులీ, అనన్యా నాయుడు త్రయం కాంస్యం సాధించింది. జూనియర్ విభాగంలో భారత షూటర్ల ఆధిపత్యం కొనసాగింది. జూనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ కేటగిరీలో హర్‌మెహర్/యశస్వీ రాథోడ్ జోడీ పసిడి చేజిక్కించుకుంది. మహిళల జూనియర్ 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో శాంభవీ శ్రవణ్, హృద్యశ్రీ, ఇషా అనిల్ త్రయం స్వర్ణం కైవసం చేసుకుంది.

సెలెక్టర్ల కోసం దరఖాస్తులు

భారత క్రికెట్ జట్ల సెలెక్టర్ల కోసం వచ్చే నెల 10 లోగా బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందులో పురుషుల క్రికెట్ కోసం రెండు, మహిళల క్రికెట్ కోసం నలుగురు సెలెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. చీఫ్ సెలెక్టర్ అగార్కర్ (వెస్ట్ జోన్), అజయ్ రాత్రా (నార్త్)ల పదవీ కాలాన్ని బోర్డు మరో ఏడాది పొడిగించింది. దీంతో సౌత్, సెంట్రల్ జోన్ల సెలెక్టర్లను భర్తీ చేయాల్సి ఉంది. అయితే సౌత్ నుంచి మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజాకు దాదాపు చోటు ఖాయమైనట్టు సమాచారం. మహిళల సెలెక్షన్ కమిటీలో శ్యామా డే షా మాత్రం కొనసాగనుండగా మిగతా నలుగురిని నియమించాల్సి ఉంది. మరోవైపు పురుషుల క్రికెట్ సెలెక్టర్‌గా పదవీకాలం ముగిసిన ఎస్.శరత్.. రెండోసారి జూనియర్ క్రికెట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించడం దాదాపు ఖాయమైంది.

భారత్ 'ఏ' 299 ఆలౌట్



రాఘవీ బిస్త్ (93)

బ్రిస్బేన్: రాఘవీ బిస్త్ (93), జోషిత (51) అర్ధ శతకాలతో పోరాడడంతో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో అనధికార టెస్ట్‌లో భారత్ 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ 93/5 స్కోరుతో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 299 పరుగులకు ఆలౌటైంది. జార్జియా, బ్రౌన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా 'ఏ' రెండో రోజు ఆఖరికి 158/5 స్కోరుతో ఇక్కట్లలో పడింది. తహిలా విల్సన్ (49) రాణించింది. మీడియం పేసర్ సలీమా, స్పిన్నర్ రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.

గుకేష్, ప్రజ్ఞానందకు డ్రా

సెయింట్ లూయిస్ (యూఎస్): సింక్వెఫీల్డ్ కప్ నాలుగో రౌండ్‌ను గుకేష్, ప్రజ్ఞానంద డ్రా గా ముగించారు. వాషిర్ (ఫ్రాన్స్)తో శుక్రవారం జరిగిన గేమ్‌లో 56 ఎత్తుల తర్వాత గుకేష్ పాయింట్ పంచుకున్నాడు. ఇక సెవియన్ (అమెరికా) 29 ఎత్తులలో ప్రజ్ఞానందను నిలువరించాడు.

డ్యూరాండ్ కప్ విజేతకు రూ.1.21 కోట్లు

న్యూఢిల్లీ: డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతకు ఇకపై రూ. కోటీ 21 లక్షలు, రన్నరప్‌కు రూ.60 లక్షలు లభించనుంది.గతేడాది 1.2 కోట్లుగా ఉన్న మొత్తం ప్రైజ్‌మనీ ఈసారి రూ.3 కోట్లకు పెరిగింది. శనివారం జరిగే ఈ టోర్నీ ఫైనల్లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్-డైమండ్ హార్బర్ జట్లు తలపడనున్నాయి.

దక్షిణాఫ్రికాదే సిరీస్

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో పేసర్ ఎన్‌గిడి ఐదు వికెట్లతో చెలరేగడంతో సఫారీలు 84 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తుగా ఓడించారు. ముందుగా దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. మ్యాథ్యూ బ్రీట్‌స్కీ (88), స్టబ్స్ (74) అర్ధసెంచరీలతో రాణించారు. ఛేదనలో ఆసీస్ 37.4 ఓవర్లలో 193 రన్స్ కుప్పకూలింది. ఇన్‌గ్లిస్ (87) రాణించాడు.

తుదిపోరుకు తుంగభద్ర

ఆంధ్ర ప్రీమియర్ లీగ్



రోహిత్- ప్రశాంత్

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): రోహిత్ (87), డీబీ ప్రశాంత్ (64 నాటౌట్) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో తుంగభద్ర వారియర్స్ జట్టు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఫైనల్‌కు దూసుకువెళ్లింది. శుక్రవారం ఇక్కడ జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో తుంగభద్ర ఐదు వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై గెలుపొందింది. తొలుత భీమవరం నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 183 పరుగులు చేసింది. సాయి శ్రవణ్ (71 నాటౌట్)తో రాణించాడు. వారియర్స్ బౌలర్ దీపక్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం వారియర్స్ 19 ఓవర్లలో ఐదు వికెట్లకు 188 పరుగులు చేసి ఫైనల్లోకి ప్రవేశించింది. బుల్స్ బౌలర్లలో హరిశంకరరెడ్డి, సత్యనారాయణరాజు చెరో రెండు వికెట్లు తీశారు. శనివారం జరిగే ఫైనల్లో అమరావతి రాయల్స్‌తో తుంగభద్ర వారియర్స్ తలపడనుంది.

కాజల్‌కు స్వర్ణం



సమొకోవ్ (బల్గేరియా): భారత యువ రెజ్లర్ కాజల్ అండర్-20 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణంతో మెరిసింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన 72 కి. ఫైనల్లో కాజల్ 8-6తో యుకి లియు (చైనా)ను ఓడించి విజేతగా నిలిచింది. శ్రుతి (50కి.), సారిక (53కి.) కాంస్య పతకాలు గెలుపొందారు. కాగా..మహిళల విభాగంలో మొత్తం ఏడు పతకాలతో భారత జట్టు రన్నరప్ ట్రోఫీని సాధించింది.

ప్రొ. కబడ్డీ.. మరింత రంజుగా



తెలుగు టైటాన్స్ జట్టు

- టోర్నీలో భారీ మార్పులు
- లీగ్ దశలో గోల్డెన్ రైడ్

ముంబై: మరో వారం రోజుల్లో ప్రొ.కబడ్డీ లీగ్ (పీకేఎల్) అభిమానులను అలరించనుంది. అయితే సీజన్-12లో అనేక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పోటీలను ఇంకా రసవత్తరంగా మార్చి ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించేందుకు లీగ్ దశను మరింత విస్తరించారు. ప్లేఆఫ్స్‌లోనూ మార్పులు చేశారు. ఈ సీజన్‌ను విశాఖపట్నం, జైపూర్, చెన్నై, ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈనెల 29న ప్రారంభమయ్యే పీకేఎల్ లీగ్ దశలో మొత్తం 108 మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది. టైబ్రేకర్ విధానాన్ని మరింత విస్తృతం చేయడంతోపాటు లీగ్ దశలో 'గోల్డెన్ రైడ్' అమలు చేయనున్నారు. గతంలో గోల్డెన్ రైడ్ ప్లేఆఫ్స్‌లో మాత్రమే ఉండేది. ఇకపై లీగ్ దశలో మ్యాచ్ 'టై' అయితే ఐదు రైడ్లతో కూడిన షూటౌట్ నిర్వహిస్తారు. ఇందులో ఫలితం తేలకపోతే గోల్డెన్ రైడ్ ఉంటుంది. అప్పటికీ ఫలితం రాకపోతే 'టాస్' ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అలాగే పాయింట్ల విధానాన్ని మరింత సరళతరం చేశారు. ఇకపై విజయానికి రెండు పాయింట్లు కేటాయిస్తారు. ఓటమికి పాయింట్లేమీ ఉండవు. ఇంకా..ప్లేఆఫ్స్‌ను ప్రక్షాళన చేయడంతోపాటు 'ప్లేఇన్' విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఫలితంగా..లీగ్ దశలో తొలి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లకు ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై అయ్యే అవకాశముంటుంది. కొత్త విధానంలో..లీగ్ దశలో ఐదు నుంచి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లు 'ప్లేఇన్' మ్యాచ్‌ల్లో తలపడతాయి. ప్లే ఇన్ మ్యాచ్‌ల విజేతలు ఎలిమినేటర్స్‌లో అడుగు పెడతాయి. మూడు, నాలుగు స్థానాలు సాధించిన జట్లు 'మినీ క్వాలిఫయర్'లో ఢీకొంటాయి. మినీ క్వాలిఫయర్‌లో గెలుపొందిన జట్టు ముందడుగు వేస్తుంది. ఇక ఓడిన జట్టుకు ప్లేఆఫ్స్ ద్వారా మరో అవకాశం లభిస్తుంది. లీగ్ దశలో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు క్వాలిఫయర్-1లో తలపడతాయి. క్వాలిఫయర్-1 విజేత నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 ద్వారా మరో చాన్సు లభిస్తుంది. ప్లేఆఫ్స్‌లో మూడు ఎలిమినేటర్లు, రెండు క్వాలిఫయర్స్ ఉంటాయి.

విశాఖలో తొలి అంచె..

ఈనెల 29న విశాఖపట్నం అంచెతో లీగ్ మొదలవుతుంది. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో సెప్టెంబరు 11 వరకు వైజాగ్ దశ పోటీలు జరుగుతాయి. తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్-తమిళ్ తలైవాస్ తలపడతాయి. విజయ్ మాలిక్ కెప్టెన్సీలో తెలుగు టైటాన్స్ బరిలో దిగుతోంది. శుభమ్ షిండే వైస్-కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్‌లో 1.3% వాటా విక్రయించిన సునీతా రెడ్డి

అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్, ఎండీ సునీతా రెడ్డి కంపెనీలో 1.3% వాటాను రూ.1,489 కోట్లకు విక్రయించారు. బహిరంగ మార్కెట్లో బల్క్ డీల్స్ ద్వారా ఈ అమ్మకం జరిగింది. మొత్తం 18,97,239 షేర్లను ఒక్కోటీ రూ.7,850 చొప్పున విక్రయించడం జరిగిందని కంపెనీ వెల్లడించింది. ఈ నిధులతో ప్రమోటర్ గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకోనున్నట్లు తెలిపింది. ఈ డీల్ అనంతరం అపోలో హాస్పిటల్స్‌లో ప్రమోటర్ గ్రూప్ వాటా 29.3% నుంచి 28 శాతానికి తగ్గింది. తనఖాలో ఉన్న వాటా 13.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గనుందని సంస్థ పేర్కొంది. బీఎస్ఈలో అపోలో హాస్పిటల్స్ షేరు శుక్రవారం 0.17 శాతం పెరిగి రూ.7,938.40 వద్ద ముగిసింది.

ఎడెల్‌వీజ్ అసెట్ మేనేజ్‌మెంట్‌లో వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్‌కు వాటా

డీల్ విలువ రూ.450 కోట్లు

న్యూఢిల్లీ: ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్‌లో 15% వాటా ను అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ రూ.450 కోట్లకు కొనుగోలు చేయనుందని ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఎఫ్ఎస్ఎల్) శుక్రవారం వెల్లడించింది. ఈ లావాదేవీలో భాగంగా కంపెనీ మొత్తం విలువను రూ.3,000 కోట్లుగా లెక్కగట్టారు. ఈఎఫ్ఎస్ఎల్ కీలక వ్యాపారాల్లో ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ ఒకటి. ఈ జూన్ 30 నాటికి ఈ కంపెనీ రూ.1.52 లక్షల కోట్ల విలువైన ఫండ్ ఆస్తులను నిర్వహిస్తోంది. గత ఐదేళ్లలో ఆస్తుల విలువ ఏటా 44 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది.

ద్వితీయార్ధంలో కొలువుల జాతర



ఉద్యోగాలకు ఏఐ ముప్పు కాదు.. నౌకరీ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో ఉపాధి మార్కెట్ వర్తమాన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో జోరందుకోనుంది. పలు యాజమాన్యాలు తమ సంస్థల్లో కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలియచేశాయి. దేశంలో ఉద్యోగాల మార్కెట్ ధోరణిపై నౌకరీ నిర్వహించిన ద్వైవార్షిక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 72% మంది యాజమాన్య ప్రతినిధులు కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ద్వితీయార్ధంలో కొత్తగా కొంత మందిని ఉద్యోగాల్లో చేర్చుకునే యోచన ఉన్నట్టు 94% మంది తెలియచేశారు. దేశవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 1,300 మంది యాజమాన్య ప్రతినిధులు అందించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా పలువురు ఉద్యోగాలు కోల్పోతారన్న భయాలు విస్తృతంగా వ్యాపించిన వాతావరణంలో కూడా ఉద్యోగ మార్కెట్‌పై ఏఐ ప్రభావం అంతగా ఉంటుందని తాము భావించడంలేదని 87% మంది అన్నారు. పైగా ఉపాధి మార్కెట్‌కు ఏఐ చోదకశక్తిగా ఉంటుందని 13% మంది అభిప్రాయపడ్డారు. ఏఐ వల్ల ప్రయోజనం పొందే రంగాల్లో ఐటీ (42%), అనలిటిక్స్ (17%), బిజినెస్ డెవలప్‌మెంట్ (11%) ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రధానంగా ఏఐ ఆధారిత అవకాశాలు పెరుగుతాయన్నారు. నికరంగా అదనపు సిబ్బందిని నియమించుకోవడం ద్వారా సిబ్బంది విస్తరణ చేపట్టనున్నట్టు 72% మంది చెప్పడం ప్రోత్సాహకరమైన అంశమని నౌకరీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయెల్ అన్నారు.

కొత్త టెక్నాలజీలకే డిమాండు

స్పెషలైజ్డ్ టెక్నాలజీ విభాగాల్లో కొత్త ఉద్యోగాలకు డిమాండ్ ఉంటుందన్న సంకేతాలతో దేశంలో ఉపాధి సెంటిమెంట్ బలపడిందని నౌకరీ ఆ నివేదికలో తెలిపింది. 37% యాజమాన్యాలు ఐటీ విభాగంలో కొత్త ఉద్యోగులను నియమించుకోనున్నట్టు తెలపడం విశేషం. అయితే సాంప్రదాయిక టెక్నాలజీల కన్నా నూతన టెక్నాలజీ విభాగాల్లోనే కొత్త ఉద్యోగాల కల్పన జరగనుంది. మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఏఐ ఆధారిత టెక్నాలజీ విభాగాల్లో సామర్థ్యాలను పెంచుకోవడం విభిన్న రంగాల పరిశ్రమలకు తప్పనిసరి అయిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. అనుభవం విషయానికి వస్తే 4-7 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి డిమాండు అధికంగా ఉన్నట్టు తేలింది. అనుభవం ఉన్న వారిని ఉద్యోగాల్లో చేర్చుకోవాలనుకుంటున్నట్టు 47% మంది తెలిపారు. ఎంట్రీ స్థాయి (మూడేళ్ల లోపు అనుభవం) ఉద్యోగులను నియమించుకుంటామని 29% మంది చెప్పగా 8-12 సంవత్సరాల అనుభవం గల వారిని తీసుకుంటామన్న వారి సంఖ్య 17% ఉంది. 13-16 సంవత్సరాల అనుభవం ఉన్న వారిని తీసుకుంటామన్న వారి సంఖ్య కేవలం 3% ఉంది.

వచ్చేనెల 3-4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ


న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్‌టీ మండలి వచ్చే నెల 3-4 తేదీల్లో సమావేశం కానుంది. రేట్ల హేతుబద్ధీకరణ, పరిహార సుంకం, బీమాపై ఏర్పాటైన మంత్రుల బృందాల సిఫారసులపై ఈ సమావేశంలో జీఎస్‌టీ మండలి చర్చించనుంది. కేంద్రం ఆర్థిక మంత్రితోపాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు ఈ మండలిలో సభ్యులుగా ఉన్నారు. జీఎస్‌టీ మలి తరం సంస్కరణల్లో భాగంగా దీపావళి నాటికి పన్ను రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల ఉత్పత్తులపైన మాత్రం 40 శాతం ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే, వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి పూర్తిగా మినహాయించాలని కూడా మోదీ సర్కారు ప్రతిపాదించింది. ప్రస్తుతం బీమా పాలసీలపై జీఎస్‌టీ రేటు 18 శాతంగా ఉంది.

ఈ ఏడాదే భారత్‌లో ఓపెన్ ఏఐ కార్యాలయం

న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరిలో ఢిల్లీలో తమ తొలి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఓపెన్ ఏఐ కంపెనీ తెలిపింది. చాట్ జీపీటీ సహా ఏఐ ఆధారిత ఓపెన్ ఏఐ టూల్స్‌కు అమెరికా తర్వాత భారత్ రెండో అతి పెద్ద మార్కెట్‌గా మారింది. దీంతో భారత్‌లోనూ కార్యాలయం ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ కార్యాలయంలో పని చేసేందుకు అవసరమైన ఉద్యోగుల నియామక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించినట్టు వెల్లడించింది. తమ ఏఐ టూల్స్‌కు భారత్‌లో వేగంగా పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు ఈ కార్యాలయం తోడ్పడుతుందని ఓపెన్ ఏఐ భావిస్తోంది.

వచ్చేనెలలో ఫెడ్ రేట్లు తగ్గే చాన్స్!

ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్



కాన్సాస్ (అమెరికా): ప్రామాణిక వడ్డీ రేట్లను త్వరలోనే తగ్గించేందుకు అవకాశాలున్నాయని అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. అయితే, మార్కెట్లో పెరిగిన అనిశ్చితులు పరపతి విధానంపై నిర్ణయాలను మరింత సంక్లిష్టతరం చేశాయని ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కాన్సాస్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాక్సన్ హోల్ సదస్సులో పావెల్ పేర్కొన్నారు. కాగా, ప్రామాణిక వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకునేందుకు యూఎస్ ఫెడరల్ రిజర్వ్‌కు చెందిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ వచ్చేనెల 16-17 తేదీల్లో భేటీ కానుంది. సమావేశం చివరి రోజున వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై పావెల్ తాజా సంకేతాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ ర్యాలీ సాధించింది. డౌజోన్స్ ఒకదశలో 900 పాయింట్ల (2 శాతం) మేర పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది.

మహిళల పెట్టుబడులపై అదనపు ప్రోత్సాహకాలు

సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే

ముంబై: మ్యూచువల్ ఫండ్ రంగంలో మహిళల పెట్టుబడులను పెంచేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో చర్య చేపట్టబోతోంది. మహిళల తొలి పెట్టుబడులను ఆకర్షించే మ్యూచువల్ ఫండ్లు, డిస్ట్రిబ్యూటర్లకు అదనపు ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టనున్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే శుక్రవారం తెలిపారు. మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని మరింత పెంచడంతో పాటు ప్రోత్సహించేందుకు దేశంలోని 30 అతిపెద్ద నగరాల్లో తొలిసారి పెట్టుబడి పెట్టే వ్యక్తుల నుంచి పెట్టుబడులను ఆకర్షించే డిస్ట్రిబ్యూటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలందించాలనుకుంటున్నాం. తొలిసారిగా పెట్టుబడి పెట్టే మహిళల నుంచి పెట్టుబడులు రాబట్టే డిస్ట్రిబ్యూటర్లకు అదనపు ప్రోత్సాహకాలందించనున్నామని ఆయన అన్నారు. "మహిళల సమ ప్రాతినిధ్యం లేనిపక్షంలో ఆర్థిక సేవల సమ్మిళితం అసంపూర్ణం అవుతుంది. కాబట్టి మహిళల తొలి పెట్టుబడులను రాబట్టేందుకు డిస్ట్రిబ్యూషన్ ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టాలనుకుంటున్నాం" అని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) 30వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. యాంఫీ డేటా ప్రకారం.. 2024 మార్చి నాటికి ఫండ్ల నిర్వహణలోని వ్యక్తిగత ఇన్వెస్టర్ల మొత్తం ఆస్తుల్లో మహిళల వాటా 33 శాతంగా ఉంది.

మోసపూరిత ట్రేడింగ్ పథకాలతో జాగ్రత్త


విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల (ఎఫ్‌పీఐ) ద్వారా స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశం కల్పిస్తామంటూ సామాజిక మాధ్యమాలు, మొబైల్ యాప్‌ల ద్వారా ప్రోత్సహిస్తున్న మోసపూరిత ట్రేడింగ్ స్కీమ్‌తో జాగ్రత్తగా ఉండాలని సెబీ ఇన్వెస్టర్లను హెచ్చరించింది. అవన్నీ అక్రమ పథకాలని, నియంత్రణ పరిధిలోకి రావని సెబీ స్పష్టం చేసింది.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

రూ.2.62 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణం. సెన్సెక్స్ 693.86 పాయింట్లు నష్టపోయి 81,306.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 213.65 పాయింట్లు కోల్పోయి 24,870.10 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.2.62 లక్షల కోట్లు తగ్గి రూ.453.65 లక్షల కోట్లకు పడిపోయింది.

- ఆన్‌లైన్ గేమింగ్ రంగంలోని కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. నజారా టెక్నాలజీస్ షేరు మరో 4.13% పతనమైంది. గడిచిన మూడు సెషన్లలో ఈ స్టాక్ 17.52% క్షీణించింది. డెల్టా కార్ప్ షేరు మరో 3.50%, ఆన్‌మొబైల్ గ్లోబల్ 2.73% తగ్గాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 27 పైసల నష్టంతో రూ.87.52 వద్ద ముగిసింది.
- ఈనెల 15తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 148.8 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 69,510.6 కోట్ల డాలర్లకు పెరిగాయని ఆర్‌బీఐ వెల్లడించింది.
- స్నేహ ఆర్గానిక్స్ రూ.32.68 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈనెల 29న ప్రారంభమై వచ్చేనెల 2న ముగియనుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.115-122గా ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,530 ▲	92,150 ▲	1,28,000 ▲
విజయవాడ	1,02,350 ▲	96,000 ▼	1,17,180 ▲
విశాఖపట్నం	1,02,270 ▼	92,300 ▼	1,28,000 ▲
రాజమండ్రి	1,00,530 ▼	92,150 ▼	1,17,500 ▲
ప్రొద్దుటూరు	1,01,000 ▲	92,920 ▲	1,17,100 ▲
ముంబై	99,360 ▲	91,010 ▲	1,13,900 ▲

'స్కైస్విఫ్ట్ 56' డ్రోన్‌కు డీజీసీఏ సర్టిఫికేషన్: మారుత్ డ్రోన్స్

హైదరాబాద్: స్థానిక మారుత్ డ్రోన్స్ కంపెనీ "స్కైస్విఫ్ట్ 56" పేరుతో మరో సరికొత్త డ్రోన్‌ను అభివృద్ధి చేసింది. దీనికి పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి సర్టిఫికేషన్ కూడా లభించినట్టు కంపెనీ తెలిపింది. తక్కువ బరువు, అత్యాధునిక పరికరాలు ఉండే ఈ డ్రోన్‌ను రెండు నిమిషాల్లోనే ఫిట్ చేసి ఉపయోగించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన నిఘా, కచ్చితమైన మ్యాపింగ్‌తో క్షేత్ర స్థాయి శిక్షణకు ఈ డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డ్రోన్ల ద్వారా జరిగే వ్యూహాత్మక నిఘా, పర్యవేక్షణలకు ఈ డ్రోన్ చక్కటి పరిష్కారమని మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు వీ ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23 తేదీ



హైదరాబాద్	495	విజయవాడ	535
వరంగల్	497	గోదావరి	525
చిత్తూరు	558	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	109
వరంగల్	92	గుంటూరు	106
కరీంనగర్	92	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	80
కర్నూలు	92	నెల్లూరు	85
విశాఖపట్నం	110	అనంతపురం	85
గోదావరి	109		

అక్రమ కేబుళ్లన్నీ తొలగించండి

- అనుమతి ఉన్నవాటిని కూడా ప్రమాదకరంగా ఉంటే తీసేయండి
- ప్రాణనష్టం జరగకుండా చేపట్టే చర్యల వివరాలు సమర్పించండి
- తెలంగాణ ప్రభుత్వానికి టీ హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతి చెందిన ఘటనపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ మరణాలకు బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ అంతా ఇతరులపై నెపం నెట్టేస్తున్నారని, ఇది సిగ్గుపడాల్సిన విషయమని వ్యాఖ్యానించింది. తొమ్మిదేళ్ల బాలుడు తన పుట్టినరోజునే తండ్రి చితికి నిప్పుపెట్టాల్సిన దుస్థితి వచ్చిందని.. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని, ఆ బాలుడిని ఎవరు ఓదారుస్తారని ప్రశ్నించింది. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనాన్ని ఓపెన్ కోర్టులో ధర్మాసనం ప్రస్తావించింది. ఎటువంటి ఒప్పందాలు, అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుళ్లన్నీ తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ అనుమతులు ఉన్నా ప్రమాదకరంగా ఉంటే తొలగించాలని స్పష్టం చేసింది. అక్రమ కేబుళ్లను తొలగించడం, ప్రాణనష్టం లేకుండా ఏయే చర్యలు తీసుకున్నారనేదానిపై వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎస్పీడీసీఎల్‌కు ఆదేశాలు జారీచేసింది. రామంతాపూర్ విద్యుదాఘాతం ఘటన నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ కేబుళ్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ భారతి ఎయిర్‌టెల్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ కొనసాగించింది.

హైదరాబాద్ కిడ్నీ రాకెట్ కేసులో విశాఖ వైద్యుడు

- సీఐడీ అదుపులో డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడు
- ఈ కేసులో ఇప్పటి వరకూ 19 మంది అరెస్ట్
- కీలకంగా వ్యవహరించింది నగరానికి చెందిన పవన్

విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన హైదరాబాద్ (సరూర్‌నగర్) కిడ్నీ రాకెట్ వ్యవహారంలో విశాఖపట్నానికి చెందిన వైద్యుడిని సీఐడీ అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకూ 19 మందిని అరెస్టు చేసినట్టయింది. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన పవన్ అనే వ్యక్తిది కూడా విశాఖపట్నమే. ఆయనను ఇప్పటికే అరెస్టు చేయగా.. శుక్రవారం నగరానికి చెందిన డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడిని సీఐడీ అదుపులోకి తీసుకుంది. సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ వ్యవహారం ఈ ఏడాది జనవరిలో వెలుగుచూసింది. కిడ్నీ ఇచ్చిన ఒకరు... ముందుగా చెప్పినట్టు డబ్బు చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు విచారణలో కళ్లు బైర్లుకమ్మే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న, నిరుపేదలను లక్ష్యంగా చేసుకుని ఒక ముఠా పెద్దఎత్తున కిడ్నీ రాకెట్‌ను నడిపినట్టు పోలీసులు గుర్తించారు. తవ్వుతున్న కొద్దీ అక్రమాలు వెలుగులోకి రావడంతో ఈ కేసును సీఐడీ (తెలంగాణ)కి అప్పగించారు.

విశాఖ వ్యక్తే కీలకం..

ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారంలో విశాఖకు చెందిన పవన్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహరించాడు. హైదరాబాద్‌లో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆస్పత్రులను గుర్తించిన పవన్ వాటిల్లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించాడు. అలకనందతో పాటు మరో ఆస్పత్రిలో ఈ తరహా శస్త్రచికిత్సలు జరిగాయి. కిడ్నీ అవసరమైన వ్యక్తులను, వారికి కిడ్నీలు ఇచ్చేవారిని దళారులు, ఏజెంట్ల ద్వారా పవన్ గుర్తించేవాడు. ముఖ్యంగా తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల వారిని తీసుకొచ్చి వారి నుంచి కిడ్నీలు తీసుకునేవాడు. అందుకు వారికి రూ.5 లక్షలు, ఆస్పత్రికి, వైద్యులకు మరో రూ.15 లక్షలు చెల్లించేవాడు. కొంత మొత్తం దళారులకు ఇచ్చేవాడు. పవన్‌కు సుమారు రూ.25 లక్షల వరకూ మిగిలేది. ఇలా పదుల సంఖ్యలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు సీఐడీ గుర్తించింది. డాక్టర్ వెంకటరామ సంతోషనాయుడు విశాఖ నుంచి వెళ్లి ఈ శస్త్రచికిత్సలు నిర్వహించేవారు. ఈ కిడ్నీ రాకెట్‌లో డాక్టర్ వెంకటరామ కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ అధికారులు నిర్ధారణకు రావడంతో ఆయనను అరెస్టు చేశారు. అయితే, ఆయన ఎవరన్న దానిపై విశాఖ వైద్య వర్గాల్లో ప్రస్తుతం జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుడు కాదని మాత్రం చెబుతున్నారు. ఇదిలావుంటే వివిధ కేసుల్లో విశాఖకు చెందిన వైద్యులు వరుసగా అరెస్టు అవుతుండడంతో వైద్య వర్గాల్లో అలజడి రేగుతోంది. ఇప్పటికే సృష్టి కేసులో విశాఖకు చెందిన ముగ్గురు వైద్యులు అరెస్టయ్యారు.

నింగికేగిన అరుణతార!

సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అజాతశత్రువు... తాడిత, పీడితవర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ మట్టి బిడ్డ... భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాజీ ప్రధాన కార్యదర్శి.. సురవరం సుధాకర్ రెడ్డి (84) ఇక లేరు. కొంతకాలంగా శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10.20 గంటల సమయంలో సుధాకర్ రెడ్డి తుది శ్వాస విడిచినట్లు సీపీఐ అధికారికంగా ప్రకటించింది. గత కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన ప్రాణవాయువును అందించే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వినియోగిస్తున్నారు. ఆ స్థితిలోనూ పార్టీ కార్యక్రమాలకు చక్రాల కుర్చీలో హాజరయ్యారాయన!! సురవరం సుధాకర్ రెడ్డికి భార్య విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. అమెరికాలో ఉన్న పెద్ద కుమారుడు నిఖిల్ ఆదివారం ఉదయానికి భారత్ చేరుకుంటాడని సమాచారం. అప్పటివరకు సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని గచ్చిబౌలి కేర్ మార్చురీలో ఉంచుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అదే రోజు గాంధీ వైద్యకళాశాలకు వైద్యవిద్యార్థుల పరిశోధనార్థం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని అప్పగిస్తామని నారాయణ వెల్లడించారు. సురవరం నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఇచ్చారు.

చిన్నప్పటి నుంచే..

తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లి గ్రామంలో 1942, మార్చి 25న జన్మించారు. ఉన్నత, కళాశాల విద్య కర్నూలులో పూర్తిచేసి... హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం(ఎల్‌ఎల్‌బీ) చదివారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టారు. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయాలకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించిన సురవరం... తర్వాత ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. డిగ్రీ పూర్తిచేసిన అనంతరం విజయవాడ విశాలాంధ్ర పత్రికలో చేరారు. అందులో విలేకరిగా పనిచేస్తున్న సమయంలో.. పార్టీ ఆదేశానుసారం హైదరాబాద్‌లో విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీలో చేరారు. ఆ మరుసటి ఏడాది ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.



చక్రాల కుర్చీలో..

కమ్యూనిస్టు పార్టీ అంటే సుధాకర్‌రెడ్డికి చాలా ఇష్టం. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నా, అనారోగ్యంతో ఉన్నా... సుధాకర్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకుండా ఎప్పుడూ ఉండలేదు. ప్రతి కార్యక్రమంలో, పోరాటంలో చురుగ్గా పాల్గొనేవారు. చివరిసారిగా గత ఏడాది డిసెంబరు నెలలో నల్లగొండలో జరిగిన సీపీఐ బహిరంగసభకు హాజరయ్యారు. జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకునే సందర్భం కాబట్టే, అనారోగ్యంతో ఉన్నా ఆ సభకు వచ్చినట్లు పేర్కొన్నారు. చక్రాల కుర్చీలో కూర్చొనే కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాగా.. తెలంగాణ నాలుగో రాష్ట్ర మహాసభ దిగ్విజయమైందన్న సంతోషంతో పార్టీ నేతలు, సభ్యులంతా శుక్రవారం సభాస్థలి నుంచి ఇంటికి తిరుగు ముఖం పట్టిన సమయంలో సురవరం మరణవార్త విని విషాదంలో మునిగిపోయారు.

18 ఏళ్లకే ఓటు హక్కు కావాలని...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రెండు దశాబ్దాల పాటు 21 ఏళ్లు నిండిన వారికే ఓటు హక్కు ఉండేది. మరో యువజన నేత కేరళకు చెందిన చంద్రప్పన్‌తో కలసి సురవరం... 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించాలని పెద్ద ఉద్యమాన్ని లేవదీశారు. వారి పోరాట ఫలితంగానే ఓటు హక్కు వయసు 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతారు. రాజకీయ, సామాజిక, చారిత్రక విషయాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ ఉపన్యసించడం ఆయన ప్రత్యేకత. ఆ వాగ్ధాటితో ఎంతోమందిని ప్రభావితం చేశారు. యువజన ఉద్యమంలో ఉన్న సమయంలోనే ప్రత్యేక శిక్షణ తరగతులకు రష్యా వెళ్లిన సమయంలో.. తమ పార్టీకి చెందిన విజయలక్ష్మితో పరిచయం ఏర్పడింది. అలా కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థలలో పనిచేస్తున్న ఇరువురు 1974 ఫిబ్రవరి 19న వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. సుధాకర్‌రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే.. తన ఇద్దరు కుమారులకూ సాదాసీదాగా ఒకే రోజు, ఒకే పెళ్లి పందిరిలో వివాహాలు జరిపించారు.

ఎంపీగా..

సురవరం సుధాకర్ రెడ్డి 1998లో.. 12వ లోక్‌సభకు నల్లగొండ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2004లో రెండోసారి అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఎంపీగా.. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య శాశ్వత పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. జిల్లాలో సాగునీటి పథకాల పూర్తికి, కేంద్రం నుంచి అవసరమైన అనుమతి సాధించేందుకు కృషి చేశారు. జిల్లాలో కరువు, సాగునీటి ఎద్దడిపై ఆయన పోరాటం చేశారు. ఒకప్పుడు విశాలాంధ్ర ఉద్యమానికి ఊనికగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ.. మలిదశ తెలంగాణ పోరాటంలో తన పంథా మార్చుకోడానికి ప్రధాన కారణం సురవరం సుధాకర్ రెడ్డి వ్యూహాత్మక నిర్ణయమని ఆ పార్టీ నేతలు చెబుతారు.

అంచెలంచెలుగా..

సీపీఐలో క్రియాశీల కార్యకర్తగా చేరిన సురవరం సుధాకర్‌రెడ్డి.. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1971లో జాతీయ సమితి సభ్యునిగా పనిచేశారు. మూడేళ్లపాటు ఢిల్లీలో ఉన్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. తొలిసారి 1998 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. అదే ఏడాది సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత 2004లో ఎంపీగా ఎన్నికయ్యాక.. కార్మికశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేయటంతోపాటు అనేక పార్లమెంటరీ కమిటీలకు ఛైర్మన్‌గా పనిచేశారు. 2012 మార్చి 31న జరిగిన 21వ పార్టీ కాంగ్రెస్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2012 నుంచి 2019 వరకు ఆ పదవిలో మూడు పర్యాయాలు సేవలందించారు. చండ్ర రాజేశ్వరరావు తర్వాత సీపీఐ పగ్గాలు చేపట్టిన తెలుగు నేత సురవరం సుధాకర్‌రెడ్డి కావడం విశేషం.సురవరం మృతికి సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు.

కాలేజీలో పెట్టిన ఆప్షన్లే ఫైనల్!

- వాటిని విద్యార్థులు మార్చుకోలేరు
- ఆన్‌లైన్ ఆప్షన్లకు మాత్రమే ఆ అవకాశం
- డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి ప్రకటన
- ఆఫ్‌లైన్‌లోనూ అడ్మిషన్లకు అవకాశం

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇటీవల ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీచేయగా, ఇప్పుడు ఆఫ్‌లైన్‌లోనూ అవకాశం కల్పించినట్లు తెలిపింది. తాజా మార్గదర్శకాల ప్రకారం... విద్యార్థి అడ్మిషన్ కోరుకున్న కళాశాలకు వెళ్లి.. కాలేజీ లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అందుబాటులో ఉన్న కోర్సులను తనకు నచ్చినట్లుగా ఎంపిక చేసుకోవచ్చు. ఆ తర్వాత మరో కాలేజీకి వెళ్లి కూడా మాన్యువల్‌గా దరఖాస్తు సమర్పించవచ్చు. అయితే చివరిసారిగా వెళ్లిన కాలేజీనే తొలి ప్రాధాన్యత అవుతుంది. మొదటగా దరఖాస్తు చేసుకున్న కాలేజీ చివరి ఆప్షన్ అవుతుంది. అలాగే విద్యార్థులు మాన్యువల్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేయొచ్చు. అయితే కాలేజీలకు వెళ్లి చేసిన దరఖాస్తులే మొదటి ప్రాధాన్యత అవుతాయి. విద్యార్థి ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, తర్వాత ఆఫ్‌లైన్‌లో చేసినా.. తొలి ప్రాధాన్యత ఆఫ్‌లైన్ కాలేజీలే అవుతాయి. మరోవైపు ఆఫ్‌లైన్ విధానంలో కాలేజీల్లో పెట్టుకున్న ఆప్షన్లను విద్యార్థులు మార్చుకొనేందుకు అవకాశం లేదు. సాధారణంగా డిగ్రీకి తొలుత ఆప్షన్లు పెట్టుకున్న తర్వాత కాలేజీలు, కోర్సుల ప్రాధాన్యత మార్చుకోవచ్చు. కానీ కొత్త విధానంలో అది కుదరదు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు రూపాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ విధానంలో పెట్టుకున్న ఆప్షన్లను మాత్రమే మార్చుకోగలరు. అయితే ఈ విధానంలో విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ఏదైనా కాలేజీకి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే ఆ తర్వాత దానిని మార్చుకోవడం సాధ్యం కాదు. పైగా ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఆఫ్‌లైన్ దరఖాస్తుకే తొలి ప్రాధాన్యత లభిస్తుంది. దీనివల్ల ఆఫ్‌లైన్ విధానం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసేలా కనిపిస్తోంది. అలాగే ఒక కాలేజీకి వెళ్లి అక్కడి లాగిన్ నుంచి మరో కాలేజీకి దరఖాస్తు చేసుకోవడం సాధ్యం కాదు.

సమ్మిళిత విద్యపై రాష్ట్ర సలహా బృందం

- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సమ్మిళిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్)పై రాష్ట్ర స్థాయి సలహా బృందాన్ని ఏర్పాటుచేస్తూ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందంలో ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, వీపీ పార్థసారథి, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సభ్యులుగా ఉన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అందించే సమ్మిళిత విద్య బలోపేతంపై ఈ బృందం పనిచేస్తుంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేయబోతున్న 125 ఆటిజం కేంద్రాలను పర్యవేక్షిస్తుంది.

చిత్రజ్యోతి

SINCE 1965

నా హీరో మీరే

శుక్రవారం చిరంజీవి 70వ జన్మదినోత్సవ వేడుకలు సింగపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో ఘనంగా జరిగాయి. చిరంజీవితో రామ్‌చరణ్ కేక్ కట్ చేయించారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ భావోద్వేగభరితమైన పోస్ట్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'నాన్నా... నా హీరో, మార్గదర్శి, స్ఫూర్తిప్రదాత మీరే. నా ప్రతి విజయం వెనుక మీరు ఉన్నారు. నేను పాటించే విలువలకు మూలం మీరు. 70 ఏళ్ల వయసులోనూ మీరు మాకు ప్రేరణగా నిలుస్తున్నారు. మీరు కలకాలం ఇలానే ఆరోగ్యం, ఆనందంతో ఉండాలని ఆ దేవుణ్ణి కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.



అన్నగా నీ విజయాలను ఆస్వాదిస్తున్నా

గురువారం చిరంజీవికి పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలపగా 'నీకు అన్నను అయినందుకు ఆనందంగా ఉందని' చిరంజీవి స్పందించారు. కల్యాణ్... నువ్వు ప్రేమతో పంపిన పుట్టిన రోజు శుభాకాంక్షలు అందాయి. అందులోని ప్రతి మాటా, అక్షరం నా హృదయాన్ని తాకాయి అని లేఖలో పేర్కొన్నారు. 'నన్ను చూసి నువ్వెంత గర్వపడుతున్నావో, నీ విజయాలను, పోరాటాలను చూసి నేనూ అంతే సంతోషిస్తున్నాను. నమ్మినవాళ్లకు ఏదో చేయాలనే తపనే నీలో నూతనోత్సాహం నింపుతోంది. ఈ రోజు నీ వెనుక కోట్లాది జనసైనికులు ఉన్నారు. ఓ రాజువై ఆ సైన్యాన్ని నడిపించు. వాళ్ల ఆశలు, కలలకు కొత్త శక్తినివ్వు. ఓ అన్నయ్యగా నా ఆశీర్వచనాలు ఎప్పుడూ నీతో ఉంటాయి. నీ ప్రతి అడుగులో విజయం నిన్ను వరించాలని ఆ దేవుణ్ణి కోరుకుంటున్నాను' అని చెప్పారు.



శంకర వరప్రసాద్... పండగకి వస్తున్నారు

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో 'మెగా157' అనే వర్కింగ్ టైటిల్‌తో సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశలో ఉంది. వచ్చే సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. శుక్రవారం చిరంజీవి పుట్టిన రోజు. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించారు. 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖాయం చేశారు. 'పండగకి వస్తున్నారు' అనేది దీని ట్యాగ్‌లైన్. టైటిల్ గ్లింప్స్‌లో... బాస్ అంటూ వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో చిరంజీవి కొత్త మేకోవర్‌లో కనిపించారు. సూట్‌లో స్టయిల్‌గా సిగరేట్ తాగుతూ.. చేతిలో తుపాకీతో ఓ సీన్‌లో కనిపించారు. మరో సీన్‌లో గుర్రాన్ని నడిపిస్తూ సిగరేట్ కాలుస్తూ వింటేజ్ లుక్‌లో మైమరపించారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లో 'రౌడీ అల్లుడు' ట్యూన్‌తో చిరంజీవి ఎంట్రీ అదిరిపోయింది. చివర్లో మన శంకరప్రసాద్ గారు..పండగకి వస్తున్నారు అంటూ హీరో వెంకటేశ్ వాయిస్ ఓవర్‌తో టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'చిరంజీవిని మీరు ఎలా చూడాలనుకుంటున్నారో సంక్రాంతికి రెండింతలు చూస్తారు. పాటలు, వినోదం అన్నీ అద్భుతంగా కుదిరాయి' అని అన్నారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'చిరంజీవి సినిమాలను నేను, అనిల్ ఎలా చూస్తామో, ఎలా చూడాలనుకుంటున్నామో అలానే ఇందులో ఆయనను చూపించబోతున్నాం' అని అన్నారు. మరో నిర్మాత సుస్మిత కొణిదెల మాట్లాడుతూ 'నాన్నగారి పుట్టిన రోజున ఆయనతో లేకుండా మీ అందరి ముందు ఇలా ఉండటం బహుశా ఇదే మొదటిసారి. ఇవి నాకు మధుర క్షణాలు. మీ అందరి సపోర్టు కావాలి' అని అన్నారు.



వీరయ్యతో మరోసారి

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇదే కాంబినేషన్ మరోసారి తెరపై ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని భారీగా నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుకు 'మెగా 158' అని వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటిస్తూ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో నెత్తురు-గొడ్డలిని చూస్తుంటే యాక్షన్ మూవీలా అనిపిస్తోంది. ఈ ఏడాది చివర్లో షూటింగ్ మొదలు కానుంది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను తర్వాత వెల్లడించనున్నట్లు నిర్మాణ సంస్థ పేర్కొంది.

వాళ్లకు నచ్చకుంటే ఓటమిగా భావిస్తా





నమిత్ మల్హోత్రా

సాయిపల్లవి, రణబీర్ కపూర్ సీతారాములుగా నటిస్తున్న చిత్రం 'రామాయణ'. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూ. 4 వేల కోట్లతో నిర్మిస్తున్నట్లు ప్రకటించి అందరూ నోరెళ్లబెట్టేలా చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ చిత్రం గురించి తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'రామాయణ'ను కేవలం భారతీయ ప్రేక్షకుల కోసమే తీయట్లేదు. ప్రపంచ సినీ ప్రేక్షకులందరూ చూసేలా తీస్తున్న చిత్రమిది. ఈ ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టినప్పుడే గ్లోబల్ ఫిల్మ్‌గా తీర్చిదిద్దేలా.. మన ఇతిహాసపు గొప్పతనాన్ని పాశ్చాత్యులకూ తెలియజెప్పేలా ఉండాలని మా తపన. ఇది విదేశీయులకు నచ్చకుంటే, అది నా ఓటమిగా, అవమానంగా భావిస్తాను. ప్రాంతీయ హద్దులను, భాషా సరిహద్దులను చెరిపేసే చిత్రం తీయాలని మా ప్రయత్నం. అలాగే నాస్తికులకూ చేరువయ్యేలా ఈ చిత్రం ఉంటుంది. 'గ్లాడియేటర్', 'అవతార్' చిత్రాల స్థాయిలో 'రామాయణ' ఉండనుంది' అని అన్నారు. బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో 'రామాయణ' చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది.. తొలిభాగం వచ్చే ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి రానుంది. అయితే రామాయణం స్ఫూర్తితో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ఆదిపురుష్' ఘోర వైఫల్యంతో.. మరోసారి ఇతిహాసాల్ని తెరపై చూడడానికి ప్రేక్షకులు అనాసక్తి చూపిస్తున్న నేపథ్యంలో నమిత్ మల్హోత్రా తన ప్రాజెక్ట్‌పై చూపిస్తున్న నమ్మకం.. ఏకంగా ప్రపంచ స్థాయి సినిమాలను సవాలు చేస్తున్న తీరు ఈ సినిమాపై అంచనాలను క్రమంగా పెంచుతోంది.

రూ.వంద కోట్లతో మైక్రో డ్రామాలు



'కన్నప్ప' చిత్రం తర్వాత మంచు విష్ణు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. మూడు నుంచి ఏడు నిముషాల వ్యవధితో సాగే మైక్రో డ్రామాలు అందించాలని ఆయన నిర్ణయించుకున్నారు. సాధారణ రీల్స్‌లా కాకుండా మొబైల్ యూజర్స్‌కు సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ మైక్రో డ్రామాలను ఆయన రూపొందించనున్నారు. వీటిపై దాదాపు వంద కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి ఆయన నిర్ణయించుకున్నారు. మైక్రో డ్రామాలు కాకుండా మరి కొన్ని భారీ చిత్రాలు నిర్మించడానికి ఆయన సన్నాహాలు ప్రారంభించారు.

గోవిందా దంపతుల విడాకులు... వివరణ



బాలీవుడ్ హీరో గోవిందా, సునీతా అహూజా విడాకులు తీసుకోబోతున్నారంటూ కొన్నాళ్లుగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే పలు సందర్భాల్లో వారిద్దరూ మీడియా కథనాలను ఖండించారు. మరోమారు వారి విడాకుల వార్త బాలీవుడ్ మీడియాలో పతాక శీర్షికలకెక్కింది. కొన్నాళ్లుగా గోవిందా, సునీత విడివిడిగా జీవిస్తున్నారనీ, వారిమధ్య తలెత్తిన మనఃస్పర్ధల కారణంగా ఇప్పుడు విడాకుల కోసం సునీత బాంద్రా కోర్టును ఆశ్రయించారంటూ బాలీవుడ్ మీడియాలో మరోసారి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తమ విడాకుల వార్తలను సునీతా అహూజా ఖండించారు. ఆ ప్రచారంలో నిజం లేదన్నారు. మా మధ్య ఎలాంటి గొడవలు లేవు, అలాంటిదేమైనా ఉంటే మేమే స్వయంగా చెబుతాం అని ఆమె స్పష్టం చేశారు.

రాగిణిగా తమన్నా!




ఇటు సినిమాలు, ఒక పక్క ఐటమ్ సాంగ్స్, మరో వైపు వెబ్ సిరీస్.. ఖాళీగా కూర్చోకుండా ఏది దొరికితే అది చేసేస్తున్న హీరోయిన్ తమన్నా ఒక్కరేనేమో! ఆమెతో పాటు ఇండస్ట్రీలోకి వచ్చిన హీరోయిన్లలో కొందరు ఇప్పటికే ఇంటికి వెళ్లిపోయినా తన గ్లామర్‌ను కాపాడుకుంటూ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు తమన్నా. 'స్త్రీ 2' సినిమాలో ఆమె చేసిన 'ఆజ్ కీ రాత్' పాట జనాన్ని ఊపేసింది. దీని వల్ల 'వార్' సినిమాలో ఛాన్స్ వచ్చింది. అలాగే 'రాగిణి ఎంఎంఎస్' మూడో ఫ్రాంఛైజీలో తమన్నా నటించనున్నారన్నది తాజా సమాచారం. హారర్ కథాంశంతో 'రాగిణి ఎంఎంఎస్' చిత్రం తొలిసారిగా 2011లో వచ్చింది. 2014లో సెకండ్ పార్ట్ ప్రేక్షకులను పలకరించింది. అందులో సన్నీ లియోన్ నటించింది. ఆ సినిమాకు మూడో భాగం తీయాలనే ఆలోచన ఇప్పుడు ఏక్తాకపూర్‌కు రావడంతో తమన్నాను సంప్రదించారు. ఈ రొమాంటిక్ హారర్ థ్రిల్లర్‌లో నటించడానికి తమన్నా కూడా ఆసక్తి చూపించడంతో ఏక్తా ముందడుగు వేశారు. ఈ ఏడాది చివర్లో 'రాగిణి ఎంఎంఎస్ 3' చిత్రం సెట్స్‌పైకి రానుంది. దర్శకుడు, తారాగణం వివరాలు త్వరలో వెల్లడిస్తారు.

విశాల్ 35లో అంజలి



'మద గజ రాజా' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్నారు విశాల్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా సూపర్ గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌బీ చౌదరి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'విశాల్ 35' వర్కింగ్ టైటిల్. దుషార విజయన్ హీరోయిన్. రవి అరసు దర్శకుడు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా యూనిట్ ఓ అప్డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలో కథానాయిక అంజలి కీలక పాత్ర పోషించబోతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం తెలిపింది. 'కొన్నాళ్లుగా నటనా ప్రాధాన్య పాత్రలతో మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు అంజలి. 'విశాల్ 35'లోనూ ఆమె పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుంది, అంజలి పాత్రలోని భిన్నఛాయలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతాయి' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్. సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ఎం. నాథన్

ఉత్కంఠభరిత 'త్రిశంకిణి'



రంజిత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న సినిమా 'త్రిశంకిణి'. ఎన్‌బీజే ప్రొడక్షన్స్ బేనర్‌పై ఎన్.బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. పలువురు నూతన నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శుక్రవారం ఈ సినిమా టైటిల్ లాంచ్ కార్యక్రమాన్ని మేకర్స్ నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న హాస్య నటుడు బాబు మోహన్ మాట్లాడుతూ 'మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా 'త్రిశంకిణి' టైటిల్‌ని ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నిర్మాత బిక్కునాథ్ నాయక్ మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో ఓ సరికొత్త మూవీ చేశాం. మీరంతా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చేశాయ్

▸ 25 నుంచి ఇంటింటికీ ఉచితంగా పంపిణీ: మంత్రి నాదెండ్ల


నమూనా స్మార్ట్ రేషన్ కార్డును చూపుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో పౌర సరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్‌తో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం నమూనా స్మార్ట్ రేషన్ కార్డులను విడుదల చేశారు. ఈ నెల 25న 9 జిల్లాల్లో పండుగ వాతావరణంలో కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. తొలి విడతలో కృష్ణా, ఎన్టీఆర్, విజయనగరం, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, 30నుంచి రెండో విడతలో చిత్తూరు, కాకినాడ, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో, మూడో విడతలో సెప్టెంబరు 6నుంచి అనంతపురం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో, సెప్టెంబరు 15నుంచి బాపట్ల, పల్నాడు, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో పంపిణీ చేస్తామన్నారు.

840 బార్లు... 19 దరఖాస్తులే!

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖ విడుదల చేసిన నూతన బార్ పాలసీకి స్పందన కరువైంది. రాష్ట్రంలోని 840 బార్లకు ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ చేయగా, శుక్రవారం వరకు ఐదు రోజుల్లో 19 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వివిధ జిల్లాల్లో సుమారు 250 మంది ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 19 మంది మాత్రమే రూ.5 లక్షలు చెల్లించి తుది దరఖాస్తులు సమర్పించారు. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ పలు మార్పులు చేసింది. నిబంధనల ప్రకారం ప్రతి బార్‌కు 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఫీజు వెనక్కి ఇవ్వరు. దీనిపై వ్యతిరేకత రావడంతో ఆ నిబంధనను సవరించారు. లాటరీ తీయకపోతే దరఖాస్తుదారులకు ఫీజు వెనక్కి ఇస్తామని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రకటించారు.

పట్టణ స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం నిధులు

పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు రూ. 322.48 కోట్లు విడుదల చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25కు సంబంధించిన ఈ నిధులు నాన్ మిలియన్ ప్లస్ సిటీలకు అందనున్నాయి. ఇందులో బేసిక్ అన్‌టైడ్ గ్రాంట్ రూ. 128.99 కోట్లు, టైడ్ గ్రాంట్ రూ. 193.49 కోట్లు ఉన్నాయి.

ఉపాధి నిధులు రూ.166 కోట్లు విడుదల

గత టీడీపీ హయాంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రెండో విడత మెటీరియల్ నిధుల్లో మొదటి భాగాన్ని, రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ కలిపి రూ.166.66 కోట్లను విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

భూమన జైలుకెళ్లడం ఖాయం: నీలాయపాలెం

తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'భూమన కరుణాకర్ రెడ్డీ.. మీరు వ్యాపారాలు చేశారా? ఉద్యోగాలు చేశారా? ఏమి చేయలేదని అందరికీ తెలుసు.. అయినా వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయి?' అని టీడీపీ అధికార ప్రతినిధి, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ ప్రశ్నించారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీపై, కూటమి ప్రభుత్వంపై కరుణాకర్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మైకు ముందు శుద్ధపూస మాటలు చెప్పే ఆయన అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుందని, కాస్త ఆలస్యంగానైనా జైలుకెళ్లడం తప్పదన్నారు.

దేవుడినీ రాజకీయ రొచ్చులోకి లాగుతారా?: ఆనం

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో హిందూ ధర్మాన్ని, ఆచారాలను చివరికి భగవంతుడిని కూడా రాజకీయ రొచ్చులోకి లాగుతున్నారని, వైసీపీలాంటి పార్టీ ఉండటం బాధాకరమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరుణాకర్ రెడ్డి నాస్తికుడని, టీటీడీని దోపిడీ చేసిన అలాంటి వ్యక్తి ఇప్పుడు తిరుమల పవిత్రత గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

ముస్లింల సంక్షేమం పట్టని జగన్: మంత్రి ఫరూఖ్

కలిదిండి/కైకలూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ ముస్లింల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మంత్రి ఎండీ ఫరూఖ్ అన్నారు. ఏలూరు జిల్లా కైకలూరు, కలిదిండిలో శుక్రవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా గొడవలు సృష్టించడమే జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబు ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. తల్లికి వందనం పథకంతో అత్యధికంగా లబ్ధి పొందేది ముస్లింలే' అని పేర్కొన్నారు.

42 మందితో బీజేపీ రాష్ట్ర కమిటీ

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీని 42మందితో ఏర్పాటు చేశారు. నలుగురు ప్రధాన కార్యదర్శులు, పది మంది చొప్పున ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ మోర్చాలు, సెల్స్‌కు బాధ్యులను రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నియమించారు. పార్టీలో సుదీర్ఘ కాలంగా చురుగ్గా పనిచేస్తున్న సన్నా దయాకర్ రెడ్డిని మరోమారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగించారు. నాగోతు రమేశ్ నాయుడు, మట్టా ప్రసాద్, కాకినాడలో కార్పొరేటర్‌గా విజయం సాధించిన లక్ష్మీ ప్రసన్నకు ప్రధాన కార్యదర్శులుగా అవకాశం ఇచ్చారు. ముఖ్య అధికార ప్రతినిధిగా వల్లూరు జయప్రకాశ్, మీడియా ఇన్‌చార్జిగా కిలారు దిలీప్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కేశవ్ కాంత్, ప్రొటోకాల్ ఇన్‌చార్జిగా పాతూరి నాగభూషణంకు అవకాశం దక్కింది. యువమోర్చా అధ్యక్షుడిగా కర్నూలు వాసి సునీల్ కుమార్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నిషిధ రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రొంగల గోపి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పనతల సురేశ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా పాంగి రాజారావు, మైనార్టీమోర్చా అధ్యక్షుడిగా సయ్యద్‌బాషాను నియమించారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా కుమారస్వామిని కొనసాగించారు.

పదవీ విరమణ వయస్సు పెంపుపై మంత్రుల కమిటీ

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్న కార్పొరేషన్లు, సొసైటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లతో పాటు తొమ్మిది, పది షెడ్యూల్ సంస్థల్లోని ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో కమిటీని నియమించింది. కమిటీలో మంత్రులు పి.నారాయణ, లోకేశ్ పయ్యావుల కేశవ్‌ను నియమించింది.

మాతృ సంస్థకు ఐఆర్ఎస్ అధికారిణి మంజుల

ఆరోగ్యశాఖలో సర్వీసెస్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఐఆర్ఎస్ అధికారిణి డాక్టర్ మంజులా డి హోస్మని ప్రభుత్వం రిలీవ్ చేసింది. కేంద్ర జీఎస్టీ విభాగం నుంచి ఆమె డిప్యుటేషన్‌పై 2023లో ఏపీకి వచ్చారు. అప్పటినుంచి ఆరోగ్యశాఖలో వివిధ పోస్టుల్లో పనిచేశారు. డిప్యుటేషన్ గడువు ముగియడంతో తిరిగి మాతృత్వ సంస్థకు పంపిస్తున్నట్లు సీఎస్ కె.విజయానంద్ శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆగమ సలహా మండలి రాజీనామాలు ఆమోదం

ఆగమ సలహా మండలి చైర్మన్, సభ్యుల రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు దేవదాయ శాఖ సెక్రటరీ జి.విజయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఈఈలకు పదోన్నతులు

గ్రామీణ నీటిసరఫరా విభాగంలో పలువురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఈఈ)కు పదోన్నతులు కల్పించేందుకు ఏర్పాటు చేసిన డీపీసీ ప్యానెల్‌కు ఆమోదం తెలుపుతూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి 21 మంది డీఈఈలకు ఈఈలుగా, 8 మంది ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతి కల్పించేందుకు పదోన్నతులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఇకపై ఏటా డీఎస్సీ

16,347 పోస్టులతో మెగా డీఎస్సీ విజయవంతం

▸ విద్యాశాఖపై సమీక్షలో మంత్రి లోకేశ్



అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో మొదటిసారి 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించామని మానవ వనరుల అభివృద్ధి, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇక నుంచి ప్రతి సంవత్సరం డీఎస్సీ ప్రకటించి ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం ఆయన విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అనవసరమైన శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యా రంగంలో ప్రమాణాల మెరుగుదలకు 14 నెలలుగా అనేక సంస్కరణలు అమలుచేశామన్నారు. ఈ సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలు సాధించడమేనని చెప్పారు. మెరుగైన ఫలితాలు సాధించాల్సిన బాధ్యత అధికారులు, టీచర్లపై ఉందన్నారు. అసర్ నివేదిక ప్రకారం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్).. అంటే చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యం సాధించడంలో రాష్ట్రం 14వ స్థానంలో ఉందని, ఈ ర్యాంకును మెరుగుపరిచేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని కోరారు. దేశంలో తొలిసారిగా ప్రతి బిడ్డకూ ఎఫ్ఎల్ఎన్‌ను ఒక హక్కుగా అందిచబోతున్నామన్నారు. తల్లికి వందనం పథకంలో చివరి విడతగా పెండింగ్ దరఖాస్తులకు రూ.325 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. 2024-25 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు చేపట్టాలన్నారు. తమిళనాడు, పంజాబ్, గుజరాత్‌ల్లో అమలుచేస్తున్న విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి ఉత్తమ ప్రీస్కూల్ పాలసీ రూపొందించాలని సూచించారు. శాప్ సహకారంతో సైన్స్, స్పోర్ట్స్ ఫెయిర్‌లు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు వారి గ్రామాల్లోని పాఠశాలలను దత్తత తీసుకునేలా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలన్నారు. అనంతపురం, నెల్లూరు, ఏలూరు, కడప, చిత్తూరు జిల్లాల్లో ఆధునీకరించిన సైన్స్ కేంద్రాలను త్వరగా ప్రారంభించాలన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసే సెంట్రల్ లైబ్రరీ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలన్నారు. 2 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించే ఈ లైబ్రరీ నిర్మాణం ఏడాదిలో పూర్తిచేయాలన్నారు. విశాఖపట్నంలో ప్రతిపాదించిన ప్రాంతీయ లైబ్రరీ 50వేల అడుగుల్లో ఉండాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను అనుసంధానిస్తూ వెబ్‌సైట్ రూపొందించాలన్నారు. స్థానిక సంస్థల నుంచి రూ.213 కోట్ల సెస్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని లైబ్రరీల అభివృద్ధికి వినియోగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ లైబ్రరీల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలతో సన్నద్ధమైన 350 మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చాయన్నారు. లైబ్రరీల వల్ల కలిగే ప్రయోజనాలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలను లైబ్రరీల్లో అందుబాటులో ఉంచాలన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు మంత్రి అనుమతి మంజూరు చేశారు. అక్షరాంధ్రలో భాగంగా 16లక్షల మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు, కృతిక శుక్లా, బి.శ్రీనివాసరావు, దీవెన్‌రెడ్డి, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా నైపుణ్యం పోర్టల్

యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న నైపుణ్యం పోర్టల్ దేశానికే రోల్ మోడల్‌గా ఉండాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం నైపుణ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబరులో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించాలన్నారు. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీంతో నైపుణ్యం పోర్టల్‌ను అనుసంధానించాలన్నారు. దేశంలో ఎక్కడా నైపుణ్యం పోర్టల్‌ను ఈస్థాయిలో అభివృద్ధి చేయలేదన్నారు. ఏడాదికి 50వేల మందికి శిక్షణ ఇవ్వొచ్చని అధికారులు తెలిపారు. ఇప్పటికే 36 రంగాల్లో 3వేలకు పైగా జాబ్ కేటగిరీలను పోర్టల్‌లో నమోదుచేశామన్నారు.

మెగా డీఎస్సీ మెరిట్ జాబితాలు విడుదల

▸ రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన మహిళా అభ్యర్థులు

▸ త్వరలో సర్టిఫికెట్ల పరిశీలనఅనంతరం పాఠశాలల్లోకి

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 అభ్యర్థులకు సంబంధించిన మెరిట్ జాబితాలను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), ప్రిన్సిపాల్ పోస్టులకు వేర్వేరుగా జాబితాలు ప్రకటించింది. 16,347 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 3,12,500(92.9 శాతం) మంది పరీక్షలు రాశారు. పోస్టులు, కేటగిరీల వారీగా పాఠశాల విద్యాశాఖ వారి ర్యాంకులు ప్రకటించింది. వీటి ఆధారంగా ఆయా జిల్లాల్లో అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి, ఉద్యోగాలకు ఎంపిక చేయనుంది. మెరిట్ జాబితాల ఆధారంగా 'ఉద్యోగాలకు పరిగణనలోకి తీసుకునే అభ్యర్థుల'ను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. ఈ పరిశీలన అనంతరం అర్హులైన వారిని ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. జిల్లాల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెలాఖరు నాటికి మొత్తం ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. కాగా, సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచిన వారంతా ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాదని, పరిశీలన అనంతరం వెల్లడిస్తారని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఇదిలా వుంటే, ప్రిన్సిపాల్ కేటగిరీలో చింతల గౌతమ్ 75.5 మార్కులతో రాష్ట్రంలో టాపర్‌గా నిలిచారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అన్నెపు శేషాద్రి నాయడు(96.4 మార్కులు) ఎస్‌జీటీ టాపరుగా నిలిచాడు.

టీజీటీలో టాపర్లు వీరే

సబ్జెక్టు	పేరు	మార్కులు
ఇంగ్లిష్	రమ్యశ్రీ వెలగాల	85.43
హిందీ	జి. కౌశిక్ శాస్త్రి	88.53
సంస్కృతం	తునికిపాటి భాను	93.6
తెలుగు	కల్లె మహేశ్‌బాబు	85.2
గణితం	సుంకరణం విజయ్	87.33
సైన్స్	బి. అనిత	77.89
సోషల్	బొమ్మిడి దిల్లేశ్	84.2

పీజీటీలో టాపర్లు వీరే

సబ్జెక్టు	పేరు	మార్కులు
ఇంగ్లిష్	వారణాసి లక్ష్మీ స్వరూప	87
హిందీ	రమేశ్ రమనుకొలను	93.5
సంస్కృతం	తునికిపాటు భాను	94
తెలుగు	పట్నాన ధర్మారావు	85.5
బయాలజీ	శివకుమార్	81.5
గణితం	సుంకరణం విజయ్	78.5
ఫిజికల్ సైన్స్	కూరాకుల బాలకిశోర్	74.5
సోషల్	కురమాన నిరోష	85

దేవదాయ ఏసీ శాంతికి షోకాజ్

కంపల్సరీ రిటైర్‌మెంట్‌కు ఏర్పాట్లు.. సర్వీసు అంతా అక్రమాలు, వివాదాలు

▸ నాడు విశాఖలో సాయిరెడ్డి భూదందాకు సహకారం

▸ దేవదాయ భూముల నిర్వహణలో ఇష్టారాజ్యం..

▸ తప్పులన్నీ రుజువయ్యాయన్న కమిషనర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


శాంతి (ఫైల్)

దేవదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిణిగా పేరొందిన అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

ఆమెపై అనేక ఆరోపణలు రావడంతో గత ఏడాది జూలైలో ప్రభుత్వం సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించింది. ఆమె గతంలో పనిచేసిన విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్ జిల్లాల్లో శాంతిపై వచ్చిన ఫిర్యాదులపై దేవదాయ శాఖ కమిషనర్ నివేదికలు తెప్పించుకున్నారు. ఆమె ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరించారని, కింది స్థాయి అధికారుల సిఫారసులు లేకుండానే ఆలయాల భూములను ఇష్టానుసారం లీజుకు ఇచ్చారని తమ నివేదికల్లో విచారణాధికారులు పేర్కొన్నారు. సర్వీస్ రికార్డుల్లో శాంతి భర్తగా మదన్ మోహన్ పేరు ఉంది. అయితే 2020లో తాను సుభాశ్ అనే న్యాయవాదిని పెళ్లి చేసుకున్నానని ఆమె విజయవాడలో విలేకరుల సమావేశం పెట్టి మరీ ప్రకటించారు. అయితే, ఆమె విశాఖపట్నం అపోలో ఆస్పత్రిలో ప్రసవం కాగా, మెటర్నటీ లీవుకు పెట్టిన దరఖాస్తులో భర్తగా మదన్‌మోహన్ పేరే పేర్కొన్నారు. దీనిపై ఆయన ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. తాను విదేశాల్లో ఉన్న సమయంలో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిందని, దానికి కారకులు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. అప్పటి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై అప్పట్లో ఆయన ఆరోపణలు చేశారు. ఈ వివాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఆమెను గత ఏడాది జూలై రెండో తేదీన సస్పెండ్ చేసింది. విచారణకు ఆదేశించింది. శాంతిపై వచ్చిన చాలా ఆరోపణలు నిజమని రుజువు కావడంతో ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం 'కంపల్సరీ రిటైర్‌మెంట్' ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలంటూ దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ వారం రోజుల క్రితం ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. దానికి 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

ఆది నుంచి అంతే!!

ఐదేళ్ల క్రితం, అంటే 2020 కొవిడ్ సమయంలో ఆమె విశాఖపట్నంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా తొలి పోస్టింగ్ తెచ్చుకున్నారు. అప్పుడు విశాఖకు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇన్‌చార్జి. ఆయన విశాఖలోని దేవదాయ శాఖ పరిధిలోని ప్రేమసమాజం భూములపై దృష్టిపెట్టారు. ఆ విషయంలో ఆయనకు శాంతి పూర్తిగా సహకరించారు. చెప్పినట్టు చేయడంతో ఆమెను సాయిరెడ్డి ప్రోత్సహించారు. ఆ తర్వాత అదనంగా మరో రెండు ఆలయాలకు ఇన్‌చార్జి ఈవోగా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. తనపై అధికారి అయిన డిప్యూటీ కమిషనర్ ముఖంపై ఆమె ఇసుక చల్లడం అప్పట్లో రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. ఆమెను విశాఖ నుంచి బదిలీ చేయాలని ఆ శాఖ ఉద్యోగులు రెండు రోజులు ధర్నా చేస్తే వైసీపీ పెద్దలు వారిని బెదిరించారు.

ఇదే సమయంలో కొత్తగా ఏర్పాటుచేసిన అనకాపల్లి జిల్లా దేవదాయ బాధ్యతలు కూడా ఆమే తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో దేవాలయాల భూములను వేలం లేకుండా ఏకపక్షంగా ప్రైవేటు వ్యక్తులకు శాంతి లీజుకు ఇచ్చేశారు.

▸ లంకెలపాలెంలో పరదేశమ్మ ఆలయానికి సర్వే నంబరు 189లో 10.13 ఎకరాలు ఉంది. అందులో కొంత స్థలాన్ని పలువురు ఆక్రమించారు. ఎకరా స్థలంలో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ పెట్టుకున్నవారిని లీజు తక్కువ ఇస్తున్నారని, జరిమానా వేసి శాంతి భయపెట్టారు. ఆ తరువాత ఆక్రమార్కులతో అడ్డగోలు ఒప్పందం చేసుకొని 11 ఏళ్ల లీజుకు ఇచ్చేశారు.

▸ చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వర ఆలయానికి మెయిన్‌రోడ్డులోనే షాపులు ఉన్నాయి. వారిని కూడా ముందు అద్దెలు పెంచాలని, ఖాళీ చేసేయాలని శాంతి బెదరగొట్టారు. వారు కాళ్లవేళ్లాపడి ఒప్పందం చేసుకోవడంతో వారికి కూడా 11 ఏళ్ల లీజుకు షాపులను ఇచ్చేశారు.

▸ అనకాపల్లిలో సిద్ధి వినాయక ఆలయానికి సంబంధించిన షాపుల్లో కొందరు అద్దెకు ఉన్నారు. వారు అద్దెలు కట్టకపోవడంతో వాటిని వేలానికి పెట్టారు. శాంతి వేలం లేకుండా 11 ఏళ్ల లీజుకు ఇచ్చేశారు. వీటన్నింటిపైనా విచారణ జరిగింది.

రంగంలోకి దిగని ఏసీబీ...

సర్వీసులో చేరిన ఐదేళ్లలోనే రూ.కోట్ల విలువైన ఆస్తులు సంపాదించారనే ఆరోపణలు శాంతిపై ఉన్నాయి. విధుల్లో చేరిన రెండోఏడాదే విశాఖలోని విశాలాక్షినగర్‌లో రూ.80లక్షల విలువైన ఫ్లాట్ కొనుగోలుచేశారు. దాదాపు వంద తులాల బంగారు ఆభరణాలు శాంతికి ఉన్నట్టు చెబుతున్నారు. విశాఖ నుంచి విజయవాడ బదిలీ కాగా, అక్కడ శాంతి బినామీల పేరిట రెండు విల్లాలను కొనుగోలు చేశారంటున్నారు. అందులో ఒకటి సాయిరెడ్డే తక్కువ రేటుకు ఇప్పించారని ఆమె మీడియా సమావేశంలో ప్రకటించారు. ఓ విల్లాను కూటమి ప్రభుత్వంలోని ఓ నాయకుడికే నెలకు రూ.లక్ష అద్దెకు ఇచ్చారు. మరో విల్లాలో కుమారుడితో కలిసి ఉంటున్నారు. ఇటీవల ఆఫీస్ పనిపై విశాఖ వచ్చిన ఆమె, తన కుమార్తెను డెహ్రాడూన్ స్కూల్‌లో ఏడాదికి రూ.16లక్షల ఫీజు కట్టి చేర్పిస్తున్నానని సహోద్యోగులకు చెప్పారు. అయినా, ఆమె అక్రమంగా సంపాదించిన ఆస్తులపై ఇంత వరకు అవినీతి నిరోధక శాఖ దృష్టి పెట్టలేదు. ఆమె తన ఇద్దరు చెల్లెళ్లకు అప్పట్లో వైసీపీ కీలక నేతతో సిఫారసు చేయించుకుని ఏపీ ఫైబర్‌నెట్‌లో ఉద్యోగాలు వేయించారు. మొన్నటివరకు వారు అక్కడే పనిచేయడం గమనార్హం. ఇప్పటికైనా ఏసీబీ ఆమె సంపాదనపై దృష్టి పెడితే అనేక విషయాలు బయటకు వస్తాయి.

స్టార్టప్‌లకు భారీ ప్రోత్సాహం

▸ నేరుగా రూ. కోటి దాకా వర్క్ ఆర్డర్లు.. ఐటీ శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనా విధానాలు, ఆవిష్కరణలతో ప్రభుత్వ సేవలను వేగవంతం చేయగలిగే సామర్థ్యం ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. టెండరు మార్గదర్శకాలతో నిమిత్తం లేకుండా నేరుగా కోటి రూపాయల వరకు వర్క్ ఆర్డర్లు ఇచ్చేందుకు ప్రభుత్వ శాఖలకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భాగంగా స్టార్టప్ సంస్థలకు తమిళనాడులో రూ.5 కోట్ల దాకా, కేరళ, కర్ణాటకలో రూ.50 లక్షల దాకా టెండర్ ప్రక్రియ లేకుండానే నేరుగా వర్క్ ఆర్డర్లు ఇస్తున్నారు. ఈ విధానాన్ని అధ్యయనం చేసిన రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ ఏపీలో కూడా కోటి రూపాయల దాకా స్టార్టప్‌లకు నేరుగా వర్క్ ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది.

రోజుకు 21 లక్షల మంది ఉచిత ప్రయాణం

▸ త్వరలో 1050 ఈ-బస్సులు, 1500 బస్సుల కొనుగోలు: ఆర్టీసీ ఎండీ

పొన్నూరుటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రతి రోజూ 21 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని పొందుతున్నారని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో కలిసి సందర్శించారు. డిపోలోని సమస్యలపై ఆరా తీసి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకంలో ప్రస్తుతం 60 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. నష్టం వచ్చినా ప్రభుత్వ లక్ష్యాలను అందుకునేలా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. త్వరలో 1050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. మరో 1500 బస్సులు సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 1500 మందిని కారుణ్య నియామకాల కింద నియమించుకున్నామన్నారు. పెన్షను సైతం పెంచామని తెలిపారు.

వ్యర్థాల పునర్వినియోగంతో పర్యావరణానికి మేలు

▸ పీసీబీ వర్క్‌షాప్‌లో చైర్మన్ కృష్ణయ్య

అమరావతి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, పాడి, మత్స్య పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చవచ్చని, ఆ దిశగా అడుగులేస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం విజయవాడలోని పీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. వ్యర్థాలను వినియోగించుకుని ఉపాధి పెంచుకుంటూ, ఆర్థికంగా ఎదిగేందుకు మంచి అవకాశాలెలా కల్పించాలి..? అన్న అంశాలపై చర్చించారు. ఈ వర్క్‌షాప్‌నకు వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పీసీబీ సభ్యకార్యదర్శి శరవణన్, ఇతర శాఖల ఉన్నతాధికారులు, పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు హాజరయ్యారు. వ్యవసాయం, ఆక్వా, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ తదితర రంగాల్లో ఏ మేరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి? వాటిని ఎలా నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయో ఆ శాఖల అధికారులు వివరించారు. పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, ఇతర నిపుణులు తమ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను చర్చించారు. పీసీబీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించిన రీసైక్లింగ్ పాలసీ ద్వారా పర్యావరణ అనుకూల పరిశ్రమలు రాష్ట్రానికి ఎక్కువగా వస్తాయి. రీసైక్లింగ్‌కు అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా అనుబంధ పరిశ్రమలు రాష్ట్రంలో ఎక్కువగా పెట్టేందుకు అవకాశం ఉంది' అని తెలిపారు.

అంతా పైవాళ్లకే తెలుసు!

(మొదటి పేజీ తరువాయి)



విధానాన్ని పక్కన పెట్టడంపై సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు 'అన్ని నిర్ణయాలు పైవాళ్లే తీసుకున్నారు' అంటూ ఒకటే జవాబు పదేపదే చెప్పారని సమాచారం. లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి(ఏ-1), ఇతర నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రశ్నలు వేసినా ఆయన స్పందనలో మాత్రం తేడా లేదని తెలిసింది. గత నెలలో నోటీసు ఇచ్చి విచారణకు పిలవగా, అనారోగ్య కారణాలు సాకుగా చూపించి నారాయణస్వామి ముఖం చాటేశారు. అయితే అప్పట్లో నారాయణ స్వామి ఇంటికెళ్లి ప్రశ్నించారు. ఇప్పుడు మరోమారు అదనపు ప్రశ్నలతో పుత్తూరు వెళ్లి ప్రశ్నించారు. ఎక్కువ ప్రశ్నలకు 'తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా' అనే బదులిచ్చినట్లు తెలిసింది. 'ప్రభుత్వమే మద్యం షాపులు పెట్టాలన్న పాలసీ నిర్ణయంపై మీరు సంతకం చేశారు కదా.. ఎవరి ఒత్తిడితో చేశారు' అని అడగ్గా.. 'అంతా పై వాళ్లే..' అంటూ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. మంత్రికి తెలియకుండానే మద్యం పాలసీ మార్పుచేర్పులు, అమలు ఎలా సాధ్యమని అధికారులు గట్టిగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఆయన కుటుంబంలో ఒకరి పాత్ర గురించి కూడా లోతుగా ఆరా తీసినట్టు సమాచారం. మంత్రి హోదాలో ఆయనకు ప్రతినెలా యాభై లక్షల రూపాయల ముడుపులు అందిన విషయం ప్రస్తావించగా.. తనకు ఎవ్వరూ రూపాయి కూడా ఇవ్వలేదని నారాయణస్వామి బదులిచ్చారు. ఒకదశలో తాను డయాలసిస్ చేయించుకుని బాధ పడుతున్నానని, ఇబ్బంది పెట్టొద్దని కోరినట్లు తెలిసింది. కాగా, సిట్ అధికారులు మరోమారు ఆయనను ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

పక్కాగా.. పకడ్బందీగా...

పుత్తూరు పట్టణం ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తుదన్న నారాయణస్వామిని ప్రశ్నించేందుకు సిట్ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో వచ్చారు. జిల్లా ఎస్పీకి ముందుగానే సమాచారం ఇచ్చి బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. సిట్ బృందంలో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారితో పాటు నలుగురు డీఎస్పీలు ఉన్నారు. ఉదయం 11 గంటలకు బాడీ వోర్న్ కెమెరాలతో నారాయణస్వామి ఇంట్లోకి ప్రవేశించారు. మూడంతస్తుంతల భవనంలోని రెండో అంతస్తులో ఆయన కార్యాలయంలో విచారణ ప్రక్రియ కొనసాగింది. విచారణను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయించారు.

న్యాయవాది హడావిడి

నారాయణ స్వామిని సిట్ విచారిస్తున్న సందర్భంలో వైసీపీలో చురుగ్గా ఉండే ఒక న్యాయవాది అక్కడకు చేరుకున్నారు. "నోటీసు ఇవ్వకుండా ఎలా వచ్చారు? ఆందోళనతో ఆయన అనారోగ్యానికి గురై ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రశ్నల జాబితా ప్రతి నాకూ ఇవ్వండి" అని ఆ న్యాయవాది హల్‌చల్ చేసినట్లు తెలిసింది. ఆయనకు సిట్ అధికారులు కూల్‌గా సమాధానమిచ్చారు. "రెండు సార్లు నోటీసులిచ్చినా నారాయణస్వామి స్పందించలేదు. అందుకే మేం రావాల్సి వచ్చింది. అవసరమైతే విజయవాడకు తీసుకెళ్లే అధికారం మాకుంది. ప్రశ్నల జాబితా ప్రతి ఇవ్వడం కుదరదు" అన్నట్టు సమాచారం.

ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ సీజ్

నారాయణస్వామికి చెందిన ల్యాప్ టాప్‌ను, మొబైల్ ఫోన్‌ను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇద్దరు మహిళా వీఆర్వోల సమక్షంలో... పంచనామా నిర్వహించి వీటిని స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు... నారాయణస్వామి వాంగ్మూలాన్ని కూడా వారి సమక్షంలోనే నమోదు చేసినట్టు తెలిసింది. వీఆర్వోల రాకతో నారాయణస్వామిని అరెస్టు చేస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. దీంతో జీడీ నెల్లూరు నియోజకవర్గం నుంచి కొందరు వైసీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించివేశారు. ఏడుగంటలపాటు విచారణ ప్రక్రియ కొనసాగినా... వైసీపీ ముఖ్యనేతలెవరూ అటువైపు రాకపోవడం గమనార్హం.

సిట్‌కు సహకరించా: నారాయణస్వామి

సిట్ అధికారులకు తాను సహకరించానని నారాయణస్వామి మీడియాకు చెప్పారు. విచారణ సందర్భంగా వారు తనను ఇబ్బంది పెట్టలేదన్నారు. వాళ్లు అడిగిన ప్రశ్నలన్నింటికీ కూల్‌గా సమాధానం చెప్పానన్నారు. భవిష్యత్తులో మళ్లీ వచ్చి విచారించినా సహకరిస్తానన్నారు. సిట్ అధికారులు 'నార్మల్ ప్రాసెస్'లో భాగంగా విచారణకు వచ్చారని, వారికి సహకరించాం కాబట్టి భయపడాల్సిన పనిలేదని నారాయణస్వామి కుమార్తె, జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కృపాలక్ష్మి కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. సిట్ అధికారులు తమను ఇబ్బంది పెట్టలేదన్నారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డాపై కేసు

అటవీశాఖ ఉద్యోగులపై దాడి ఘటనలో ఏ-2గా చేర్చిన పోలీసులు

ఏ1గా జనసేన ఇన్‌చార్జి రౌతు అశోక్

నంద్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఉద్యోగులపై దాడి ఘటనలో నమోదైన కేసులో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని పోలీసులు ఏ-2గా చేర్చారు. శ్రీశైలం జనసేన ఇన్‌చార్జి రౌతుఅశోక్‌ను ఏ1గా నమోదుచేశారు. చెక్‌పోస్టు వద్ద తనకు దారి వదలలేదని అటవీశాఖకు చెందిన పెట్రోలింగ్ టీమ్‌పై తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే భౌతికదాడికి పాల్పడటం, అటవీశాఖ సిబ్బందిని నిర్బంధించి చిత్రహింసలు పెట్టడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. దీంతో శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులు చట్టపర చర్యలకు సిద్ధమయ్యారు. అందరికంటే అశోక్ తమపై ఎక్కువగా దాడి చేశారని అటవీశాఖ సిబ్బంది చెప్పడంతో ఆయనను ప్రధాన నిందితుడిగా చేర్చామని పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనకు సంబంధించిన మరికొంత సమాచారం తాజాగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ ఉద్యోగులను శ్రీశైలంలోని ఎమ్మెల్యే అతిథి గృహంలో(గొట్టిపాటి నిలయం) నిర్బంధించారు. గంటల తరబడి వేధింపులకు గురిచేశారు. మరోవైపు ఎమ్మెల్యే బుడ్డా వ్యవహారం ఇప్పటికే సీఎం దృష్టికి వెళ్లింది. పోలీసుల వర్గాల సమాచారం ప్రకారం.. సీఎం ఆదేశాల మేరకు లోతుగా విచారణ చేసి సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్నారు.



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో జనసేన శ్రీశైలం ఇన్‌చార్జి రౌతు అశోక్ (ఫైల్)

అరుణ గ్యాంగ్ ఎక్కడ?


(మొదటి పేజీ తరువాయి)

చేయకుండా శ్రీకాంత్, అరుణలు పేట్రేగిపోయారు. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నింటికీ తలూపితే సరే లేకుంటే ప్రాణాలు తీసేంత స్థాయికి ఎదిగిపోయారు. అయితే, వీరిద్దరి ఆగడాలకు ప్రస్తుతం ప్రభుత్వంలో బ్రేక్ పడింది. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ రద్దు కావడంతో ఆ ప్రేమికుల నేర సామ్రాజ్యానికి బీటలు పడటం ప్రారంభమైంది. ఆ తర్వాత అరుణ అరెస్ట్‌తో వారితోపాటు నడిచిన గ్యాంగ్‌ల గుండెల్లో దడ మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాంత్, అరుణల వ్యవహారం సంచలనంగా మారడంతో పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలో ఆ ప్రేమికులకు అండగా ఉన్న రౌడీ గ్యాంగ్‌ల వివరాలను సేకరించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలతోపాటు శ్రీకాంత్, అరుణలతో చేతులు కలిపి నేరాలకు పాల్పడిన వారి జాబితాను సిద్ధం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ముందుగా గుర్తించిన రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరులోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ముగ్గురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకోగా, శనివారం వారిని అరెస్ట్ చూపించే అవకాశముంది. పోలీసుల దూకుడుతో పలువురు రౌడీషీటర్లు జిల్లాను వీడి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, గోవా వంటి ఇతర ప్రాంతాలకు పరారైనట్లు సమాచారం. వారి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు అరుణ తనను మోసం చేసిందంటూ శుక్రవారం విజయవాడ నుంచి ఓ వ్యక్తి నెల్లూరుకు వచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తుండగా తిరిగి ఆయన్ను నెల్లూరుకు పిలిపించారు. అసలేం జరిగిందో సమగ్రంగా విచారిస్తున్నారు. అరుణ తన వద్ద రూ.21 లక్షలు తీసుకుని మోసగించినట్లు విజయవాడ వాసి తెలిపినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు ఆధారంగా అరుణపై మరో కేసు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది.

విపక్షాల అభ్యర్థికి.. మేమెలా మద్దతిస్తాం?

- ఇది ఇండీ కూటమి రాజకీయం: చంద్రబాబు
- ఢిల్లీలో ఎన్డీఏ అభ్యర్థితో మర్యాదపూర్వక భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న టీడీపీ మద్దతును ఇండీ కూటమి ఎలా ఆశిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. గెలిచే అవకాశం లేకపోయినా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టి రాజకీయం చేస్తోందని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీయే తరపున బరిలోకి దిగిన సీపీ రాధాకృష్ణన్‌తో చంద్రబాబు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ పదవి ప్రతిష్ఠను రాధాకృష్ణన్ పెంచుతారని.. ఆయన దేశంలోనే గౌరవనీయుడైన నాయకుడని.. ఆయనకే టీడీపీ మద్దతు ఉంటుందని తేల్చిచెప్పారు. 'మేం ఎన్డీఏలో ఉన్నాం. వేరే అభ్యర్థికి మద్దతిస్తామని ఎలా ఆశిస్తారు? తెలుగుదేశం పార్టీ తెలుగు సమాజం కోసమే ఏర్పడింది. అది వేరే విషయం. లోక్‌సభ ఎన్నికల ముందు నుంచే మేం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలే ఉన్నాయి. అలాంటప్పుడు విపక్షాలు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మా మద్దతు ఆశించడం, మాట్లాడడం సరికాదు. మా పార్టీకి నీతి, విశ్వసనీయత ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ విశ్వసనీయతను నిర్మించుకున్నాం. ఇప్పుడే కాదు.. ప్రారంభం నుంచీ నా వైఖరి మీకు తెలుసు. ఉపరాష్ట్రపతి చాలా గౌరవప్రదమైన పదవి. ప్రతిపక్షాలు ఇప్పుడు మరో అభ్యర్థిని ఎందుకు తెచ్చాయి? ఓడిపోతామని తెలిసీ అభ్యర్థిని నిలబెట్టడం అవసరమా? అది వారి రాజకీయం. కానీ మేమిక్కడ రాజకీయాలు చేయడం లేదు. నాకు రాజకీయాలు ముఖ్యం కాదు. మాకు మెజారిటీ ఉంది.. సునాయాసంగా గెలవబోతున్నాం' అని విస్పష్టంగా ప్రకటించారు. ఎన్డీయే అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను తామంతా కలిసే నిర్ణయించామన్నారు. ఆయనతో ఎప్పటి నుంచో తనకు పరిచయం ఉందని.. ఇప్పుడు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలియజేశానని సీఎం చెప్పారు. 'అభ్యర్థిత్వంపరంగా రాధాకృష్ణన్ ఉత్తమ అభ్యర్థి. ఈ విషయంలో రెండో ఆలోచన లేదు. ఆయనకు అందరూ మద్దతివ్వాలి. రాధాకృష్ణన్ దేశానికి గౌరవం తీసుకొస్తారు. అలాంటి వ్యక్తికి మద్దతివ్వడం చాలా ఆనందం. సంతోషకరం' అని తెలిపారు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, ఎంపీలు మాగుంట, లావు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అప్పుడు పీవీ కోసం త్యాగం చేశాం..

తెలుగువారు అన్నప్పుడు గెలిచే అభ్యర్థిని పెట్టుకోవాల్సిన బాధ్యత మిగతా పార్టీలకు ఉంటుందని చంద్రబాబు అన్నారు. గతంలో ఒకసారి టీడీపీ, కాంగ్రెస్ పరస్పరం పోరాడుతున్న సమయంలో.. తెలుగువారు అనే ఉద్దేశంతో నాటి ప్రధాని పీవీ నరసింహారావు కోసం నంద్యాల ఎంపీ సీటును త్యాగం చేసి, టీడీపీ మద్దతు పలికిందని తెలిపారు. ఆయన వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

'సాస్కీ' కింద అదనంగా 5 వేల కోట్లివ్వండి

- కేంద్ర ఆర్థిక మంత్రికి చంద్రబాబు వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయ పథకం(సాస్కీ) కింద అదనంగా రూ.5 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లో ఆమెతో ఆయన సమావేశమయ్యారు. ఓ వినతి పత్రం సమర్పించారు. సాస్కీ కింద రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.2,010 కోట్లు అందాయని సీఎం తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందించాలని మంత్రిని కోరారు. అలాగే 2024-25కి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం.. రూ.250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులివ్వాలని అభ్యర్థించారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని.. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. దీని విధివిధానాలను రూపొందించి త్వరగా అమల్లోకి తేవాలని కోరారు.

వైసీపీపై ఇండీ కన్ను!

- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు కోసం ఆ పార్టీ ఎంపీలతో మంతనాలు
- సుబ్బారెడ్డితో మాట్లాడిన జైరాం రమేశ్
- రఘునాథరెడ్డిని ఇంటికి పిలిపించుకున్న ఖర్గే
- జగన్‌తోనూ టచ్‌లోకి కాంగ్రెస్ నేతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో టీడీపీ మద్దతు ఆశించిన 'ఇండీ' కూటమి నేతలపై ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నీళ్లు గుమ్మరించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో రాగానే ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను కలుసుకుని పూర్తి మద్దతు ప్రకటించడం.. లోక్‌సభ ఎన్నికలకు ముందు నుంచే టీడీపీ.. ఎన్డీఏలో కొనసాగుతోందని స్పష్టం చేయడంతో 'ఇండీ' వర్గాలు ఆశలు వదులుకున్నాయి. చంద్రబాబును ఎలాగైనా కలుసుకుని సహకారం కోరాలని భావించిన ప్రతిపక్ష కూటమి నేతలు మౌనంగా ఉండిపోయారు. ఆయన వైఖరిని ముందుగానే ఊహించిన కాంగ్రెస్ నేతలు వైసీపీపై కన్నేశారు. ఆ పార్టీ ఎంపీలను నిరంతరం సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. వారు కూడా స్పందిస్తున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డితో కీలక చర్చలు జరిపారు. తమ చేతుల్లో ఏమీ లేదని, తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవాలని సుబ్బారెడ్డి తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆహ్వానం మేరకు మరో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి చర్చించారు. కర్ణాటక రాజకీయాల్లో ఖర్గే క్రియాశీలంగా ఉన్నప్పటి నుంచే తనకు తెలుసని.. అందుకే ఆయన రమ్మనడంతో స్నేహపూర్వకంగా వెళ్లానని రఘునాథరెడ్డి చెప్పారు. ఖర్గే తనను ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలని కోరలేదని ఆయన అన్నప్పటికీ.. వారిద్దరి మధ్యా అదే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు సమాచారం. ఎంపీలతో పాటు ఏకంగా జగన్‌తోనే కాంగ్రెస్ నేతలు ఆయన సన్నిహితుల ద్వారా సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. వైసీపీలో ఇప్పటికే నలుగురు రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడడం, మరికొంత మంది గుడ్‌బై చెబుతారని ప్రచారం జరుగుతుండడం తెలిసిందే. ఈ పరిణామాలే గాక లిక్కర్ కేసులో వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి జైలుకెళ్లడం.. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దయ్యే అవకాశాలు కనిపిస్తుండడంతో పార్లమెంటులో వైసీపీ పూర్తిగా అస్తిత్వం కోల్పోయినట్లు స్పష్టమవుతోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో వైసీపీ ఎంపీలు అంటీముట్టనట్లు ఉండడం, వివిధ అంశాలపై తమ పార్టీ వైఖరేంటో తెలియని అయోమయంలో పడడంతో కాంగ్రెస్ నేతలు వారిపై దృష్టి సారించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న వైసీపీని తమ వైపు తిప్పుకోవడానికి ఇదే సరైన సమయమని వారు భావిస్తున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విప్ లేకపోవడం, సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుండడంతో వైసీపీ ఎంపీలు కూడా ఇండీ కూటమి అభ్యర్థి వైపు ఆకర్షితులయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. అయితే సీబీఐ, ఈడీ కేసుల్లో చిక్కుకుని, మద్యం స్కాం కూడా వెంటాడుతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న జగన్.. మోదీ ప్రభుత్వాన్ని కాదని.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండీ కూటమికి అనుకూలంగా లోపాయకారీగా వ్యవహరిస్తారా అన్నది చర్చనీయాంశమవుతోంది.

బాబును కలవని 'ఇండీ' అభ్యర్థి!

తెలుగు ఆత్మాభిమానం పేరుతో తన మద్దతు కోరుతున్న వారిని ఉద్దేశిస్తూ.. ఓడిపోయే అభ్యర్థిని ఎందుకు నిలబెట్టాలని చంద్రబాబు ప్రశ్నించడం ఇండీ కూటమి నేతలను ఇరుకునపడేసింది. ఆయనతో ఇతర మిత్రపక్షాల నేతల ద్వారా మాట్లాడించేందుకు చేసిన ప్రయత్నాలు కూడా విఫలమైనట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలతో 'ఇండీ' కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. చంద్రబాబును కలిసేందుకు ప్రయత్నించలేదని కూటమి నేతలు చెప్పారు.

పింఛన్‌పై ఫేక్ రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

పోయాయంటూ వీడియోలు చిత్రీకరించి జనంలోకి వదులుతున్నారు. సహజ మరణం చెందిన వారినీ పింఛన్ల తొలగింపుతో గుండె ఆగి చనిపోయిన వారిగా చూపుతూ జగన్ రోత మీడియా కథనాలు వండివారుస్తోంది. వాస్తవానికి వైసీపీ హయాంలో అర్హులు కాకపోయినా ఆ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు భారీగా పింఛన్లు ఇచ్చారు. అప్పట్లో సుమారు 2 లక్షల మందికి దివ్యాంగ పింఛన్లు ఇవ్వగా, వీరిలో అధికశాతం బోగస్ సదరం సర్టిఫికెట్లతో పింఛన్లు పొందినవారే. ప్రస్తుతం ఈ పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ జరుగుతోంది. సుమారు 80 వేలమంది బోగస్ సదరం సర్టిఫికెట్లతో పింఛన్లు పొందినట్లు గుర్తించారు. అయితే అనర్హులను మాత్రమే తొలగిస్తామని, అర్హులకు ఒక్కరికి కూడా పింఛన్ ఆపబోమని కూటమి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ వాస్తవాన్ని మరుగుపర్చి వైసీపీ నేతలు, జగన్ మీడియా, వైసీపీ అనుకూల మీడియా పింఛన్ల తొలగింపుపై అసత్య ప్రచారాలకు తెరదీశాయి.

జగన్ పత్రిక రోతరాతలు

జగన్ రోత పత్రికలో 20వ తేదీన 'పింఛన్ల కకావికలం' శీర్షికన ప్రధాన కథనం ప్రచురించారు. అందులో కృష్ణా జిల్లా మొవ్వ మండలం పెదపూడికి చెందిన మేడం లక్ష్మి అనే మహిళ దివ్యాంగ పింఛన్ తొలగించిన కారణంగా మరణించినట్టు రాశారు. వైసీపీ హయాంలో ఒంటరి మహిళ పింఛన్ పొందిన లక్ష్మి.. ఆ తర్వాత కంటి చూపు మందగించడంతో 60 శాతం వైకల్యం ఉన్నట్టు సదరం సర్టిఫికెట్‌తో దివ్యాంగుల పింఛన్ పొందింది. కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన వెరిఫికేషన్‌లో ఆమెకు 40 శాతం మాత్రమే చూపు మందగించిందని పేర్కొంటూ అనర్హురాలిగా తేల్చారు. చాలాకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఈ నెల 18న మృతిచెందింది. అయితే జగన్ మీడియా పింఛన్ తొలగింపుకారణంగానే మరణించిందంటూ ప్రచారం చేసింది.

ప్రతీ పథకంపైనా తప్పుడు ప్రచారమే

కూటమి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని ప్రారంభించినా వైసీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా అసత్య ప్రచారాలకు తెరదీస్తోంది. తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించినప్పుడు లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత పెట్టారంటూ ఓసారి.. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదంటూ మరోసారి అసత్య ప్రచారాలు చేశారు. పింఛన్ల పెంపు, అన్నదాత సుఖీభవ విషయంలోనూ వైసీపీది ఇదే అక్కసు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.1000 పెంచింది. ఇదే వెయ్యి రూపాయల పెంపునకు వైసీపీ సర్కారు నాలుగేళ్ల సమయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ వర్తింపజేసింది. గత వైసీపీ ఓ ఇంట్లో కేవలం ఒక్కరికే ఇచ్చింది. ఇలా వైసీపీ సర్కారు కన్నా కూటమి ప్రభుత్వం ఎక్కువ సంక్షేమాన్ని ఇస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులనూ పరుగులెత్తిస్తోంది. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోంది.

పార్లమెంటు కమిటీల ఏర్పాటుకు టీడీపీ కసరత్తు

- త్రిసభ్య కమిటీలతో నేడు సీఎం చంద్రబాబు సమావేశం
- 24, 25, 26న పార్లమెంటు నియోజకవర్గాల్లో సమావేశాలు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీలతో శనివారం టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సమావేశం కానున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టిన టీడీపీ.. పార్లమెంటు కమిటీలను ఏర్పాటు చేసే నిమిత్తం ప్రతిపాదనలను స్వీకరించేందుకు నియోజకవర్గాల వారీగా త్రిసభ్య కమిటీల నియామకం చేసింది. ఈ కమిటీలు నియోజకవర్గాలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి పార్లమెంటు కమిటీలకు ప్రతిపాదనలు స్వీకరిస్తాయి. ఆ సమావేశాల నిర్వహణ ఎలా ఉండాలన్న దానిపై త్రిసభ్య కమిటీలకు చంద్రబాబు శనివారం భేటీలో దిశానిర్దేశం చేస్తారు. కాగా, 24న అనకాపల్లి, నరసాపురం, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు నియోజకవర్గ కమిటీలకు, 25న అరకు, కాకినాడ, అమలాపురం, బాపట్ల, రాజంపేట, చిత్తూరు, కడప, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ కమిటీలకు, 26న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి, నంద్యాల, కర్నూలు, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ కమిటీల ఏర్పాటుపై సమావేశాలు నిర్వహిస్తారు.

జగనే 9.56 లక్షల పెన్షన్లు తీసేశారు

- అర్హత ఉన్నవారి పింఛన్ తొలగించం
- వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి కొండపల్లి

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ఏ ఒక్కరి పింఛన్ తొలగించబోమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పింఛన్ల కోసం ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది జూలై నుంచి 65.18 లక్షల మందికి ప్రతి నెలా రూ.2,700 కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. పింఛన్లు తొలగిస్తున్నట్టు వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. జగన్ హయాంలోనే 9.56 లక్షల పింఛన్లు తొలగించారన్నారు. పింఛన్లు పొందుతున్న వారిలో చనిపోయిన పురుషుల స్థానంలో వారి భార్యలకు వితంతు పెన్షన్ మంజూరు చేసినట్టు తెలిపారు. ఇలా 1.10 లక్షల పింఛన్లను ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు మాసాలకు ఒకసారి 'ఆరు దశల అర్హత' ప్రక్రియ అంటూ దాదాపు 9.56 లక్షల పింఛన్లను తొలగించిందన్నారు. ఈ విధంగా రద్దు చేసిన వాటిలో దాదాపు 1.03 లక్షల దివ్యాంగ, 14,177 ఆరోగ్య పింఛన్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదేసమయంలో తమ వారికి బోగస్ పింఛన్లు మంజూరు చేసిందని ఆరోపించారు. ప్రత్యేకించి దివ్యాంగులు, ఆరోగ్య కేటగిరీల్లో కొంత మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయని, కోనసీమ, కడప జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో అనర్హులను గుర్తించారని తెలిపారు. వైసీపీ హయాంలో అనర్హులకు బోగస్ సర్టిఫికెట్లు జారీచేసి పెద్ద ఎత్తున ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ తమ ప్రభుత్వం సర్టిఫికెట్లను పునఃపరిశీలన చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. గత తొమ్మిది నెలల నుంచి ఈ పరిశీలన పారదర్శకంగా జరుగుతోందన్నారు. అనారోగ్యంతో ఉన్న వారి సర్టిఫికెట్లను వారి ఇళ్ల వద్దే వైద్యులు వెరిఫికేషన్ చేశారని తెలిపారు.

ఆ వైద్యులపై చర్యలు

ఇప్పటి వరకు 5.55 లక్షల మంది పింఛనుదారుల సర్టిఫికెట్లకు రీ-వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్టు మంత్రి చెప్పారు. 80 వేల మంది అనర్హులను గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. అయితే వారి అర్హతను బట్టి మరో కేటగిరీలో అర్హులుగా గుర్తిస్తూ మార్పు చేసినట్టు తెలిపారు. ఇలా 20 వేల మందిని వృద్ధాప్య పింఛన్ల కేటగిరీలోకి మార్చామన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న వారికీ దివ్యాంగ పింఛన్లను కొనసాగించనున్నట్టు చెప్పారు. సర్టిఫికెట్ల రీ-వెరిఫికేషన్‌లో అన్యాయం జరిగిందని భావిస్తే వెంటనే అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని..వాటిని పరిశీలించి అర్హత ఉంటే వెంటనే పింఛన్‌ను పునరుద్ధరిస్తారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనర్హులకు పింఛన్ మంజూరు చేయించిన వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షేమం తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

నా ఆలోచన. ఒకవైపు అత్యంత్య సంపన్నులు, మరోవైపు అంత్యంత నిరుపేదలు ఉన్నారు. అందుకే నేను పీ-4 పేరిట ప్రజలను సంక్షేమంలో భాగస్వాములను చేయాలని అనుకున్నాను. అన్ని అవకాశాలూ ఉన్న సంపన్నులు.. చివరి వరుసలో ఉన్నవారిని దత్తత తీసుకుని అట్టడుగున ఉన్న 20 శాతం ప్రజలకు చేయూత ఇచ్చేందుకు ప్రయత్నించాలి. ప్రభుత్వం చేస్తున్న దానికి ప్రైవేటు రంగం తోడ్పడాలి. ఈ రకంగా అసమానతలు తగ్గించాలన్నదే నా ధ్యేయం' అని తెలిపారు. యాజమాన్య స్ఫూర్తిని, వారి పనితీరును నియంత్రించకూడదని.. అదే సమయంలో అట్టడుగు వారిని ఎలా పైకి తేవాలన్నదీ ఆలోచించాలని సూచించారు. ఆ దిశగా విధానాలకు రూపకల్పన చేయాలన్నారు. అభివృద్ధి దిశలో ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలకు అంతటా ప్రోత్సాహక వాతావరణం కనపడుతోందన్నారు. ముఖ్యమంత్రిగా తనకు ఎన్నో అడ్డంకులు వచ్చినప్పటికీ వాటన్నింటిని అధిగమించి అభివృద్ధి కాముకుడిగా గుర్తింపు పొందానని తెలిపారు. సుదీర్ఘ కాలం సీఎంగానే గాక ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనిచేశానని.. ప్రతిపక్షంలో, ప్రభుత్వంలో ఎలా వ్యవహరించాలో తనకు తెలుసని చెప్పారు. ప్రధాని మోదీ చేపట్టిన క్వాంటమ్ మిషన్ వచ్చే జనవరిలోనే ఫలితాలు చూపిస్తుందని, అది ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రారంభమవుతుందన్నారు.

మనది బలమైన ఆర్థిక వ్యవస్థ..

ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ తట్టుకోగలిగిన బలమైన ఆర్థిక వ్యవస్థ భారత్‌కు ఉందని సీఎం తెలిపారు. అమెరికా సుంకాలవంటి కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ అవన్నీ తాత్కాలికమేనని స్పష్టం చేశారు. భారతదేశ శక్తిని ఎవరూ అడ్డుకోలేరని, 2047 నాటికి భారతదేశం, భారతీయులు ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలదొక్కుకుంటారని ధీమా వ్యక్తంచేశారు. దేశ ఆర్థికవ్యవస్థకు సమస్యలు ఉన్నప్పటికీ వాటిని గుర్తించి పరిష్కరించుకోగల సామర్థ్యం మనకు ఉందన్నారు. గత పదేళ్లకు పైగా భారతదేశం అన్ని అవాంతారాలను అధిగమించి ఆర్థిక శక్తిగా ఆవిర్భవించిందని.. మనకు సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టారని.. ప్రపంచంలోనే బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన మోదీ మన ప్రధాని కావడం మనకు గర్వకారణమని అన్నారు. అమెరికా, చైనాలను మించి ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నామని చెప్పారు. 1991లో ఆర్థిక సంస్కరణలు చేపట్టడం, అన్ని రంగాల్లో ముందడుగు వేయడంతో ప్రయోజనాలు సమకూరడం, అత్యధిక మాన వవనరులు ఉండడం దేశానికి వరాలుగా మారాయన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యువజనాభా ఉండడం మనకు లభించిన అతిపెద్ద అవకాశమని చెప్పారు. అన్నిటికంటే మించి ఈ దేశానికి మోదీ నాయకుడు కావడం గొప్ప పరిణామంగా అభివర్ణించారు. అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా ఉండాలనేది లక్ష్యంగా పెట్టుకోవాలని, ఆ లక్ష్యాన్ని సాధించే సామర్థ్యం భారత్‌కు ఉందని చెప్పారు.



16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పణగారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తప్పుడు ప్రచారాలకు తావివ్వొద్దు

- వర్షాలు, వరదల పరిస్థితిపై ప్రజలకు కచ్చితమైన సమాచారం ఇవ్వండి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు
- కృష్ణా, గోదావరి వరదలు, ఎరువులపై సమీక్ష
- ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ ఘటనపైనా ఆరా
- ఢిల్లీ నుంచి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వరదలు, భారీ వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం కచ్చితమైన సమాచారం ఇవ్వాలని, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సమస్య వచ్చాక అధికార యంత్రాంగం స్పందించడం కన్నా ముందుగానే సన్నద్ధమై ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కృష్ణా, గోదావరి నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, వరదల పరిస్థితిపై శుక్రవారం ఢిల్లీ నుంచి ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో పాటు వివిధ శాఖల అధికారులతో తాజా పరిస్థితులపై ఆరా తీశారు. రెండు నదులకు వస్తున్న ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలకు సంబంధించిన పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. ఎగువ ప్రవాహాలతో కృష్ణా నదిలో శ్రీశైలం నుంచి 5.20 లక్షల క్యూసెక్కులు, నాగార్జున సాగర్ నుంచి 4.32 లక్షలు, పులిచింతల నుంచి 4.07 లక్షలు, ప్రకాశం బ్యారేజీ నుంచి 4.53 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గోదావరి నదిలోనూ భారీగా వరద ప్రవాహాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 13,42,307 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోందని చెప్పారు. గోదావరి వరదల కారణంగా పరివాహక ప్రాంతాల్లోని లంక గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని వివరించారు. ఈ ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎరువులు, పురుగు మందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం సమీక్ష చేశారు.

పైప్ మొత్తం తనిఖీ చేయండి

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ధరియాల తిప్ప సమీపంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్ ఘటనపై ఆ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సీఎం మాట్లాడారు. గురువారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు గ్యాస్ లీక్‌తో మంటలు భారీగా ఎగిసి పడ్డాయని, గంటన్నర వ్యవధిలోనే సరఫరా నిలిపి వేసి, లీక్‌ను అరికట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని వివరించారు. లీకైన పైప్‌ను మొత్తం తనిఖీ చేసి, సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని సూచించారు.

జగన్ ముసుగు మళ్లీ తొలగింది

- దోచుకున్నది దాచుకోవడానికే మోదీకి మద్దతు
- బీజేపీ అంటే బాబు... జగన్... పవన్ అని మళ్లీ నిరూపించారు: పీసీసీ చీఫ్ షర్మిల



అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతు ఇవ్వడం ద్వారా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ముసుగు మళ్లీ తొలగిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. బీజేపీకి బీ-టీమ్ అని వైసీపీ ప్రకటించుకున్నట్లు అయిందని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడని మరోసారి రుజువైందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో మోదీ పక్షమే ఉందని తేటతెల్లమై పోయిందని ఆమె తెలిపారు. అందుకే.. బీజేపీ అంటే.. బాబు, జగన్.. పవన్ అని స్పష్టమైపోయిందని పేర్కొన్నారు. బీజేపీతో టీడీపీ జనసేనది తెరబయట పొత్తయితే.. వైసీపీది తెరవెనుక అక్రమ పొత్తని షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో అధికార విపక్షాల కుస్తీ.. కేంద్రంలో బీజేపీతో దోస్తీ అన్నట్లుందని.. ఢిల్లీలో మతపిచ్చి బీజేపీతో జగన్ దోస్తీ చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, కేసులకు భయపడి బీజేపీకి జగన్ మళ్లీ దాసోహం అన్నారని, ఐదేళ్లపాటు దోచుకున్నది దాచుకోడానికే బీజేపీకి జగన్ జై కొట్టారని పేర్కొన్నారు. మోదీ అక్రమాలను నిర్భయంగా బయట పెడుతున్న ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై జగన్ ఒంటి కాలిపై లేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతిపక్షాలన్నీ కలసి రాజకీయాలతో సంబంధం లేని ఒక తెలుగు బిడ్డను, న్యాయ నిపుణుడిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే... ఆయనకు కాకుండా బీజేపీ అభ్యర్థికి ఎలా మద్దతిస్తారని జగన్‌ను ప్రశ్నించారు.

ఆ ఫోన్లను ఓపెన్ చేయలేదు

» నిందితుడు సహకరించలేదు: హైకోర్టుకు సిట్ వివరణ

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తన భర్త ఫోన్లలోని సమాచారం లీక్ చేశామని మద్యం కుంభకోణం నిందితుడు వెంకటేశ్ నాయుడు భార్య మహిత చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని సిట్ కోర్టుకు వివరించింది. ఫోన్లను ఓపెన్ చేసేందుకు నిందితుడు సహకరించలేదంది. దర్యాప్తులో భాగంగా తన భర్త నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలోని సమాచారాన్ని సిట్ అధికారులు మీడియాకు లీక్ చేయడంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నిందితుడు వెంకటేశ్ నాయుడు (ఏ34) భార్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం విచారించారు. సిట్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిరోహిత్ వాదనలు వినిపిస్తూ.. కోర్టు అనుమతితోనే ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని వివరించారు. నిందితుల వైపు నుంచి కూడా మీడియాకు సమాచారాన్ని లీక్ చేసి ఉండవచ్చునని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, విచారణ వాయిదా వేయాలని కోరారు. మమత తరఫున సీనియర్ న్యాయవాది వీఆర్ ఆవుల వాదనలు వినిపించారు. అనంతరం.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణను వచ్చేనెల 2కి వాయిదా వేసింది.

ప్రభుత్వం కక్ష సాధిస్తోంది: మాజీ మంత్రి పెద్దిరెడ్డి

రాజమహేంద్రవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం కక్ష సాధిస్తోంది. దీనికి కచ్చితంగా ప్రతిఫలం తీసుకోక తప్పదు. మిథున్‌రెడ్డి ఆరోగ్యంగా, ధైర్యంగానే ఉన్నాడు. మాకైతే పశ్చాత్తాపం లేదు' అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మద్యం స్కాం కేసులో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆయన తండ్రి రామచంద్రారెడ్డి, ఎస్వీయూ మాజీ వీసీ రాజారెడ్డి, విఠల్‌రెడ్డి శుక్రవారం ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం రామచంద్రారెడ్డి జైలు బయట మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత కక్ష సాధింపునకు దిగజారిందో చూడొచ్చన్నారు.

దౌర్జన్యాల 'దాసరి'

» పోలీసు స్టేషన్‌కు క్యూ కడుతున్న బాధితులు

విజయవాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అనుచరుడు, వైసీపీ 'కథ'లతో సినిమాలు నిర్మించిన దాసరి కిరణ్ కుమార్‌ను కేసులు వెంటాడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేసిన అరాచకాల్లో బాధితులైనవారు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో కిరణ్‌పై నమోదవుతున్న కేసుల సంఖ్య పెరుగుతోంది. సొంత బంధువు నుంచి రూ.4.50 కోట్లు అప్పుగా తీసుకుని దాన్ని తిరిగి చెల్లించమని అడిగినందుకు అనుచరులతో దాడి చేయించిన విషయం తెలిసిందే. దీనిపై నమోదైన కేసులో కిరణ్‌తోపాటు ఆయన అనుచరులు స్టేషన్ బెయిల్ ఉన్నారు. ఇక, ఆ తర్వాత కిరణ్ బాధితులు పటమట పోలీస్‌స్టేషన్‌కు క్యూ కడుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక వెలుగు వెలిగిన కిరణ్.. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో చెలరేగిపోయారు. హైదరాబాద్‌లో ఒకరికి భూమి విక్రయించడానికి అడ్వాన్స్ తీసుకుని, దానిని మరొకరికి విక్రయించారు. ఇదేంటని ప్రశ్నించిన బాధితులపై కిరణ్ అధికార జులుం ప్రదర్శించారు. పటమటకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయనకు స్థలాన్ని విక్రయిస్తానని చెప్పి రూ.50 లక్షలు తీసుకున్న కిరణ్.. తర్వాత ఆ భూమిని మరొకరికి విక్రయించారు. దీంతో డబ్బులు తిరిగి ఇవ్వమని కోరిన ఆయనను బెదిరించారు. తాజాగా బాధితుడు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కోవకు చెందిన బాధితుల్లో మరొకరు రామవరప్పాడులో ఉన్నట్టు తెలిసింది.

ఎవరీ కిరణ్?: దాసరి కిరణ్ గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వ్యక్తి. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం కూటమిలోని ఓ పార్టీ ఎంపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. కిరణ్‌ను జగన్ టీటీడీ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా నియమించారు. కేఎల్ వర్సిటీ అధినేత కుమారుడితో చిత్రాన్ని నిర్మించి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు.

కాడెద్దులుగా కొడుకు, కూతురు



పెండ్లిమర్రి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్న రైతన్నలు సొంత పొలంలో వ్యవసాయం చేయాలన్నా సాగు పెట్టుబడి భారమవుతోంది. కలుపు తీసేందుకు కూలి డబ్బులు ఎక్కువ అవుతున్నాయి. దీంతో వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం మమ్మొసిద్దుపల్లె గ్రామానికి చెందిన రైతు బండి చంద్రశేఖర్‌రెడ్డి తన కొడుకు ప్రహ్లాదరెడ్డి, కూతురు చామంతిని కాడెద్దులుగా కట్టి పొలంలో కలుపు తీశాడు. ఈయనకు మొత్తం 9.5 ఎకరాల పొలం ఉంది. ఇందులో 3 ఎకరాలలో చామంతి సాగు చేశారు. ఒక్కో ఎకరానికి దాదాపు రూ.70 వేలు ఖర్చు అవుతుంది. నాలుగైదుసార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. ఎకరా కలుపు తీయడానికి రూ.1500 అవుతుంది. ఈ నేపథ్యంలో సాగు ఖర్చు తగ్గించుకోవడానికి రైతు ఇలా తమ చామంతి తోటలో కొడుకు, కూతురును కాడెద్దులుగా మార్చుకున్నాడు. కాగా.. ఈయన పిల్లలిద్దరూ ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

కొండకు కవచం



విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వెనుక ఉన్న కొండ ఇది. దీని నుంచి రాళ్లు పడకుండా కొండకు ఫెన్సింగ్ వేస్తున్న కార్మికులు

యూరియా.. సమస్య ఎందుకయా?

» ఆందోళన వద్దంటున్న ప్రభుత్వం
» అవసరానికి సరిపడా ఎరువులు
» ఒక్కసారిగా పెరిగిన వినియోగం
» రబీ సీజన్‌కూ ఇప్పుడే కొనుగోళ్లు
» సమస్యకు అదే కారణమని విశ్లేషణ
» జిల్లాల వారీగా పర్యవేక్షణ



అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేస్తోంది. ఖరీఫ్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, ప్రణాళిక ప్రకారం ఎరువులను సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత సీజన్ అవసరాలకు అంచనాకు మించి 83వేల టన్నుల యూరియా అదనంగా అందుబాటులోకి తెస్తున్నట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను వినియోగిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు చెప్తున్నారు. గతేడాది ఖరీఫ్ కంటే ప్రస్తుత సీజన్‌లో ఎక్కువగానే ఎరువులు సరఫరా చేశామని చెప్తున్నారు. గత ఖరీఫ్‌లో 8.76.928 టన్నుల ఎరువులు వాడగా, ఈ ఏడాది ఇప్పటికే 10.96.239 టన్నులు వినియోగించారు. ఖరీఫ్ పంటలతో పాటు రానున్న రబీ సీజన్‌కూ ఇప్పుడే ఎరువులు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో వేసిన పంటల అవసరాలకు మాత్రమే తగిన యూరియా కొనుగోలు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. వ్యవసాయేతర అవసరాలకు మళ్లించొద్దని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, డీఏపీ, ఇతర ఎరువులు కొరత లేకుండా నిఘా పెట్టాలని విజిలెన్స్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ఖరీఫ్‌లో ఎరువుల వినియోగం (టన్నుల్లో)

ఎరువు	నిరుడు	ఈఏడాది	వ్యత్యాసం
యూరియా	3,74,290	4,57,727	83,436
డీఏపీ	1,17,581	1,37,884	20,302
కాంప్లెక్స్	2,83,866	3,74,229	90,363
పొటాష్	39,054	54,276	15,222
ఎస్ఎస్‌పీ	62,136	72,123	9,987

ఢిల్లీ నుంచి సీఎం సమీక్ష

సీఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. విజిలెన్స్ అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో ఎరువుల సరఫరాపై నిత్యం ట్రాకింగ్ పెట్టి, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కేసులు పెట్టాలని కలెక్టర్లను సీఎస్ విజయానంద్ ఆదేశించారు.

యూరియా దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రాష్ట్రంలోని ఎరువుల గోదాములు, హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ షాపుల్లో విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. యూరియా అక్రమ నిల్వ, దారి మళ్లింపుపై సమాచారాన్ని సమీపంలోని విజిలెన్స్ కార్యాలయానికి తెలియజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్తా కోరారు.

యూరియా సమస్య తక్షణ పరిష్కారానికి చర్యలు

» వ్యవసాయ మంత్రి అచ్చెన్న ఆదేశం

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా సరఫరాలో సమస్యను గుర్తించి, రైతులకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. యూరియా సరఫరా, లభ్యతలో రైతులకు తప్పుడు సందేశం వెళ్లకుండా చూడాలన్నారు. యూరియా సమస్యపై సీఎస్, డీజీపీ, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ డీజీలు, సీఎంవో అదనపు కార్యదర్శి, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సహా జిల్లా కలెక్టర్లు, జేసీలు, డీఏవోలతో శుక్రవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'ఖరీఫ్ అవసరాల కన్నా కేంద్రం ఇప్పటి వరకు రాష్ట్రానికి యూరియా ఎక్కువే కేటాయించినా క్షేత్రస్థాయిలో రైతులకు పంపిణీలో చాలాచోట్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పంపిణీ యాజమాన్యం సరిగ్గా లేకపోవడం వల్ల యూరియాపై ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా తప్పుడు ప్రచారం జరుగుతోంది. మార్క్‌ఫెడ్, ప్రైవేట్ వ్యాపారులకు ప్రస్తుతమున్న 50:50నిష్పత్తిని 70:30నిష్పత్తిలో ఉండేలా చూడాలి. వ్యవసాయేతర అవసరాలకు యూరియా మరలకుండా గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ, పరిశ్రమలు, ఇతర శాఖలతో సంయుక్త పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేసి, తనిఖీలు చేపట్టాలి. మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ నుంచి గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాలకు సకాలంలో ఎరువులను సరఫరా చేయాలి' అని ఆదేశించారు. రానున్న రబీ సీజన్ కోసం రైతులు కూడా ఇప్పటి నుంచే యూరియా కొనుగోలు చేయవద్దని అచ్చెన్న విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో యూరియా సరఫరాలో ఇబ్బందులంటాయనే తప్పుడు ప్రచారంతో రైతులు అవసరం కన్నా అధికంగా కొనుగోలు చేసి, నిల్వ చేస్తున్నారని తెలిపారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ యూరియాను దారిమళ్లించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాల్లో ఎరువుల సరఫరాపై హెల్ప్‌లైన్ నంబర్లతో ప్రచారం చేయాలని సూచించారు.

బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి: సీపీఐ

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి రైతులకు సక్రమంగా సరఫరా చేసేలా తగు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. యూరియాపై రూ.100, డీఏపీపై రూ 200 చొప్పున అదనంగా వసూలుచేస్తూ బ్లాక్‌లో అమ్ముతుంటే.. ప్రభుత్వ అధికారులు, విజిలెన్స్ అధికారులు, పోలీసులు ఏం చేస్తున్నారో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



కన్సల్టెన్సీ కలరింగ్!

ముగ్గురు ఉద్యోగులకు 3.5 కోట్ల జీతం

ఎక్సైజ్ శాఖలో వారిదే హడావుడి

» ప్రతి పాలసీ తామే చేస్తున్నట్టు బిల్డప్
» అధ్యయనం చేసేది శాఖ అధికారులు
» ఆ తర్వాత పీపీటీలతో కన్సల్టెన్సీ షో..
» కీలక సమావేశాలకు అధికారులు దూరం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎక్సైజ్ శాఖలో పాలసీలు రూపొందిస్తోంది ఎవరో తెలుసా..? ఇంకెవరు... ఉన్నతాధికారులు లేదంటే ఆ శాఖ సీనియర్ అధికారులే కదా.. అనుకుంటే పొరపడినట్టే..! ఎందుకంటే... ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) అనే కన్సల్టెన్సీనే మొత్తం పాలసీలు రూపొందిస్తోంది! అందుకుగానూ ఆ సంస్థకు ఎక్సైజ్ శాఖ ఏడాదికి రూ.3.5 కోట్లు చెల్లిస్తోంది. అంటే నెలకు అక్షరాలా రూ.29 లక్షలన్నమాట...! అయితే... అంత భారీ మొత్తం తీసుకుంటూ, పెద్ద పాలసీలు రూపొందిస్తున్న ఆ కన్సల్టెన్సీలో పనిచేస్తున్నది ఎంతమంది ఉద్యోగులో తెలుసా..? ముగ్గురంటే ముగ్గురే...! వారి సగటు జీతం నెలకు దాదాపు రూ.10లక్షలు. ఎక్సైజ్ శాఖలోనే కాదు... మొత్తం ప్రభుత్వంలో అయినా అందులో సగం జీతం తీసుకునే ఉన్నతాధికారి ఒక్కరు కూడా లేరు. కేవలం ముగ్గురు ఉద్యోగులతో ఉచిత సలహాలిస్తూ... మొత్తం తామే చేస్తున్నట్లుగా ఆ కన్సల్టెన్సీ బిల్డప్ ఇస్తోంది..! దానికి ఉన్నతాధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. చివరికి శాఖలోని సీనియర్ అధికారులను సైతం కీలకమైన షాపులు, బార్ పాలసీలకూ దూరం చేస్తున్నారు. ఫలితంగా ఇప్పుడు బార్ పాలసీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో ఎప్పుడూలేనట్టుగా... పట్టుమని నలుగురు ఉద్యోగులు కూడా లేని కంపెనీకి బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనానికి శాఖ అధికారులను పంపి, ఆ సమాచారాన్ని కన్సల్టెన్సీ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ)లు రూపొందించి షో చేయడం చూసి ఆ శాఖ అధికారులే విస్మయానికి గురవుతున్నారు.

ఆయన బలహీనతే వీరి బలం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు పీపీటీలు అంటే చాలా ఇష్టం. మాటల్లో చెప్పేదాని కంటే స్క్రీన్‌పై ప్రజెంటేషన్ వేసి చూపిస్తే ఆయన ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఈ బలహీనతనే కొందరు అధికారులు తమ బలంగా మార్చుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కన్సల్టెన్సీని తీసుకొచ్చారు. గతంలోనూ పాలసీల రూపకల్పన సమయంలో ఎక్సైజ్ శాఖ కన్సల్టెన్సీలను ఉపయోగించుకునేది. అయితే కేవలం తాత్కాలికంగా కొన్ని బాధ్యతలు మాత్రమే అప్పగించేది. కానీ ఇప్పుడు ఈవై సంస్థకు కమిషనరేట్‌లోనే స్థానం కల్పించారు. ఎక్సైజ్‌పై ఎలాంటి పట్టులేని ఆ సంస్థకు చెందిన ఓ ఉద్యోగి... శాఖ సీనియర్ అధికారులకే సలహాలిస్తున్నారు. సీఎంవోకు వెళ్లి ప్రైవేటు మద్యం షాపుల పాలసీ మొత్తం తానే తయారు చేశానని కలరింగ్ ఇచ్చారు.

బార్ పాలసీపై వ్యతిరేకత

సెప్టెంబరు నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి రానుంది. దీనిపై బుధవారం ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల బార్ పాలసీపై సీఎం వద్ద జరిగిన సమీక్షలోనూ ఈవై కన్సల్టెన్సీ రూపొందించిన పీపీటీనే ప్రదర్శించారు. దాని ఆధారంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు కచ్చితంగా రావాలనే నిబంధన పెట్టారు. దీంతో మద్యం వ్యాపారులు సమావేశాలు పెట్టుకుని ఎవరూ దరఖాస్తులు సమర్పించవద్దని నిర్ణయం తీసుకునే పరిస్థితి వచ్చింది. ఇతరత్రా కారణాలతో ఈసారి బార్ పాలసీ విఫలమవ్వొచ్చనే వాదన వినిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం... అసలు బార్ పాలసీ రూపకల్పనలో ఆ శాఖ అధికారులను భాగస్వామ్యం చేయకపోవడమే.

షాపుల పాలసీలో 200 కోట్లు నష్టం

శాఖలో అనుభవం ఉన్న అధికారుల అభిప్రాయాలను వదిలేసి, కన్సల్టెన్సీని నమ్ముకున్న ఫలితంగా ప్రైవేటు షాపుల పాలసీలో దాదాపు రూ.200 కోట్ల ఆదాయ నష్టం వచ్చింది. మద్యం షాపుల పక్కనే గతంలో పర్మిట్ రూమ్‌లు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించింది. అయితే ప్రైవేటు షాపుల పాలసీలో అవి ఉండాలని శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పర్మిట్ రూమ్‌లకు అనుమతి నిరాకరించారు. దీంతో ఆ రూమ్‌ల ద్వారా వచ్చే ఫీజులు రూ.200 కోట్లు రాలేదు. తీరా ఏడాది తర్వాత పర్మిట్ రూమ్‌లు ఉండటం చాలా అవసరం అంటూ వాటి అనుమతికి ఎక్సైజ్ శాఖ ఇటీవల ఉత్తర్వులిచ్చింది. ఇదే విషయాన్ని గతేడాది శాఖ అధికారులు చెప్పినా ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టడంతో నష్టం మిగిలింది.

చెవిరెడ్డికి బెయిల్‌పై ఏమంటారు?

» సిట్ అధికారులకు ఏసీబీ కోర్టు ప్రశ్న
» కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

విజయవాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులను కోర్టు వివరణ కోరింది. దీనిపై ఏమంటారని ప్రశ్నించింది. తనకు మధ్యంతర లేదా రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో చెవిరెడ్డి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై శుక్రవారం విచారణ జరిగింది. ఈ రెండు పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్ అధికారులను కోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. మరోవైపు, ఇంటి నుంచి వచ్చే భోజనం వారాలను మార్పు చేయాలని చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టేసింది. చెవిరెడ్డికి ఇంటి నుంచి వారంలో మూడు రోజుల పాటు భోజనాన్ని అందించేందుకు కోర్టు అనుమతించింది. కోర్టు నిర్దేశించిన వారాల్లో కాకుండా మంగళ, గురు, ఆదివారాల్లో భోజనాన్ని అనుమతించాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు.

చెవిరెడ్డిని తేలేం

చెవిరెడ్డికి రిమాండ్ పొడిగింపు విషయంలో ఆయనను వర్చువల్‌గా కోర్టుకు హాజరుపరుస్తామని సిట్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఏసీబీ కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. నిందితులకు ఏసీబీ కోర్టు 26వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ఆ రోజున నిందితులందరినీ కోర్టులో హాజరుపరచాల్సి ఉంది. అయితే, చెవిరెడ్డిని కోర్టుకు తీసుకురాలేమని, ఆయనను వర్చువల్‌గా హాజరుపరుస్తామని, అనుమతి ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

బాలాజీ, నవీన్ బెయిల్‌పై 29న తీర్పు

గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మద్యం కుంభకోణం కేసు నిందితులు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ బెయిల్ పిటిషన్‌పై తీర్పును 29న వెలువరిస్తామని ఏసీబీ కోర్టు తెలిపింది. వీరి బెయిల్ పిటిషన్లపై శుక్రవారం వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్, నిందితుల తరఫున మన్మధరావు వాదనలు వినిపించారు.

రాచమల్లుపై కేసు కొట్టివేత

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై నమోదైన కేసును విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు శుక్రవారం కొట్టేసింది. ప్రొద్దుటూరులో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేస్తుండగా.. అధికారుల విధులకు ఆటంకం కలిగించి, ధర్నా చేశారని పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితోపాటు మరో 27 మందిపై నమోదు చేసిన ఈ కేసులో విచారణ పూర్తవడంతో కేసును కొట్టివేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.





ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం వరద ఉధృతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద గోదావరిలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే దృశ్యాలు

నిలకడగా గోదావరి

» ధవళేశ్వరం వద్ద వరద క్రమంగా తగ్గుముఖం
» రాత్రి 7 గంటలకు 14.20 అడుగులకు నీటిమట్టం
» అత్యధికంగా 13,57,119 క్యూసెక్కులు సముద్రంలోకి
» లంక గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ నీట మునక
» పోలవరం నుంచి 11.87లక్షల క్యూసెక్కులు విడుదల
» ముంపు మండలాలను వదలని వరద

ధవళేశ్వరం/వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత సీజన్‌లో మొదటిసారిగా ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి ఉధృతంగా ప్రవహించింది. కాటన్ బ్యారేజీ వద్ద గురువారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 18 గంటల వ్యవధిలో అర్ధరాత్రి నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో 12,85,832 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. శుక్రవారం మధ్యాహ్నం 2గంటల వరకు క్రమంగా పెరిగిన నీటిమట్టం 14.30 అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగింది. ఈ సమయంలో 13,57,119 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలిపెట్టారు. రాత్రి 7గంటలకు నీటిమట్టం 14.20 అడుగులకు చేరగా 13,48,226 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. శనివారం ఉదయం రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే అవకాశం ఉంది.

పడవలపైనే ప్రయాణాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలను వరద ముంచెత్తుతోంది. ఆలమూరు, ముమ్మిడివరం, కె.గంగవరం, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి తదితర మండలాల్లోని లంక గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ వరదలో మునిగిపోవడంతో పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద ఇటీవల నిర్మించిన కాజ్‌వే గోదావరి వరద ఉధృతికి కొట్టుకుపోయింది.

నిత్యావసరాల కోసం ఇక్కట్లు

అల్లూరి జిల్లాలోని చింతూరు డివిజన్‌లో శబరి, గోదావరి ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 4గంటలకు 50.10 అడుగుల మేర ప్రవహించి, క్రమంగా తగ్గడం మొదలైంది. సాయంత్రం 6గంటలకు 43.90 అడుగులకు చేరుకుంది. చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో నిత్యావసరాల కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మరోవైపు ఏలూరు జిల్లాలో ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరుల్లోని గ్రామాలను వరద వీడడం లేదు. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 11,87,497 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

సుంకేసులకు 1.40 లక్షల క్యూసెక్కులు

కర్నూలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద ప్రవాహం కొనసాగుతోంది. కర్నూలు నగర శివారులో 1,35,402 క్యూసెక్కులతో ఉధృతంగా ప్రవహిస్తోంది. సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం 1.40 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువన శ్రీశైలానికి వదిలేస్తున్నారు. ఇక తుంగభద్ర డ్యాంకు 80,500 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. కాగా, శ్రీశైలం జలాశయానికి 4,73,039 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, స్పిల్‌వే 10 క్రస్ట్‌గేట్లను పైకెత్తి, ఏపీ తెలంగాణ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా కలిపి 5,20,111 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

25న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాలు బలహీనంగా ఉండటంతో శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 25న వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని పేర్కొంది.



కర్నూలు నగరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.